ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



4 అణాలు
17-2-'54

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY


పంచతంత్రం
సంధి-విగ్రహం
కర్త:- విశ్వాత్ముల నరసింహమూర్తి
గౌడ దేశమున అగ్రహారమున దేవశర్మయను విప్రుడు కలడు. సంతానము లోటు తక్క ఏలోటును లేక యతడు సంసారము చేయుచుండె.
అతని భార్య యాజ్ఞసేని - మాతృత్వము కోరినదై - కనిపించిన యోగులకూ, - పుట్టలకూ, చెట్లకునూ - పూజ లెన్నో చేసినది.
కొంతకాల మిట్లు గడువ దైవము అనుగ్రహించి ఆమె కొక కుమారు నిచ్చె!
తలి దండ్రులు పసివానిని కాలు క్రింద పెట్టకుండ గారాబముగా పెంచిరి.
ఒక రోజున యాజ్ఞసేని - కుమారుని నిద్రపుచ్చి - ముంగిస నచట తోడు వుంచి - పొరుగు వీధి చివరనున్న - పుట్టింటికి తాబోయెను.
ఇంతలోన రాజభటుడు దేవశర్మ ప్రాంగణాన నిలిచి యతని కేకవేసె.
"ఓ అయ్యా! మా మహాప్రభువు శ్రాద్ధ దానమును స్వీకరించుటకు మిమ్ముల పిలుచుకు రమ్మన్నారు; ఆస్థానానికి వెంచేయండి!"
(తనలో) "ఆహా! నేటికి గద భూపతికి దయ కలిగెను; సాహితీ పురులింతమంది! - వారందరినీ కాదని నాకోసమె కబురంపెను!!"
"కాని యిల్లు విడిచి వెళ్ళుటెట్లు? ఇంటిదేమో మునిగినట్లు ఇపుడే ఈ పసివానిని ఒంటరిగా వదలిపోయె! ... ... ఆఁ! ఉపాయము తోచినది!"
"సరేనోయ్, నీవు పొమ్ము; వెనువెంటనే వచ్చెదను."
విప్రుడు తను పెంచుచున్న - ముంగిసను చేర పిలిచి - ఏమేమో సంజ్ఞచేసి - పసి వానిని భద్రముగా - కాపాడుమని చెప్పెను.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

సంపుటము 47
సంచిక 23
17.2-54

Founder : K. NAGESWARA RAO

విజయ మాఘ శుద్ధ పూర్ణిమ బుధవారం



ఫొటోకి పోజు

వి. పుల్లేశ్వర్ —విజయవాడ.

విషయానుక్రమణిక

ముఖచిత్రం :—

నటి జయలక్ష్మి.

కాలక్షేపం

క్షీరము మున్ను నీటి కొసగన్
స్వగుణంబులు దన్ను జేరుటన్; -
క్షీరము దప్తమౌట గని
చిచ్చుతికిన్ వెతచే జలంబు; - దు
ర్వార సుహృద్విపత్తిగని
వహ్ని జొరన్ జనె దుగ్ధ; - మంతలో
నీరముగూడి శాంతమగు; -
నిల్చు మహాత్ముల మైత్రి యీగతిన్.

తా॥ తనతో నీరు కలిసియుండుటచేత క్షీరము తన గుణములను ఆ నీటికి అబ్బునట్లుగా చేసెను. పాలు కళపెళ కాచబడుచుండుట చూచి, నీరు దుఃఖించి, ఆ దుఃఖంచేత మంటలో ఉరికెను. తన మిత్రుడైన నీరు అటువంటి విపత్తుపాలైనందువల్ల పాలుకూడా నిప్పులో దుముకుటకు సిద్ధమయ్యెను. అంతలో పొంగుచున్న పాలపై నీరును జల్లుటవల్ల, నీరు తనతో తిరిగి చేరుకొన్న కారణముచేత, పాలు పొంగుతగ్గి శాంతించెను. మహాత్ముల స్నేహము యీరీతిగా ఉంటుంది.

పాలతో చేరిన నీరుమూలంగా పాలు పల్చనైపోతాయి. పాలయొక్క చిక్కదనం పోతుంది. *Lacto-meter* (లాక్టోమీటరు) అనేటటువంటి థర్మామీటరును పోలిన సాధన పరికరం మూలంగా పాలలో నీరు ఎంతభాగం కలుపబడినదో వెంటనే చెప్పవచ్చు. సాధారణంగా అసలైన నిసలైన ఆవుపాలకు లేదా గేదెపాలకు ఒక పరిమితివరకు చిక్కదనము (సాంద్రత) ఉంటుంది. అంతకంటె తక్కువ చిక్కదనం ఉన్నట్లయితే; నీళ్లు కొంతవరకు కలుపబడినట్లుగా ఊహించాలి. పాలయొక్క చిక్కదనము (సాంద్రత) ఎన్ని డిగ్రీలు తగ్గిఉంటే, అన్నిపాళ్ళ నీళ్ళు పాలలో హెచ్చుగా కలుపబడినట్లు నిర్ధారణ చేయవలసి ఉంటుంది. పాలలోని నీళ్ళపాలు (వంతు) ఎక్కువైన కొద్దీ, పాలు అంతకంతకు అస్వచ్ఛమైనవిగా, అంతకంతకు మరింత కల్తీ సరకుగా ఎంచడమగును. ఆ విధంగా ఎంచినందువల్ల పాల విలువ హరించిపోవును. కనుక పాలలోని నీరుపాలు హెచ్చినకొలదీ, పాల విలువ ఆ నీరువల్ల నీరసించును. ఇందుమూలంగా విశదమవుతున్న విషయము ఏమిటంటే, పాలకు నీళ్ళతో సాంగత్యమువల్ల, పాలకు లోపాలు ఏర్పడినట్లే భావించాలి. అటువంటి పాలు అమ్మినవారిపై తాపాలు కోపాలు కొన్నవారికి రాకమానవు. కాని, పల్చని పాలను తాగుటవల్ల, అట్టి పాలు పసిపాపలకు సులభంగా జీర్ణం కాగలవు. బాలుడు త్రాగే పాలు సులభంగా జీర్ణమైనప్పుడే అది వానికి రక్తగతమై, రక్తము పాలు కాగలదు. జీర్ణముకాని పాలు మూలముగా బాలుడు వ్యాధులపాలు కాగలడు. ఈవిధంగా విమర్శించినట్లయితే పాలలో నీరు చేరిన, ఆ పాలు మేలు చేయును.

ఏమైనప్పటికీ, కించిత్తయినా మంచి నీళ్లు కలుపకుండా పితికిన గుమ్మపాలు (ఉష్ణధారలు) కుండలో కాచినప్పటికీ, ఆవిరి బాగావస్తుంది. దానిలో కొంత నీరుఉండడం వల్లనే ఆవిధంగా ఆ నీరు ఆవిరియై పైకి వస్తోంది. నీరు కలియని పాలుకూడా బాగా కాచినప్పుడు పొంగుతాయి. పొంగు వచ్చినప్పుడు మనము కనిపెట్టి చూడకపోతే, ఆ పాలు పొంగి పొయ్యిలో పడడం తప్పదు. కనుక, నీరు కలిసిన పాలుమాత్రమే పొంగు వచ్చి అగ్నిలో పడుననిన్నీ, నీరు కలియని అచ్చమైన గుమ్మపాలు పొంగి పొయ్యిలో పడవనిన్నీ భావించడం భావ్యం కాదు. కాబట్టి పాలు పొంగుటకు రెండు ముఖ్య కారణాలు ప్రత్యక్షంగా కన్పిస్తున్నాయి. పాలపైన మీగడ ఒక తెరవలె ఏర్పడుతుంది. ఆ మీగడతెరలోనుంచి పాలలోని నీటి ఆవిరి పైకి త్రోసికొని రావలెనని ప్రయత్నిస్తుంది. అట్టి ప్రయత్నంలో ఆ మీగడతెరతో సహా కళపెళ కాగడి పాలుకూడా నీటిఆవిరి బలంతో పైకొక తరంగమువలె తరలివచ్చి, గిన్నె అంచులను దాటి అగ్గిలోపడి ఆహుతికావడం తటస్థిస్తోంది.

ఇంతదూరం యీ విషయాన్ని వితర్కించటం ఎందుకంటే, అచ్చమైన గుమ్మ పాలలోకూడా నీరు చేరిఉంది. కనుక "నీరు లేని పాలు, పేరులేని మనిషి, ధరణిలోన లేవు తరచి చూడ." అందువల్ల పాలలో నీరు లేకపోతే అవి పాలు కానే కావు. పాలను బాగాకాచి కలియబెట్టుతూ నీళ్ళు అన్నీ మరగి తరగి ఇగిరి ఎగిరిపోవునట్లుగా చేసినట్లయితే, చిట్టచివరకు మిగిలేది ఏమిటి? పాలకోవా మిగులుతుంది. పాలలో ఇమిడియున్న పదార్థము గడ్డకట్టినట్లుగా మనకు మిగిలింది. అది పాలలోనిపదార్థం కావచ్చు. కాని, అది పాలుగా చలామణీ అయ్యేదికాదు. నీరుతో చేరి ఉన్నదే పాలు - ద్రవ్యంగా ఉండేది పాలు - అందువల్ల నీరులేనిపాలు పాలు కావు. అటువంటి అవినాభావసంబంధం క్షీరానికీ, నీరానికీ స్వతస్సిద్ధంగా ఉంది.

మానవశరీరంలో ఉన్నటువంటి అనేక ధాతుపదార్థాలు సహజసిద్ధంగా కొన్ని పాళ్ళలో సమ్మిళితమై ఉన్నాయి. ధాతుపదార్థాలన్నీ శరీరానికి మనం తినే ఆహారం మూలంగా, మనం త్రాగే పాల మూలంగా సప్లయి అవుతూ ఉండాలి. శరీరంలో నీరు అనేపదార్థం ఉంది. కాని, శరీరానికి నీరు ఇంకా చేరుతూ ఉండాలి. ఏపదార్థం మనలో విధిగా వృద్ధి అవుతూ ఉండవలెనో, ఆపదార్థాన్ని శరీరంకోరుతూ ఉంటుంది. నీరు అనేది శరీరానికి కావాలి గనుక దాహం అవుతూఉంటుంది. సున్నం అనేది ఎముకబలంకోసం కావాలి గనుక, సున్నం (అనగా కాల్షియం) సమృద్ధిగా ఉన్నటువంటి ఆహార పదార్థములను ఆరగించాలి అటువంటివి ఆరగించకపోతే ఆయువు క్షీణిస్తుంది. శరీరం కృశిస్తుంది. జీవితం అస్తమిస్తుంది. రక్తపుష్టి కావాలి గనుక, లోహం (ఇనుము ఎక్కువగా) ఉన్నటువంటి ఆకుకూరలు తినాలి. పప్పు పదార్థాలు తినాలి. క్రొవ్వు పదార్థం శరీరానికి కావాలి గనుక, చమురు సమృద్ధిగా ఉన్న వస్తువులను ఆహారరూపంగా ఆత్మారాముడకు ఆహుతివేసి ఆత్మజ్యోతి ఆరిపోకుండా దీపారాధన చెయ్యాలి. నరములకూ మెదడుకూ బలం కలుగజేసేటటువంటి భాస్వరం కలిసిన సున్నపు పదార్థం కావాలి బాదంపప్పులో అది ఉంది. కనుక బాదంపప్పు తినాలి - ఇవన్నీ ఆయా ఆహారపదార్థాలద్వారా శరీరంలోకి వెళ్ళిన పిమ్మట,భుజించినపదార్థాలు జీర్ణంకావాలి. ఆ పదార్థములలోని ఆయాధాతువులు రక్తంలోనికి ఎక్కి ఎముకపుష్టి, నరములపుష్టి, రక్తపుష్టి, తదితరాతరాపుష్టి పుష్టిగా పూర్తిగా ఏర్పడాలి. మనము తినే ఆహార పదార్థములలో సమృద్ధిగా కాల్షియం ఉండవచ్చు - కాని, ఆ పదార్థం అంతా మన శరీరంలోకి ఎక్కి రక్తగతం శల్యగతం కాకపోవచ్చు. ఎంత బాదంపప్పు తిన్నప్పటికీ, నరాలన్నీ ఎన్నివారాలైనా దారాలవలెనేఉండి శరీరభారాన్ని మోయలేని నీరసస్థితిలో ఉండవచ్చు. కాబట్టి శరీరానికి ఎముకబలం వృద్ధికావాలనే ఉద్దేశంతో కాల్షియం మాత్రలనే (సులభంగా జీర్ణమయ్యే మాత్రలనే) తినవచ్చు. అవి కూడా సులభంగా రక్తగతం అవుతాయో కావో అనేసందేహం కలిగినప్పుడు, సరాసరి రక్తంలోకి కాల్షియం (శుద్ధిచేసిన, సులభగ్రాహ్యమైన, సిద్ధజీర్ణసూక్ష్మరూపంలోనికి పరిపక్వంచేయబడిన కాల్షియం) సరాసరిగా రక్తంలోనికి సూదులతో ఇంజెక్షనుల మూలంగా ఎక్కించవచ్చు. ఈ కాలంలో డాక్టరులు చేస్తున్నపని యిదే.

కాల్షియం అంటే సున్నం పదార్థం. సున్నంతో నిర్మింపబడిన యిండ్లుగాని సౌధములుగాని అటువంటివో, మానవశరీరం అనే సౌధనిర్మాణమునకుకూడా యీసున్నం అనే పదార్థము ప్రధానమైనదని వైద్యవేత్తలు నిర్ధారణ చేశారు. సుధ అనగా సున్నము. సుధతో నిర్మింపబడినదానినే సౌధము అంటున్నాము. అంతేకాదు. సుధ అనే సంస్కృతశబ్దానికి అమృతం అనే అర్థం ఉంది. "ఖగనాథుం డమరేంద్రుగెల్చి సుధ ముక్తైకొన్న చందంబునన్" అనే పద్యములో గరుత్మంతుడు దేవేంద్రునిగెల్చి సుధ అనగా అమృతమును తెచ్చినాడని ఉంది. గరుత్మంతుడు అమృత కుంభం తెచ్చినప్పుడు ప్రయాగలో ఒకసారి దానిని దింపినాడట. అందుకనే అక్కడ కుంభమేళం జరుగుతూ ఉంది. అక్కడ ఒక ఊబిసేల వెయ్యిమందికి తియ్యని గొయ్యి అయింది. వారికి యీ కుంభమేళం కుంభీపాక నరకం అయింది. నిజంగా నేటి మన వైద్యసిద్ధాంతములనుబట్టి మాచినప్పటికీన్నీ శరీరాన్ని క్షీణించకుండా కాపాడగల్గినది "కాల్షియం" (అనగా సున్నపుపదార్థం) - అదే సుధ -. అదే శరీరాన్ని కృశించకుండా కాపాడే సుధ. సుధ అనగా అమృతము.

మానవశరీరంలో సహజసిద్ధంగా పుట్టుకతో నేఉన్నటువంటిధాతువులలో కాల్షియం, అనగా సుధ, శరీరాన్ని క్షీణించకుండా నిలువబెట్టి కాపాడే అమృతం, లేదా అమృతత్వం ఒకటి ఉన్నదని అంగీకరించాలి. ఇదే సుధయని వసుధలోని వైద్య సుధీమణులందరూ అంగీకరించారు. ఆయుర్వేద వైద్యంలో ముత్యాలు భస్మం చేసి యిస్తారు. ముత్యాలను భస్మంచేస్తే వచ్చేది ఏమిటంటే స్వచ్ఛమైన సున్నం. పగడభస్మంలోకూడా (ప్రవాళ భస్మంలో కూడా) స్వచ్ఛమైన సున్నం ఉంది. ఈ మౌక్తిక భస్మం, యీ ప్రవాళ భస్మం, క్షయవ్యాధితో క్షీణించేవాళ్ళకు యిస్తే శరీరానికి తక్కువైనటువంటి, లేదా శరీరానికి కావలసిన కాల్షియం, సుధ, అమృతం, అద్భుతంగా సప్లయి అవుతుంది. ఇది వైద్యవిద్యసారామృతం. శరీరానికి లోపించిన పదార్థాన్ని సప్లయిచేసి పూరించడమే యీ వైద్య విధానంలో ఉన్న పరమరహస్యం. మానవ శరీరానికి ప్రతి ధాతువునూ కావలసిన పాలుల్లో సవ్యంగా సప్లయి చేసేది పాలు. ఏ ధాతువు శరీరానికి లోపించిందో, కనిపెట్టి ఆ ధాతువును పూరించాలి. ధాతు లోపానికి ధాతు

దుర్జన పద్ధతి

★

నండూరి రామమోహనరావు

ఎదురుగా తీవిమై
నేతెంచు మత్తకం,
తీరవ రవమ్మువిని
పారిపోవనుగాని,

చాటుచాటున మృదుల
శాద్వలాంతరమందు
ప్రాకివచ్చెడి కుటిల
పన్నగము గని వెఱతు.

నిస్సహాయునిగ న
న్నెదురుకొను శాత్రవ న
మూహమ్ము వీక్షించి
ఓహటింపనుగాని,

"నెచ్చెలీ!"యని స్నేహ
నిర్భరత ప్రకటించి
విషపూర్ణ మధుపాత్ర
నొసగు ఖలునికి వెఱతు.

★ కాలక్షేపం ★

పూరణచేయాలి. దీనినే 'లుప్తధాతు పూరణ' చికిత్స అని ఒక్కమాటలో మూటకట్టి చెప్ప వచ్చు.

అమృతత్వం తక్కువైంది కనుక అమృతం నోటిద్వారా కడుపులోకి పోస్తే మంచిది. లేదా ఇంజెక్షను చేసి సూదులతో రక్తంలోకి అమృతం ఎక్కించాలి. ఈ విధంగా మానవుడు అమృతత్వం పొందవలెననే భావం ప్రబలం అవుతోంది. కాని, "అమర్ హో" "అమర్ హో" అని ఎవరినిగురించి మనం జయవాదములు పల్కి మిన్నుముట్ట సన్నుతించి యున్నామో అటువంటి మహాత్ముడు అమరుడగుటకు బుడ్డకోలది కాల్షియంగాని, సుధగాని అమృతంగాని త్రాగియుండలేదు. అటువంటిది ఏదీ ఆయన అరగించలేదు సరిగదా, అనేక వారాలు ఉపవాసాలు చేశాడు. పొట్టి శ్రీరామయోగి అమరజీవి యైనాడంటే, ఒకటిన్నర మండలకాలము అన్నపానములు సున్నయై తనలో ఉన్న మర్త్యత్వమును శూన్యముచేసి సున్నచేసి మిన్నయైనాడు. తనలో ఉన్న మానవత్వమును దేహాభిమానం లేకుండా దహింపచేశాడు. అందువల్లనే ఆయనలో ఉన్న అమరత్వము అతిస్వచ్ఛంగా ప్రకాశించింది.

దేహంవల్ల మాత్రమే లభించేది దేహసౌఖ్యము. నాలుక సరిగా పనిచేస్తే వేడి వేడి ఉల్లిపాయ పకోడీల రుచి చక్కగా తెలిసి, తిన్నంతసేపూ దివ్యంగా ఉంటుంది. కాని, ఆ హాయి, ఆమజా, అరగంట కంటె ఎక్కువసేపు ఉండదు. అయినా, ఎప్పుడూ పకోడీలే తింటే, ఏవగింపు పుట్టుతుంది. పండుగపూటకూడా షాత మెుగుతేనా? అసే సామెతగా నాలుక కది తేలిక అవుతుంది. కడుపు నిండితే, గారెలు చేదెక్కుతాయి. నవరసాలూ అనవసరాలు అవుతాయి. అందువల్ల యీ జీవుడు కోరేది ఏమిటంటే, "అటువంటి తాత్కాలిక నిమిషకాల నిషా తమాషా నాకు చాలదు. అంతకంటె పర్మనెంటు పక్కా పరిపూర్ణ ఆనందం కావాలి."—ఇదే జీవుడు కోరేది. జీవుడు కోరే జీవితానంద సర్వమాన్య శాశ్వతావిభక్త సంపూర్ణ సర్వాధికార అగ్రహారం ఇది ఏవిధమైన శిస్తుదస్తులు కిస్తీలుగా చెల్లించవలసిన పూచీలు పేచీలు లేకుండా, శాశ్వతంగా సంపూర్ణ సర్వాధికారాలతో అనుభవించగల్గిన సర్వమాన్య అగ్రహారం లాగున పరిపూర్ణానందం కావాలని జీవుడు కోరుతాడు. ఇదే జీవునకు కావాలి. తన కది లేకపోవుట తన కొక లోపంగా ఉన్నదని జీవుడు తరచు తపిస్తాడు. లోపించినదానిని పూరించాలి? ఎట్లా?

కాల్షియం తక్కువైతే కాల్షియం శరీరంలోకి ఇంజెక్షను చేసినట్లుగానే సంపూర్ణానందం కావాలంటే ఎట్లా దానిని సమకూర్చి సప్లయి చేయడం?

ఈ సంపూర్ణానందం అనుభవించే శక్తి నీలోనే ఉంది అన్నారు ఆత్మవేత్తలు. నీ దేహాన్ని తృప్తిపరచడంవల్లనూ, నీ నాలుకను, నీ చెవిని, నీ ముక్కును, నీ ఇంద్రియాల్ని తృప్తిపరచడంవల్లనూ, నీకు తాత్కాలికసౌఖ్యం మాత్రమే లభిస్తున్నదని తెలిసినప్పుడు, వాటిని తృప్తిపరచడం క్రమేణ తగ్గించవలసినదని తపస్సంపన్నులన్నారు. దేహేంద్రియ సౌఖ్యాభిలాష తగ్గించు అన్నారు. దేహాభిమానము అనగా, దేహం మీది మోహం ఎంత తగ్గించకల్గితే అంత తగ్గించు అన్నారు. యథాశక్తిగా దేహ మోహం దహింపజేయడమే తపస్సు

అన్నారు. అది తప్పమైతే, నీలో అంతర్గతమైన అమృతత్వం, అఖండ పరిపూర్ణానంద తేజం, నీలో స్వేచ్ఛగా స్వచ్ఛంగా ప్రకాశిస్తుంది అన్నారు. దేహేంద్రియ నిరోధం లేనప్పుడు నీలో ఉన్న నిత్యానందం నిర్మలంగా నిశ్చలంగా నిశ్చయంగా ప్రకాశిస్తుంది. నీ ఆత్మానందమే, నీలో ఉన్న అమృతత్వమే, అప్రతిహతమై అఖండంగా అమోఘంగా అనుభవ సిద్ధమవుతుంది.

ఇదంతా అరచేతి వైకుంఠంలాగున బాగానే ఉంది. కాని ఈ జీవుడు ఈ దేహాన్ని చూస్తూ చూస్తూ విడిచిపెట్టలేడు. అవ్వ కావాలి బువ్వ కావాలి అనే మతంలో జీవుడు ఉంటాడు. "ఆత్మానందమూ అనుభవించాలి. దేహేంద్రియ సౌఖ్యమూ అనుభవించాలి" అంటాడు జీవుడు. ఆ మాట కూడా నిజమే. జీవుడు అంటే కేవలం దేహ సౌఖ్యం మాత్రమే కోరేవాడు కాడు. కేవలం ఆత్మానందం కోరేవాడూ కాడు. జీవునకు యీ దేహంతో ఉండే మైత్రి అంత అన్యోన్యమైనది. పాలూ నీరూ కలిసినంత అన్యోన్యమైనది. నీరు అనేది లేకపోతే, పాలు అనేది ఒక ద్రవ ద్రవ్య స్వరూపంలో ఉండనే ఉండదు. నీరు లేని పాలు యీరేడు జగంబులలో లేవు. భర్తకు భార్య సహధర్మచారిణి కావచ్చు. ఉభయులూ కలిసి మెలిసి ఉండడంవల్ల భర్త గుణములు భార్యకు కలుగవచ్చు. ఇద్దరికి సమాన ధర్మగుణములు కలుగవచ్చు ఒకరిని విడిచి ఇంకొకరు ఉండలేకపోవచ్చు. కాని, ఎవరి దేహాభిమానం వారిదే. అయినప్పటికీ యథాశక్తిగా ఎవరి దేహాభిమానమును వారు తపింపజేయడానికి ప్రయత్నించడంలోనే ఆ దాంపత్యజీవితం ధన్యమవుతుంది. మంటలమీద పెట్టిన పాలు కాగి మంటల తాపాల పాలు అయినవనే దుఃఖం చేత, నీరు పొంగి మంటలో పడింది. కాని, ఆ నీరుకోసం పాలు కూడా మంటలలో దుముకుటకు సిద్ధమై దుఃఖంతో పొంగింది. కాని దుముకలేదు. ఇంతలో మరికొంచెం నీరును (అనగా కొత్త నీరును) పొంగుతున్న పాలమీద జల్లినతోడనే, ఆ పాల పొంగు శాంతించింది.

సుబ్బారావుగారు మంచి మర్యాదస్థుడు గుట్టుగా ముల్లెలు మూటగట్టకపోయినా, కష్టపడి సంపాదించి గౌరవంగా బ్రతుకుతున్నాడు - సుబ్బారావుగారి భార్య కృష్ణవేణమ్మ ఆయనతోనే తనకు స్వర్గం మోక్షం అని ముడివేసికొనియున్న ముత్తయిదువ - సుబ్బారావుగారు సర్వీసు కు వెళ్ళి స్వగ్రామానికి వచ్చినతర్వాత ఆయనకు జబ్బు చేసింది అకస్మాత్తుగా. స్మృతి తప్పినస్థితిలో ఉన్నాడు - వాళ్ళు కాపురం ఉన్న మేడమీదకు డాక్టరు వచ్చిపోతూ ఉన్నాడు. డాక్టరు మెట్లెక్కి రాగానే, కృష్ణవేణమ్మ కన్నీళ్ళతో అర్ఘ్యమిచ్చి "నా భర్త బ్రతుకుతాడు కదా?" — "నా త్రాడు గట్టిదైతే నాభర్తకి యీ గండంతప్పి గట్టెక్కడా?" అని సవాలు చేసింది. "ఈ రాత్రి గడిస్తేగదా ఆమాటలన్నీ" అన్నాడు డాక్టరు. "అంతేనా?" అంది ఆ యిల్లాలు. ఆ రాత్రి అంతే ఆయన స్థితికంటె ఆమె స్థితి అపస్మృతిలో పడింది. తాను యీ తనువు భరించలేనంది. "కృష్ణార్పణం" అంది. అర్ధరాత్రివేళ ఆ కేకతో పిడుగుపడినట్లు మేడమీదనుంచి క్రిందపడింది. ఇరుగుపొరుగువాళ్ళు నిద్రలేచి చూచారు. కృష్ణవేణమ్మ కపాలు గట్టెక్కిన వన్నారు కొందరు యిల్లాళ్ళు "ఏమిటీ! ఘోరం!" అని దూరం ఆలోచించారు కొందరు పెద్దవాళ్లు. సుబ్బారావుకు యీ విషయం తెలియనివ్వకుండా ఆస్పత్రికి చేర్చారు. కొన్నిదినాలకు సుబ్బారావు జబ్బు నెమ్మదించి, శరీరానికి స్థిమితం ఏర్పడింది. కాని, మనస్సుకు స్థిమితం పోయింది కృష్ణవేణికై కలవరించి కృశిస్తున్నాడు. అటువంటి అనురాగంగల యిల్లాలు ముల్లోకాలు వెదకినా తనకు లభించదన్నాడు. కాని, అతని మామగారే అతనిని ఓదార్చి, తన తమ్ముని కుమార్తెను నీలవేణమ్మ నిప్పించి ఒప్పించి వివాహం చేయించాడు. అటు పిమ్మట సుబ్బారావు తిరిగి పాలునీరు కలిసినట్లుగా ఆమెతో సంసారం చేస్తున్నాడు. ఎదుట ఉన్నవాడే పెండ్లికొడుకన్నట్లుగా, ఎదుట ఉన్నదే పెండ్లికూతురు అన్నట్లుగా పచ్చవిలుకాడు పచ్చజెండా చూపిస్తున్నాడన్నట్లుగా హడావుడిగా ఆదరా బాదరా ఏదో ఒక రైలు పెట్టెలో ఎక్కినట్లుగా, ఏ తారకో తాళిగట్టి దారం ముడివేయకూడదు. ఒక వేళ సంసారంలోకి తొందరపడి దుమికినా, సంసారంలోనుంచి తొందరపడి దుమకడంవల్ల పాలూ నీరూవలె ఉండే సంసారం కూడా యిక్కట్టుల పాలవుతుంది.

★

> ఒక శాస్త్రులుగారు బస్సు స్టాండువద్ద నుంచున్న ఒక లాయరుని చూసి:—
>
> శాస్త్రులు : అయ్యా! తమరి ప్రాక్టీసు యెక్కడండీ!
>
> లాయరు : ఇంట్లోనండీ! నా భార్యా, తల్లీ మధ్య.
>
> —గిడుగు విజయశంకర్, మద్రాసు.

కుర్చీలో కూనిరాగం

విచ్చలవిడిగా సంగీతం వెల్లువగా పారే వేళప్పుడు (స్నానాల గదిలో అని అప్పుడే పోల్చుకొన్నారా! మీరు చాలా ఘట్టివాళ్ళని నాకు ముందే తెలుసు) ఉడుకుడుకు నీళ్ళు పోసుకొంటూ ఉండబట్టలేక సన్నని కూనిరాగం తీస్తున్నా. ఇప్పటి మాటకాదు...ఆరేళ్ళకిందట. ఒక ఆధునిక కవి, ఆధునిక కవులకి సహజమైన పెడసరపు ధోరణిలో "నా యింట్లో నేనొక షాని, షర్షాని, నాదిర్ షాని" అన్నాడు. అలాగే మా యింట్లో నేనొక బాలగంధర్వని, బడేగులామలీని, కాదంటే కనీసం జి. యస్. బీని. సహజంగా సంగీతం అప్రయత్నంగా వెలువడే వేళప్పుడు పాడుకొనేందుకు నా స్వేచ్ఛ ఉందనుకొనేవాణ్ణి.

ఆరేళ్ళకిందట - ఆ స్వేచ్ఛ నాకూ, నాతోపాటు ఒకే గదిలో అద్దెకుంటున్న నలుగురు స్నేహితులకీ ఉండేదికాదు. మా యింటిగల ఆవిడ గది అద్దెకిస్తూ పెట్టిన షరతుల్లో ఇంట్లో పాటలు పాడకూడదు అనేది అగ్రేసర - షరతు. కర్మంకాలి ఎప్పుడేనా కూనిరాగం వచ్చిందో మా పెట్టే బేడా నడిరోడ్డు మీద ఉంటాయని పుట్టెడు భయం మా గొంతుకలను నొక్కి గుండె గొంతుకలో కొట్లాడేది.

ఆరోజు అదేం దురదృష్టమో కూనిరాగం తీశా. పరవశత్వంలో నన్ను నేనే మరిచిపోయా. సంగీత పారిభాషికపదాలు నాకొట్టే తెలియవుగాని పై షడ్జమం దాటిన పంచమందాకా గొంతుకలో ఉత్సాహం ఎగిరుంటుంది. అంత చక్కటి ఫీటు చేసినందుకు నన్ను నేనే అభినందించుకొన్నా. సబ్బుపెట్టె తువ్వాలు పట్టుకొని స్నానాలగదిలోంచి బయట కొచ్చేసరికి లంకిణీలాగ మా యింటావిడ - పొరబాటు, ఇంటిగలావిడ - నిజం చెప్పొద్దూ ఆవిణ్ణి తలచుకొన్నంతమాత్రానే మాటలు తడబడుతున్నాయి, కోపంగా ఉరిమింది.

"సంగీతం బాగా పాడగలవే" అని ఇట్టే కనిపెట్టేసింది. నేను సంగీతం పాడగలనని ఈవిడ కెలా తెలిసిందా అని ఆశ్చర్యపడ్డా. తెలిసింది. తెలిసింది. "శిశువులకు తెలుసు, పశువులకు తెలుసు సంగీతం పాములకు తెలుసు" అనే అర్థంలో ఒక సంస్కృత శ్లోకం ఉంది. ఈవిడ శిశువు కాదు. తక్కిన రెండింటిలో ఏ ఒక్కటేనా కావచ్చు కాబట్టి ఇంత సులువుగా పోల్చుకొంది అని నేను పోల్చుకొన్నా - పట్టపగలు, పట్టణ బజారులో దొంగతనం చేసి దొరికిపోయినవాడిలాగ భయపడుతూ చేసిన తప్పు ఒప్పుకొన్నా. "ఇంకెప్పుడూ పాడను!" అని ఆవిడ నిష్కర్షగా ఆదేశించి నిష్క్రమించింది.

"భావప్రకటన మా జన్మహక్కు - రాజ్యాంగం దానిని భద్రపర్చేవరకు విశ్రమించం" అని ఇటీవల పత్రికలు శపథం తీసుకొన్నట్టు "కూనిరాగం మా జన్మహక్కు - ఇల్లుగలావిడ దానిని భద్రపరిచేవరకూ విశ్రమించం" అని నేనూ నాతోబాటు అద్దెకుంటున్న స్నేహితులూ శపథం తీసుకొనే

ఆరుద్ర

వాళ్ళమే గానీ ఆరోజుల్లో ఇల్లుదొరకడం - ఇల్లుసిగా తరిగిరి—కనీసం గది, లేదా కారు షెడు దొరకడం ఎడారిలో నీళ్ళు దొరికినంత

మీకూ జ్ఞాపకం ఉండే ఉంటుంది. ఆ రోజుల్లో ఇళ్ళుదొరికేవి కావు. కాలేజీలలో సీట్లు దొరికేవి కావు. వ్యాపారానికి పర్మిట్లు దొరికేవు కావు. నెలాఖరురోజుల్లో చేబదుళ్లు దొరికేవికావు. మా శ్రీరంగం నారాయణబాబు ఆరోజుల్లోనే మాంబళంలో ఆ తిదక్కని నవరత్నఖచితమైన గదొకటి సంపాదించాడు. దాన్ని సంపాదించ అతను ఒప్పుకొన్న షరతులు వింటే ఎవరు తేలవేసి గుండెలు బాదుకోక తప్పదు. రాత్రి ఎనిమిది గంటలు లోపునే ఇంటికి చేరుకోవాలట - పది దాటాక లైటు వేయకూడదట - ఇంటివాళ్ళ పిల్లల్ని అప్పుడప్పుడు ఆడించాలట. వారానికి కనీసం ఏదురోజులైనా మార్కెట్టునించి కూరలు కొని తెచ్చి పెట్టాలట - ఇంకా ఎన్నో షరతులు. వీటన్నిటికీ ఒప్పుకొని పైపెచ్చు అణా స్టాంపుమీద సంతకంపెట్టి మరీ ఆ గదిలో చేరాడట.

నయం! మా యిల్లుగలావిడ ఒక్క సంగీతం పాడకూడదన్న షరతే పెట్టిందని సంతోషించి నోరుమూసుకొన్నాం. గాని అణిచేస్తే అణుగుతుందా - దాచేస్తే దాగుతుందా. ఆఫీసులో డస్కు బల్లముందు కూర్చొని - ఆరావళీ పర్వతాలలాంటి ఫైళ్ళని ఉత్సాహంతో పరిష్కరించుతూ ఉంటే - వజ్రాయుధంతో దేవేంద్రుడు కొండల రెక్కల్ని నరుకుతున్నట్టు కలంతో దస్తరాలని దునుమాడుతూ చెండాడుతూ, చీల్చిపారేస్తూ ఉంటే దాం తస్సాదియ్యా, కూసింత కూనిరాగం, కాస్త ఈలపాట రాక తప్పుతుందా.

మా ఆఫీసరాధముడు ఔరంగజేబంత సంగీత విద్వేషి. అతగాడికి నేను కుర్చీలో కూనిరాగం తియ్యడం ఎంతమాత్రం గిట్టదు. నే నిలా నోరు విప్పేసరికి - పానీ తిట్టకూడదూ, అరవకూడదూ, గర్జించకపోతే ఓండ్రపెట్టకూడదూ—ఊహూ "నో హమ్మింగ్ ప్లీజ్" అని చీటిముక్కమీద రాసి బంట్రోతు చేతికిచ్చి శ్రీముఖం పంపించేవాడు. తోటి గుమాస్తాలంతా నన్నేదో జూలో జంతువుని చూసినట్టు చూసేవారు. ఉక్రోషాన్నీ, అవమానాన్నీ దిగమింగి ఫైళ్ళలో తలదాచుకొనేవాణ్ణి.

పెద్ద పెద్ద డైరీ ఫారాలలో పాలు పిండేటప్పుడు హెచ్చు పాలివ్వడానికి ఆవుల కోసం సంగీతం ప్రసారంచేస్తారట. కొన్ని కొన్ని కార్ఖానాలలో కార్మికులు కులాసాగా, నిర్విచారంగా పని చెయ్యడానికి కూడా సంగీతం ప్రసారంచేస్తారట. కొండలని కొట్టేవాళ్ళూ, గోడ్లు బాగుచేసే వాళ్ళూ, కోతలు కోసుకొనేవాళ్ళూ పాటలు పాడుకోడం పరిపాటేకద - ఆఫీసులోని గుమాస్తాలంతా ఏకగ్రీవంగా బృందగానం ఎత్తుకోకపోయినా యథాశక్తి వ్యక్తిగతంగా కూనిరాగం తీయడానికేనా అనుమతించకపోతే అనుమతించనివాడికి బుద్ధిలేదన్నమాట అని ఆఫీసరాగ్రణితో ఘట్టిగా చెప్దామనుకొన్నా గానీ, ఉద్యోగం మానేసి పోయేటప్పుడు చెప్పడంకోసం ఆమాటలు జాగ్రత్తచేసుకొన్నా.

గానీ ఇంతలోకే నేనొక ఆఫీసర్నయి కూర్చున్నా. అద్దె కొంపలో ఒకేఒక్క గదిలో నలుగురితోపాటు ఉండడం స్నానాలగదిలో కూనిరాగం తియ్యడం ఆపుకోవలసిన అస్వాతంత్ర్యం అన్నీ పోయాయి. కుర్చీలో కూర్చొని కూనిరాగం

తీయడం, నాపనిమాని మెచ్చుకొని హెడ్డాఫీసువాళ్ళు 'సభాషు లేఖలు' రాసి పంపుతున్నప్పుడు ఉత్సాహంతో ఈలవెయ్యడం ఇలాంటివన్నీ పరిపాటి అయిపోయాయి. గానీ నన్ను చూసి నాలాగే కుర్చీలో కూనిరాగంతీసే గుమస్తా దద్దమ్మలు కొందరు నా చేతికింద దాపరించారు. అతి ముఖ్య సమస్యమీద మీదనున్న అధికారులకి ఉత్తరాలు రాస్తూన్నప్పుడు - సరైన పదజాలం ఎంత కొట్టుకు చచ్చినా దొరకనప్పుడు గుమస్తాగాడి కూనిరాగం వినబడితే, చెప్పొద్దూ, ఒళ్ళు మండుతుంది. నేను కూడా "నో హమ్మింగ్ ప్లీజ్" అని చీటీ ముక్కమీద రాసి పంపిస్తున్నా. ఆఫీసులో నేనుకూడా కూనిరాగం తియ్యడం మానుకొన్నా.

కానీ, పొద్దున్నే తీరుబాటుగా ఇంటిదగ్గర కుర్చీలో కూర్చొని, కాఫీ తాగుతూ, సిగరెట్ పీలుస్తూ పేపరు తిరగేస్తూఉంటే చిన్న చిన్న ట్రామ్ వార్తలు నవరసభరితంగా కనబడుతూ ఉంటే కూనిరాగాలు ఆలాపించక తప్పదు. గాని కూనిరాగం తియ్యడం మొదలెడితే అలవాటయిపోయి అది ఆఫీసులోకూడా పొరబాటున వచ్చేస్తుందని కూనిరాగం బదులు ఏదో కాగితం మీద రాయడం అలవరుచుకొంటున్నా

ఆత్మానందంకోసం కూనిరాగం తీసినా, అది సహృదయులు ఆలకించి మెచ్చుకొంటే ఆనందం. అలాగే నేనేదో రాసేది మీలాంటివాళ్ళు ఆలోకించితే అంతకన్నా కావలసిందేముంది. చిత్తగించండి.

* * *

"డామిట్! కథ అడ్డంగా తిరిగింది" అని వాయించా డెక్కడికి పోయాడో గానీ గిరీశం గాని గుంటూరులో గాని ఈనెల ఏడవ తేదినఉంటే ఎంతో సంతోషించేవారు ఆయనగారి ముఖ్య శిష్యుడు వెంకటేశం అధికారరీత్యా ప్రకటించిన స్టేట్ మెంటు ప్రకారం గిరీశం గారివల్ల వారికి (అనగా వెంకటేశం గారికి) అబ్బినదల్లా ఒక్క చుట్ట తాగడం మాత్రమే! అయితేనేం చుట్టయొక్క గొప్పతనాన్ని శ్రీగిరీశం గారు అవకాశం దొరికినప్పుడల్లా వర్ణించారు. "చుట్ట తాగని ఇంగ్లీషువాణ్ణి నువ్వు చూశావూ' అని ప్రియశిష్యుణ్ణి మందలించారు. చుట్ట పంపెణీమీదె కుంపెణీవాడు స్టీము యింజను వగైరాలు కనిపెట్టాడని వారు (అనగా గిరీశం గారు) కనిపెట్టారు

గిరీశం గారు ఎవరెవరు మెచ్చి కీర్తించినా సంతోషించగలరు. ఒకే ఒక్క సందర్భంలో — వెంకటేశం కిసిమిసి సెలవులకి యింటి కొచ్చినప్పుడు గురువుగారితో తన తలిదండ్రుల సమక్షమందు అనర్గళంగా ఇంగ్లీషులో సంభాషించిన పిదప కరటకశాస్త్రుల్లువారి కోరికమీద చదవమన్న తెలుగు పద్యానికి ముచ్చుతునకగా "పొగచుట్టకి సతిమోవికి' అనే పద్యం చదువుతుండగా గిరీశం గారు వారించారు. ఆ ఒక్క తరుణంలో తప్పించి గిరీశంగారు మరెప్పుడూ పొగచుట్ట ప్రశస్తినీ, ప్రసక్తినీ కీర్తించడం మానలేదు. వారు పొగాకుని చుట్టలుగా వాడి సద్వినియోగం చెయ్యాలని ఉపదేశించారు. నశ్యంకింద వాడడం మహాపాపం అనికూడా సెలవిచ్చారు.

గిరీశం గారికి ప్రియమైన పొగచుట్టకీ పొగాకుకీ ఈనెల ఏడవ తేదీన పండుగలాంటిది జరగడం అస్మదాదులకి ఆనందదాయకం అందుకోక్కి, సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వ వాణిజ్యమంత్రి టి టి కృష్ణమాచారిగారూ, సదరు ప్రభుత్వ ఆర్థికశాఖ ఉపమంత్రి గుహగారూ వెంచేసి ఆంధ్ర పొగాకు సాధకబాధకాలు వినడం గిరీశం గారి అనుయాయులైన మాకందరికీ జిల్లా బోర్డు ప్రెసిడెంటు గిరీ దొరికినంత ప్రసాదం. (అన్నట్టు వీటిని అనగా ఈ గిరీలని రద్దు చేసేస్తారట - అది తరవాత చూసుకొందాం)

ప్రపంచంలో పొగాకు ఉత్పత్తిచేసే దేశాల్లో భారతదేశం ఒకటి. (ఎంత గొప్ప విషయం!) దేశంలో పొగాకులో సగభాగం గుంటూరు తత్పరిసర జిల్లాలలోనే ఉత్పత్తి అవుతూంది. (ఎంత గర్వకారణం!) ఏ దొరలు చుట్టపంపిణీ మీద స్టీము యింజను కనిపెట్టి - మన దేశాన్ని గెలిచారో, ఆ గిరీశం గారి దొరల దేశానికే ఏటా పదికోట్ల పౌనుల పొగాకు ఎగుమతి అవుతూందట. (ఇందుకు నా కళ్ళప్పుడే నెత్తిమీదకి వెళ్ళిపోయాయి.) పొగాకు ఎగుమతివల్ల పన్నెండు కోట్ల రూపాయిల విదేశీనాణెములు మన దేశానికి దొరుకుతున్నాయి (దేశముఖు గారు మనకి కృతజ్ఞులు గావాలి) ఎక్సైజు సుంకం, ఎగుమతి పన్నులు మూలంగా కేంద్రప్రభుత్వానికి ప్రతిసంవత్సరం వచ్చే 40 కోట్ల రూపాయలలో సగభాగం ఆంధ్రరైతులు పండించే పొగాకు మూలంగానే వస్తూందట. (ఈ ఒక్క ఏడాది ఈ దెబ్బ కేంద్ర

[illegible]

★

కొనకళ్ళ వెంకటరత్నం

కలకలమేమో కనుమన్నా
అటు
తెలతెలవారెను తెలుగన్నా

అమరావతి హంపీ శిధిలాలను
అమరశిల్పి యులి కదలినజాడలు
వెనుకటి యుగాల పొరలు చీల్చుకొని
వినపడునో చెదరు నిదుర మంపుల
కలకల...

కుదియించిన జీవకళ లజంతా
గుహాలలోన మంచుమేల్ముసుంగుల
మూగచిత్రాల వాతెరల్కదలి
రాగమురలి చెవి రంజిల్లేనా
కలకల...

గలగలమను కెరటాల కడుపులో
కండగల్గు కవితాసుధ కలదని
గోదావరిపెన్నా తరంగిణులు
ఘోషపెట్టుతున్నవిరా వినరా
కలకల...

శిలలుద్రవించిన చోట తేనులై
చిగిరించిన మోడు లుపవనాలై
మధువొలికిన త్యాగరాజు కోకిల
మరల గొంతు సవరించేనేమో
కలకల...

నిప్పురేడలిన పలనాటి తేకువల
నిప్పుకుండము పెకిలు మన్నదో
రాజమార్గమున కదలిన తెలుంగు
రథచక్రాల నినాదములో అవి
కలకల...

కుర్చీలో కూనిరాగం ★

(ప్రభుత్వం తనది కాదనుకొంటే - రామపాదసాగరం మనకి వీలవుతుందా?)

ప్రభుత్వంవారి బొక్కసానికి, జాతీయ సంపదకూ యింత గొప్పగా తోడ్పడుతున్న ఈ పొగాకుని ఉత్పత్తిచేసే రైతులకి చాలా క్లిష్ట సమస్యలున్నాయి. వాటిని పరిష్కరించడానికే ఈ పొగాకు మీటింగు జరపడం. కృష్ణమాచారిగారు ఏదో ఒక రీతిగా (మనకు లాభించేరీతిగా అని వేరే చెప్పాలా) దీన్ని పరిష్కరించి పొగాకు ఉత్పత్తి వర్తకాలలో యేర్పడ్డ సంక్షోభాన్ని రూపుమాపితే అస్మదాదులం సంతోషిస్తాం.

వర్జీనియా నాటు పొగాకుకి సంబంధించిన అన్ని సమస్యలమీద తమకు తెలిసిన సమాచారాలతో తీర్మానముల రూపంలోగాని సలహాలుగాని 4 వ తేదీకి అందేటట్టు ఈ మీటింగు ఆహ్వాన సంఘాధ్యక్షులకి పంపాలనే కొగితం ఒకటి నాకు లేటుగా అందింది. లేకపోతే ఒక్క సలహా పంపేవాడిని. ఈ చెన్నపట్టణం దుకాణాలలో ఫస్టురకం వేగోలు పొగాకు దొరక్క అస్మదాదులం ఛస్తున్నాం. పై దేశాలకి ఎగుమతి తరవాత చూసుకొందాంగానీ ప్రస్తుతం చెన్నపట్టణానికి విరివిగా పొగాకు ఎగుమతిచేసి పుణ్యం కట్టుకొంటే కనీసం నే నొక్కణ్ణేనా ఏకగ్రీవంగా హర్షిస్తాను.

*   *   *

మన మంత్రివర్గాని కేమైనా మతిపోతూందా ఏమిటి చెప్మా! లేకపోతే (కొందరికి) నిక్షేపంలాంటి జిల్లాబోర్డులను రద్దు చేసేస్తామంటారేమిటి? వీళ్ళంటే పదవుల్లో కూర్చున్నారుగాని, కూర్చోనివాళ్ళ మాటేమిటి? మంత్రిపదవిదొరక్కపోతేపాయె- కనీసం జిల్లాబోర్డు ప్రెసిడెంటుగిరీఅయినా ఉండకపోతే కొందరి కెలా పొద్దుపోవడం. అదీకాక జిల్లాబోర్డు ప్రెసిడెంటంటే,పీడిల్లు బంగారంకానూ (కొందరి విషయాల్లో అయిందిలెండి) ఎంతహోదా, ఎంత దర్జా! అలాంటిది లేకుండాచేసేస్తే ..ఏమో మంత్రివర్గంవారు బాగాఆలోచించి, ఏదో అంతకు తక్కువకాని హోదా గల ఇంకో ఉద్యోగమేదైనా ఏర్పాటుచేసి ఆతరవాత యిలాంటి పదవులు రద్దుచేస్తే మంచిది! ఎవరికి? వాళ్ళకే? - జమీందారీలు రద్దుచేసి నష్టపరిహారం ఇచ్చినట్టు - కొంతమంది ప్రెసిడెంటులకి నష్టపరిహారం కూడా ఇచ్చుకొంటే మరీ మంచిది. ఏమైనా,రాజప్రముఖ్ గిరీలు రద్దు చేయమని పైవాళ్లకి రాయకూడదూ - అచ్చే మన మంత్రులలాంటి వెంటుకు నేస్తారండీ. పోన్లెద్దురూ - ఆఫీసుకి వేళవకొంది తరవాత చూసుకొందాం. ★

> కుర్రవాడు: అమ్మా! నాన్న ఇవాళ ఆఫీసుకు తొందరగా వెళ్ళిపోయారేమి ?
>
> తల్లి: అయ్యో ఇవాళ డబ్బు అడగడం మర్చిపోయానే?
>
> —వల్లూరి రామారావు, బందరు.



మత్స్యాన్వేషణ

ఫోటో: యం. వీరభద్రరావు, విజయవాడ.

కారుమేఘాలు

మా ఊరిలో స్నేహం చేయటానికి యోగ్యులైనవారి లిస్టు ఒకటి తయారుచేస్తే, ఆ లిస్టులో మొదట గోపాలం పేరుంటుంది అనటంలో ఎట్టి సందేహమూ లేదు. స్నేహితులకు సాయం చేయటంలో అతనికి అతనే సాటి. కాలేజీలో ఉపాధ్యాయుల విశ్వాసానికి పాత్రుడు. క్రీడారంగంలో నిసలైన 'స్పోర్ట్స్‌మాన్'. జూనియర్ బి. యె. లో నుండగానే గోపాలానికి పెళ్లయింది. రెవిన్యూ సెక్రటేరియట్‌లో సూపరింటెండెంట్‌గా వుండిన గోవిందరావుగారి కుమార్తె రుక్మిణి, గోపాలానికి అనురూపవతియైన పత్ని అనటంలో ఏమాత్రం సందేహం లేదు.

కాలేజీ చదువు పూర్తికాగానే మామగారి ప్రభావంవల్ల గోపాలానికి సెక్రటేరియట్‌లో ఎనభై రూపాయల ఉద్యోగం దొరికింది. ఉద్యోగంలో చేరిన నాల్గు నెలలకే వేరే ఇల్లు చూసుకొని కాపురం మొదలెట్టాడు.

వారి అన్యోన్య దాంపత్యం చూడటానికి రెండు కళ్లు చాలవు. గోవిందరావుగారు, పల్లెనుంచి వచ్చే వడ్లు, బెల్లం, కట్టెలు, చింతపండు, కాయగూరలు వగైరాలను కాస్తో కూస్తో కూతురింటికి పంపిస్తూండేవారు. కూతురింటికి వచ్చినప్పుడల్లా, ఆమె చేతిలోకి ఓ ఐదో—పదో—రూపాయలు ఇవ్వకుండా వెళ్లేవాడు కాదు.

వారానికి ఓమారైనా స్నేహితులను ఇంటికి పిలిపించి, వారికి ఏ అల్పాహారవిందో ఇవ్వకపోతే గోపాలానికి తృప్తి వుండేది కాదు. భర్త చెయ్యమన్న భక్ష్యాలను రుచికరంగా చేసి వడ్డించేది రుక్మిణి. వారి ఆదర్శప్రాయమైన సంసారం చూసి మేమంతా సంతోషించేవాళ్లం.

ప్రతినెలా బహిష్ఠయినప్పుడల్లా రుక్మిణికి తప్పనిసరిగా కడుపునొప్పి వస్తూండేది. గోవిందరావుగారు గొప్పగొప్ప డాక్టర్ల చేత కూతురికి చికిత్స చేయించారు. అప్పటికప్పుడు నొప్పి తగ్గుముఖంపట్టుతూ వచ్చినా పూర్తిగా మాత్రం తగ్గక రుక్మిణిని అప్పుడప్పుడూ బాధిస్తూండేది.

పెళ్ళయి మూడు సంవత్సరాలైనా రుక్మిణికి సంతానం కల్గలేదు. మనోరోగం ఆమెను పీడించేది. ఆమె ఖిన్నవదనం చూసి గోపాలం చిన్నబుచ్చుకునేవాడు.

గోపాలం స్వభావంలో ఒక లోపం వుండేది. అతని ఆతురతకు తుదీ మొదలూ లేదు. తలలో ఏదైనా విచారం మొలకెత్తిందంటే చాలు, ఇహ అతని అవస్థ వర్ణనాతీతం. నాల్గురోజులు ఆ విచారం మెదడులోనే వుండి పక్వమై ఒక సుస్పష్టరూపం ఏర్పడేందుకు అతను ఏమాత్రం అవకాశం ఇచ్చేవాడు కాదు. "తొందరపడేవానికి బుద్ధిమాంద్యం" అని అతని తండ్రిగారు పదేపదే అంటూండేవారు.

పిల్లలు కల్గలేదనే దుఃఖం రుక్మిణికి బాధించినట్లే గోపాలాన్నీ బాధించేది.

గోపాలం అదృష్టవశాత్తూ, బొంబాయిలో సుప్రసిద్ధ లేడీ డాక్టరని పేరు మోసిన మిస్ దస్తూర్ మద్రాసుకు వచ్చింది. గోపాలం, భార్యను పిలుచుకొని వెళ్ళి, ఇరవై రూపాయలు చెల్లించి ఆమెకు చూపించాడు. "ఆపరేషన్ చెయ్యాలి... ఆపరేషన్ అయితే సంతానం కల్గే సూచనవుంది..." అన్నదామె. గోపాలం జాగుచేయక వెంటనే భార్యను, ఆమె నర్సింగ్ హోంలో నే చేర్పించి ఆపరేషన్ చేయించాడు.

ఆపరేషన్ ప్రభావంనుండి కోలుకోటానికి రుక్మిణికి ఆరు నెలలు పట్టింది. మరి ఆరు నెలలు ఉపచారాలకూ, శుశ్రూషలకూ కావలసివచ్చాయి. రుక్మిణి తల్లి కూతురింటికే వచ్చి యోగక్షేమాలు చూసుకొనేది. క్రమేణా రుక్మిణికి కడుపుశూల తగ్గి పునర్జన్మ లభించింది.

ఒకటిన్నర సంవత్సరానికంతా రుక్మిణికి నెల తప్పింది. గోపాలం—అతని అత్తమామల ఆనందానికి అంతేలేదు. సర్వశాస్త్రవిధులూ సక్రమంగా నెరవేరాయి. నవమాసాలు నిండగానే రుక్మిణి ఒక మొగ శిశువును ప్రసవించింది. కొన్నాళ్లకు ఆమె తల్లి వచ్చింది.

బిడ్డకు కావాల్సిన ఆటసామానులు, బట్టలు, పెరాంబులేటర్ సమకూర్చటంలో మునిగిపోయివున్న గోపాలానికి, కొంతకాలం ఇతర ప్రపంచంతో సంబంధం లేకపోయింది.

ఐదు నెలల బాలింతరాలుగావున్నప్పుడే రుక్మిణి ఇంటిపనులు చేయటానికి సిద్ధమైంది. గోపాలం ఆఫీసు వదలగానే రెక్కలు కట్టుకొని ఇంటికి వచ్చిపడేవాడు. భార్యనూ బిడ్డనూ అలా పార్కుకి షికారు తీసుకుని వెళ్లేవాడు. ఈ సంతోషం గోపాలానికి ఎంతో కాలం వుండలేదు.

బిడ్డ ఆరోగ్యంగా దృఢకాయంగా వుండేది. రుక్మిణియొక్క చక్కని సంరక్షణవల్లనూ, ప్రతిరోజూ గాలిసంచారంవల్లనూ ఆ బిడ్డ ఆరు నెలలకే ఏడాది—ఏడాదిన్నర శిశువులాగ అగుపడేది. ఒకసారి ఆ బిడ్డకు మూడు సంవత్సరాలుకూడా దాటాయని దబాయించాడొక బస్ కండక్టర్!

బిడ్డకోసం ఏ త్యాగం చేయటానికి వెనుకంజవేసేది కాదు రుక్మిణి. బిడ్డకు హాని కల్గించే ఏ ఆహారాన్నీ ఆమె సేవించేది కాదు. బిడ్డకు వేళ వేళకు అడెక్సోలిన్, కెరిన్ క్రమం తప్పకుండా ఇస్తూండేది. కొద్దిగా చల్లగాలి వీస్తే చాలు పిల్లాడికి స్వెట్టర్ తొడిగి అమిత జాగ్రత వహించేది. ఎవరు ఎంత ఆగ్రహించినా వీధిలోకి అడుగెట్టేది కాదు. వర్షం వచ్చే సూచన కనిపిస్తే ఇహ పెరాంబులేటర్ మూలపడేది.

గోపాలానికి పుత్రజనమైన వేళ మిక్కిలి ప్రశస్తమైనదిగా కనిపిస్తోంది. అతనికి రెవిన్యూ సెక్రటేరియట్ నుండి ఆర్. ఎ. అండ్ ఎల్. సి. శాఖకు బదిలీఅయి జీతం హెచ్చింది. పనికూడా కొత్తగా ఎక్కువైంది.

రుక్మిణి పుట్టింట్లో చెల్లెలు శారదకు 'లగ్నపత్రిక ముహూర్తం' నిశ్చయించారు. అదే సమయానికి ప్రజాప్రతినిధిసభ సమావేశ మారంభమైంది. తాను ఆ నిశ్చితార్థపు సమయానికి సరిగా హాజరుకావటానికి వీలులేదుకదా అని వాపోయాడు గోపాలం. పిల్లాడికి కూడా రెండు మూడు రోజులుగా పడిశెంపట్టి ఒళ్ళు వెచ్చగా వుంది. గోపాలాన్ని ఇది మరోవైపున పీడిస్తోంది. ఆఫీసుకు వెళ్లేందుకుముందు భార్యనడిగాడు:

కన్నడం: ఎ. యన్. కృష్ణారావ్

అనువాదం: జి. వి. జి. కృష్ణ

★ కారుమేఘాలు ★

"సాయంత్రం నిశ్చితార్థంకదా - నువ్వేం నిశ్చయించావ్?"

"నేను నాలుగుగంటలకంతా బయలుదేరి పోతాను, ఆఫీసుపనులు ముగియగానే మీరు నేరుగా అక్కడికే వచ్చేయండి."

"లేదు...ఇంటికివచ్చి దుస్తులు మార్చుకొని వస్తాను...కానీ, అబ్బాయి దేహ పరిస్థితి బాగాలేదుకదే—"

"నెమ్మదిగా కాలువకప్పి తీస్కెళ్తాను"

"నువ్వు తప్పకుండా వెళ్లాల్సిందేనా?"

"ఎలా వెళ్లకుండా వుండనండీ, ఒక్కగాని ఒక్క చెల్లెలుకదా."

"మరి పాపడి ఆరోగ్యం సరిగాలేదే"

"నేను జాగ్రత్తగా చూసుకుంటానంటున్నాగా..."

"సరే—నీ ఇష్టం"

అని ఆఫీసుకు వెళ్లిపోయాడు.

సాయంత్రం నాలుగంటలకంతా కాఫీ చేసి ఫ్లాస్కులో పోసివుంచి, తాను కొత్త చీర ధరించి, పిల్లవాడికి ఉల్లన్ స్వెటర్ తొడిగి, కాలువకప్పి, ఇంటికి తాళంవేసి, బీగాన్ని పక్కింటివాళ్లకిచ్చేసి, తనను పిల్చుకొని పోవటానికి వచ్చిన తమ్ముడు సుబ్బులుతో రుక్మిణి బయలుదేరింది పుట్టింటికి.

ఇల్లు చేరుకోటానికి ఇంక కొద్దిదూరం వుందనగానే, ఉన్నట్లుండి అమాంతంగా హోరుగాలితో జోరున కురవనారంభించింది మాయదారివర్షం. బిడ్డ తడిసిపోకుండా వుండేందుకు రుక్మిణి విశ్వప్రయత్నాలు చేసింది. ఏవీ సార్థకం కాలేదు. తల్లి, బిడ్డ, సుబ్బులు పూర్తిగా నానిపోయారు. ఇంటికి చేరుకోగానే పాపడి ఒంటికి నీలగిరితైలం మర్దనచేసి పడుకోబెట్టి, అనంతరం తన వస్త్రాలను మార్చుకుంది రుక్మిణి.

గోపాలం ఇల్లు చేరుకునేటప్పటికి ఎనిమిది గంటలు దాటింది. ఫ్లాస్కులోని కాఫీ తాగి, దుస్తులు మార్చుకొని మామగారింటికి బయలుదేరాడు.

నిశ్చితార్థ ముహూర్తం ముగిసింది. ఆపుల్లో అన్నం వడ్డిస్తున్నారు. గోవిందరావుగారు అల్లుడి రాకకోసం నిరీక్షిస్తూ నిలుచున్నారు.

కాస్సేపటికి రానేవచ్చాడు గోపాలం. భోజనాదులు ముగిశాయ్. ఆడవాళ్ళ భోజనాలయ్యేసరికి అర్ధరాత్రయింది.

"ఇక్కడే వుండిపోండి..ఇంత రాత్రిలో ఇంటికి వెళ్ళడం దేనికి?" అని గోవిందరావుగారనగా.

"రేపు పెందలకడనే నేను ఆఫీసుకెళ్లాలి...ఇంటికే వెళ్ళి పడుకుంటాం—వర్షంకూడా నిలిచింది" అని గోపాలం బిడ్డనెత్తుకొని భార్యాసమేతంగా తన ఇంటికి వెళ్ళిపోయాడు.

పాపడిఒళ్లు ఉడికిపోతోంది. భార్యాభర్తలిద్దరూ ఓమారు పాపడ్ని తాకిచూసి ఒకరిమొహం లొకరు చూసుకున్నారు. గోపాలానికి గాభరా ఎక్కువైంది.

"రుక్కూ!...పాపడు వానలో తడిశాడా?"

"పాపడి ఒంటిమీద ఒకటి రెండు చినుకులు పడితే పడివుండొచ్చు...ఏం?...జ్వరం ఎక్కువైందాండీ?"

"నువ్వు ఈవేళ వెళ్లకపోతే ఏం కొంప మునిగిపోయేది రుక్కూ!" తీక్షణంగా చూస్తూ అన్నాడు గోపాలం.

బిడ్డకు జ్వరం హెచ్చింది. జ్వరతాపంలో బిడ్డ మూల్గుతున్నాడు. గోపాలం అంత రాత్రిలోనే, భార్యనూ బిడ్డనూ ఇంటివద్ద ఒంటిగా వదలి బైసికల్‌మీద డాక్టరింటికి వెళ్ళి పిలుచుకొనివచ్చాడు. ఆ డాక్టరు ఒక ఇంజెక్షన్ గుచ్చి వెళ్ళిపోయాడు. రాత్రి ఆ భార్యాభర్తలకు నిద్ర లేదు. అప్పుడప్పుడూ జ్వరమైకంలో ఉలిక్కిపడుతున్నాడు అబ్బాయి.

అసెంబ్లీ జరుగుతోంది. గోపాలం సెలవు తీసుకొని ఇంటివద్ద వుండటానికి సాధ్యపడలేదు. గులామగిరిని శతసహస్రసార్లు శపించాడు. బిడ్డకు దగ్గు ఎక్కువైంది. శ్వాసకోసం అతివేగంగా ఆడుతూంది. గొంతులో గొరగొర శబ్దం. డాక్టరు రాంగానే పరీక్షచేసి "ఇది బ్రాంకో - న్యుమోనియా...చాలా జాగ్రత్తగా ఉండాలి" అని హెచ్చరించి మరో ఇంజక్షన్ ఇచ్చి వెళ్ళిపోయాడు. డాక్టర్ చెప్పినమాటలువిని భూమిలోకి దిగపడిపోయింది రుక్మిణి.

సాయంత్రం త్వరలోనే ఆఫీసు పనులనుండి విముక్తిచెంది ఇంటి ముఖం పట్టాడు గోపాలం. పిల్లాడిపరిస్థితి మరింత విషమించిపోయివుంది. గోపాలం రెండుచేతుల్లో తలను దాచుకొని నిలువునా కూలబడిపోయాడు. అతని కళ్లు అశ్రువులతో నిండాయి.

రుక్మిణి తనకు తెలిసిన దేవతలకంతా మ్రొక్కుబడి చేసుకుంది. అప్పుడప్పుడూ శిశువు అనుభవిస్తూన్న వేదనను చూసి నెత్తి బాదుకొనేది.

చీకటి పడేకొద్దీ శిశువు పరిస్థితి మరింత చింతాజనకమౌతూండింది. రాత్రి పదిగంటలకు డాక్టర్ మరోసారివచ్చి చూసి, ఇంజక్షన్ ఇచ్చాడు.

"ప్రాణభయం లేదుకదండీ డాక్టర్ గారూ?"

"అలాంటిభయమేం లేదనే తోస్తూంది...ఈరాత్రిగడిస్తే రేపట్నించిభయం లేదమ్మా!...చాలా ఎక్స్‌పోస్ అయివుండాలి," అనేసి వెళ్ళిపోయాడు డాక్టరు.

దంపతులిద్దరూ బిడ్డప్రక్కన కూర్చుని రాత్రంతా జాగరణ చేశారు. బిడ్డపడే సంకటం వర్ణనాతీతం. వాళ్ళకు ఒక్కొక్క నిమిషం ఒక్కొక్కయుగంలాగా గడిచింది ఆరాత్రి.

మర్నాటి ఉదయానికి బిడ్డ ఇంకా తీవ్రంగా ఉక్కిరిబిక్కిరి పడనారంభించింది. అబ్బాయికి ఆకలేస్తూందేమోనని తొడమీద పడుకోబెట్టుకొని పాలివ్వబోయింది రుక్మిణి. పాలు త్రాగటానికి బిడ్డకు శక్తి లేనేలేదు. రుక్మిణి తనే పాపడి నోటికి పాలు పిండింది. పాలు గొంతులవరకైనా పోలేకదూ - నోటినుండి అలాగే బయటకు వచ్చేసింది. రుక్మిణి తారెత్తిపోయి ఒక్కగావు కేకట్టింది. పెరట్లో మొహం కడుక్కుంటూన్న గోపాలం ఒక్కగెంతున హాలులోకొచ్చిపడి, బిడ్డను చేతికెత్తుకొని చూశాడు. ఆ బుల్లిదేహంలోని ప్రాణవాయువు ఎప్పుడో అనంతవాయువులతో లీనమైపోయింది.

గోపాలం బిడ్డను భుజానవేసుకొని వెళ్ళి మన్నుచేసి వచ్చాడు.

ఇంటికి రాంగానే, రుక్మిణి చీరలూ నగలూ అంతా మూటకట్టి, జట్కానుపిలిచి అందులో పడేస్తూ "ఊఁ...బండెక్కు" అన్నాడు. "ఎక్కడికి?" అని అడిగింది రుక్మిణి "మీ తల్లిగారింటకి" అన్నాడతను.

భార్యను మామగారింటి గుమ్మంవద్ద దిగవిడిచి, ఆమూటను అక్కడే పడేస్తూ "ఇహ ఇదే నీఇల్లు...అక్కడికి నువ్వు రానవసరం లేదు" అనేసి ఆ జట్కాలోనే తన ఇంటికి బయలుదేరాడు గోపాలం.

ఆఫీసులో మూడుసెలలు సెలవుతీసుకొని, పెట్టే బేడాతో ఎక్కడికో ప్రయాణమై వెళ్ళిపోయ్యాడు గోపాలం!

కూతురు పరిస్థితి చూసి దిగ్భ్రాంతులయ్యారు గోవిందరావుగారు. వెంటనే అల్లుడింటికి పరుగుతీశారు. అక్కడ విధి

తలుపుకు తాళం వేయబడివుంది. అతనెక్కడికెళ్ళాడో ఇరుగుపొరుగుల వాళ్లెవ్వరికీ తెలీదు. మొహం వ్రేలాడేసుకొని తిరుగుముఖం పెట్టారు గోవిందరావుగారు.

ఉన్మాదిలా మూడు మాసాలు ఊరూరా తిరిగి, సెలవు ముగియంగానే తిరిగివచ్చేశాడు గోపాలం. ఇల్లు శూన్యంగా వుంది! ఆ స్మశానశాంతి అతనికి భయంకల్గించింది. హోటల్లో భోంచేసేవాడు. ఆఫీసునుండి ఇంటికి రాగానే ఏదో ఓ పుస్తకాన్ని చేతబట్టి కూర్చునేవాడు. గడచిన స్మృతులు కళ్లెదుట వచ్చి నిలిచేవి. సహించలేక చిన్నపిల్లాడిలా ఏడ్చేవాడు.

గోపాలానికి స్నేహితులెవ్వరూ అక్కరలేకపోతున్నారు. అతని యోగక్షేమాలను విచారించేందుకు వచ్చిన మిత్రులను హీనంగా చూసిపంపించేవాడు. ఈ సంగతి నాకు తెలిశాక "అబ్బ...ఇహ వాడిస్నేహానికో సలాం" అనేంత విసుక్కోపం కల్గింది.

అపారమైన విచారానికి తోడుగా, ఒక మొండితనం అతన్ని పీడించేది. 'ఆ రోజు రుక్మిణి పుట్టింటికి బిడ్డను ఎత్తుకొని వెళ్లకుండావుంటే బిడ్డకు ఏ అపాయమూ సంభవించకుండా వుండేదికదా. వర్షం వచ్చేలాగునవుంది-వెళ్లొద్దని అన్నానుకూడానూ. అది పట్టుబట్టి వెళ్ళి బిడ్డను వర్షంలో నాన్పింది. బిడ్డను అదే చేతులారాచంపింది! —ఇవే అతని విచారసరళిగా వుండేవి.

ఊరికి వచ్చాడని తెలిసి, గోపాలాన్ని వెతుక్కొనివచ్చారు మామగారు. గోవిందరావుగారి కళ్ళల్లో నీళ్లు నింపి పంపించాడు అల్లుడు.

తనకు జరిగిన అవమానాన్ని కుమార్తె ఎదుట నోరెత్తి చెప్పలేదు గోవిందరావుగారు. "ఆయన కోపం ఇంకా తగ్గలేదమ్మా...ఇప్పుడు ఆయన మనస్సును మరిమరీ బాధించటంకన్నా నిశ్శబ్దంగా వుండిపోయేది మేలు" అని రుక్మిణిని ఓదార్చాడు.

'తాను చేసిన మహాపరాధమేమిటి? భర్త ఎందుకు ఇంత ఆగ్రహపూరితులయ్యారు? ఇంటినుండి వెళ్ళగొట్టించుకునేంత ప్రబలమైన తప్పు తానేం చేసింది?' —అని రుక్మిణి అనేకమార్లు గుండెలు బాదుకుంది. ఆమెకు అదొక తీరని సమస్యయై కూర్చుంది. కృశించి కృశించి చీపురుపుల్లలా కావొచ్చింది రుక్మిణి. కళ్లు గుంటలుపడ్డాయ్. ముఖం వాడిపోయింది. దేహం పాలిపోయింది. ఒంట్లో రక్తం నీరయింది. రుక్మిణి దుఃఖాన్ని చూస్తూ ఆమె తల్లితండ్రులు క్షీణింపసాగారు.

ఒక రోజు ఆఫీసునుండి రాగానే, గోపాలం జైమినీ భారతం చేతబట్టి కూర్చున్నాడు. "సీతావనవాసం" ప్రకరణ చదువుతున్నాడు. కథ అతని మనస్సుమీద విలక్షణ పరిణామాన్ని కల్గించింది. 'సీత చేసిన తప్పేమిటి?' అని ఆలోచించాడు. సీతమీద ఏర్పడ్డ అపవాదంతా పరిశీలించి ఆమె 'నిరపరాధి' అని తీర్పు చెప్పుకున్నాడు.

తక్షణమే గోపాలం మనస్సు, తన జీవితాన్ని ప్రతిబింబింపచేసింది. రుక్మిణి చేసిన తప్పేమిటి?—దీర్ఘంగా ఆలోచించాడు. వర్షం వచ్చిన రోజున, వొద్దని ఎంతచెప్పినా వినకుండా, పాపడ్ని చంకనెత్తుకుని తల్లిగారింటికి వెళ్ళింది. వెళ్ళకుండా ఇంటివద్దనే వుండటానికి వీలయ్యేదా?—ఎలా సాధ్యం?...ఉన్న ఒకే ఒక చెల్లెలు నిశ్చితార్థానికి, అక్క పోకుండా ఎలా వుండగలదు? రుక్మిణి కోర్కె సహజమైనదే...పోతే పోనీ...చంటి పాపడు వానలో తడిసిపోకుండా జాగ్రతగా చూసుకోవలసింది- అదిమాత్రం ఉద్దేశపూర్వకంగా తడిపిందా? వానలో నానిపోకుండా వుండటానికి విశ్వసాహసం చేసి వుండొచ్చు. కానీ ప్రయత్నం ఫలించకుండా వుండవచ్చు.

ఈ వాదవైఖరిలో ఒక మహత్తరమైన సత్యం గోపాలం చిత్తఫలకంమీద మెరిసింది. 'పాపడిమీద నాకు ఎంతో మమత వుండేది. పాపడి నిష్కల్మషమైన ముఖం, స్నిగ్ధసౌందర్యం, నిర్హేతుక మందహాసాలను కన్నులారగాంచి అనంతమైన ఆనందాన్ని అనుభవించేవాడ్ని. నిజమే ... రుక్మిణి పాపడికి తల్లికదా? బిడ్డకోసం ఆమెకూడా తల్లడిల్లిపోలేదా? నవమాసాలు మోసి, కనిపెంచి బిడ్డకోసం తన సుఖాన్ని బలిదానం చేయలేదా? నాది ఎంత అహంకారం! ఎంత మౌఢ్యం, ఎంత అజ్ఞానం—తల్లికిలేని బాధ నాకెక్కడ్నించి వస్తుంది? పాపడు కలకాలం జీవించేలాగ వాడి నుదుటిమీద బ్రహ్మ రాయలేదు అంతే... రుక్మిణిపడ్డ అవస్థలను లెక్కచేయక, దానినే తిట్టి, త్యజించానుకదా—నేనెలాంటి పశువును' అతని ప్రవర్తనమీద అతనికే తిరస్కారభావం పుట్టింది. తన్నుతానే శపించుకున్నాడు. ఏకధారగా ఏడ్చేశాడు. అతని మనస్సు శుచియైంది.

తన ప్రవర్తన తప్పు అని తేల్చుకున్న వెంటనే నిలుచున్నపళంగా నేరుగా మా ఇంటికి పరుగుతీసి వచ్చాడు. రాత్రి పన్నెండుగంటలు అయివుండొచ్చు. నేను ఏదో చదువుతూ కూర్చొనున్నా. కిటికీగుండా కన్పించిన అతని మొహాన్ని చూడగానే కొద్దిగా గాభరాయైంది. వీధి తలుపు తెరిచాను. తప్పటడుగులు వేస్తూ మెల్లిగా ప్రవేశించాడు.

గోపాలం తన విచారలహరిని నాకు నివేదించాడు. పశ్చాత్తాపం అతన్ని పుటం వేసినబంగారంలా చేసేసింది. అతని నిష్కల్మషమైన హృదయాన్ని చూసేసరికి, ఇదివరకూ అతనిమీద నాకుండిన విసుక్కోపం కూడా మాయమైంది.

"ఇప్పుడే మామగారింటికి వెళ్ళి రుక్మిణిని మన్నించమని అడుగుతాను" అన్నాడు.

"పిచ్చివాడా! కాస్త తమాయించుకో. అర్ధరాత్రి. అక్కడ అందరూ మైమరచి నిద్రోతూంటారు. ఈ వేళకాని వేళలో వారి నిద్రకు ఎందుకు భంగం కల్గిస్తావ్? ప్రొద్దున వెళ్లొచ్చులే..."

అని ఓదార్చును. అతడ్ని ఆరాత్రి మామగారింటికి వెళ్ళనీకుండా మాఇంట్లోనే పడుకునేలాగున చేశాను.

ఆరాత్రి అంతా గోపాలానికి నిద్రలేదు. నిమిషనిమిషానికీ లేచి గడియారంవంక చూసేవాడు. వాడి అవస్థలను చూడలేక నేను ఐదుగంటలకే నిద్రలేచి, వాడికి స్నానపానాదుల ఏర్పాట్లుచేసి, ఆరుగంటలకు పంపించా.

ఈ ప్రకరణ జరిగి ఇప్పటికి దాదాపు ఒకసంవత్సరం దాటింది. రుక్మిణి ఇప్పుడు బాలింతరాలు. బంగారు బొమ్మలాటి బిడ్డకు తల్లి.

"ఏంగోపాల్! చెల్లాయిని మళ్లీ పుట్టింటికి పంపించేస్తావా?"

అని ఓమారు పరిహాసంచేశాను. గోపాలం మొహంలో కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు.

"తొందరపడేవానికి బుద్ధిమాంద్యం -" అని మాతండ్రిగారు అప్పుడప్పుడూ అంటూండిన మాట నిజం" అన్నాడతను. ★

అప్పులవాడు: ఎక్కడండీ- మీ ఊరికి వెళ్ళొచ్చిన తర్వాత బాకీ ఫైసల్ చేసేస్తానంటిరి, ఇంతవరకూ......

అతను: నే నింకా ఊరికి వెళ్ళనేలేదు కదండీ!

* * *

"అబ్బే - గొంతు బాగాలేదండీ."

"పర్వాలేదు పాడండీ - నా చెవులుకూడా బాగాలేవు."

పెద్ద కథ:

ఉద్యోగాలు


శర్మ యం. ఏ. ప్యాసైనా అతనికి వట్టి అమాయకుడనే పేరు వచ్చింది. ఎందుకు వచ్చిందో మాత్రం అతనికి తెలియదు. అనేకమంది తనపట్ల ఆ పదాన్ని ప్రయోగించటం స్వయంగా విన్నాడు.

ఒకళ్లు అనటమేమిటి? తన తల్లే పొరుగింటి బుచ్చమ్మతోటీ, మరుగింటి యశోదమ్మతోటి 'మావాడు వట్టి అమాయకుడమ్మా! నోట్లో నాలుకకూడా లేదు. ఎలా బ్రతుకుతాడో కాని.' అంటూవుండగా విన్నాడు. శర్మకి వళ్ళు మండింది ఒక్కసారిగా వాళ్ళ మున్యాకు వెళ్ళి తన పొడుగాటి నాలుక చూపించి వాళ్ళ అనుమానం తీర్చివేద్దామనుకున్నాడు. కాని ఇంతలోకే వాళ్ల సంభాషణ మారిపోవటంవల్ల తనుకలుగజేసుకోవట మెందుకని వూరుకున్నాడు.

వాళ్ళ నాన్న మరీ అన్యాయం తన మొహంమీదే ఆ మాట అనేకసార్లు అన్నాడు. తనేమీ అనలేక వూరుకున్నాడు.. ఒకళ్లలోవున్న ప్రయోజకత్వమేమిటో, తనలోవున్న అప్రయోజకత్వమేమిటో, ఎంత ఆలోచించినా అతనికి అర్థంకాలేదు.

అతను కొంతవరకు అందగాడే. ఏమైనా కురూపిమాత్రం కాడు. తనకంటె కురూపులెంతమంది లేరు? వాళ్ళనెవరూ అమాయకులని పిలవటంలేదు. పైగా తను యం. ఏ. ఫస్టుక్లాసులో ప్యాసయ్యాడు.

తను చేసిన తప్పల్లా, చదువు పూర్తికాకుండానే పెళ్ళిచేసుకున్నాడు. ఇది అందరూ కాకపోయినా ఈ దేశంలో చాలామంది చేసే తప్పే కాని ఇది తను ఒక్కడూ



"కనీసం ఆ ముష్టివాణ్ణి పొమ్మనటమైనా చేతకాదా?" అన్నాడు తండ్రి.

జె. పరబ్రహ్మం

చేసిందిమాత్రం కాదు. యం. ఏ. ప్యాసైనా తనకు వుద్యోగమేమీ రాలేదు. చాలమందికి రాలేదు. తనతో ప్యాసైన సహాధ్యాయబృందమంతా ఉద్యోగాలకోసం తివలానే యెదురుచూస్తూ వున్నారు

అయితే తనకు ఒకళ్లను మోసంచేయటం చేతకాదు. చేతవునో కాదో, తనెప్పుడూ ప్రయత్నం చేయలేదు. అంత ఖచ్చితంగా అబద్ధాలు కూడా ఆడలేడు, చిన్నప్పుడు అబద్ధాలు ఆడటానికి ప్రయత్నించి ఫెయిలైపోయాడు. "లెక్కలు చేసేరా?" అని గద్దించేడు మాష్టారు.

"చేసేమండి" అని దబాయించిచెప్పేడు కిష్టిగాడు వాడుచెయ్యలేదని తనకు తెలుసు. తనుకూడా చేసేనని చెప్పేడు "నిజం చెప్పు వెధవా" అని ఒక్క దెబ్బ కొట్టేసరికి నిజం బయటపడింది దెబ్బ తిన్నందుకు కాకపోయినా, పదిమందిలోను తన అబద్ధం బైటపడినందుకు యెంతో విచారించేడు.

కిష్టిగాడు మాత్రం తప్పించుకున్నాడు. స్కూలు వదలగానే కిష్టిగాడిదగ్గరకు వెళ్ళి "నా సంగతి యెవరో చెప్పేశారురా, మాష్టారుతో టీ" అన్నాడు శర్మ.

"ఒకళ్లు చెప్పేదేమిటే, నీ మొహమే చెపుతూవుంటే" అన్నాడు వాడు. మొహం తడిమి చూసుకున్నాడు శర్మ. అప్పటినుంచి యిప్పటివరకు తన జీవితం ఒక మోస్తరుగానే నడుస్తోంది.

స్కూలు ఫైనలు పరీక్షలో అద్భుతమైన మార్కులు సంపాదించేడు శర్మ. ఏవో స్కూలు ప్రైజులుకూడా వచ్చేయి. తల్లీ, తండ్రీ గర్వపడ్డారు. "చాలా తెలివైన వాడు" అన్నారు మేష్టర్లు. దాంతో అమాయకుడనేమాట తాత్కాలికంగా మాసిపోయింది.

కాలేజీలో చేరేడు శర్మ. అక్కడ కూడా అతని ప్రతిభ దివ్యంగానే వెలిగింది. క్లాసులో ఫస్టుగా వుంటుండేవాడు. అంతేకాదు, యెంతో చమత్కారంగా మాట్లాడేవాడు. కాలేజీ డిబేట్లలో అనేక సార్లు బహుమానాలు కూడా సంపాదించాడు. "ఇతని వాక్స్థానంలో బృహస్పతి వుండి తీరాలి" అన్నాడు జ్యోతిష్యం తెలిసిన సంస్కృతం మాష్టారు.

ఈలోగా కాలేజీలో ఒక చిన్న సంఘటన జరిగింది. దాంతో అతని అమాయకత్వం, అతనిలో వుండే మిగతా విశేషాల్ని అణగద్రొక్కి పైకి వచ్చేసింది. ఒకనాడు కాలేజీలో అతనికొక పెన్ను దొరికింది. ఆ పెన్ను యెవరిదో అతనికి తెలుసు. అతని సహాధ్యాయిని లక్ష్మి అక్కడ వదిలి వెళ్లటం తను ప్రత్యక్షంగా చూసేడు. ఆమెను పిలిచి యిచ్చేద్దామనుకున్నాడు. కానీ నాలుక రాలేదు. త్వరగా వెళ్ళి యిచ్చేదామనుకున్నాడు. కాళ్ళు రాలేదు. చూస్తుండగానే ఆమె యింటికి వెళ్ళిపోయింది. పెన్ను మాత్రం తనదగ్గర మిగిలిపోయింది. మర్నాడు కాలేజీ ప్రిన్సిపాలుకు ఆ పెన్నిచ్చి, ఫిజిక్సు లేబరేటరీలో ఫలానాచోట ఎవరో పెన్ను పారేసుకున్నారని, ఆనవాళ్ళు చెప్పి తీసుకోవచ్చునని, నోటీసు వేయించేడు. పెన్ను స్వస్థానానికి చేరింది. అయితే ఈవార్త శర్మ రూంమేట్సుకి తెలిసింది.

"ఆమెను పిల్చి యిచ్చివేయటానికి నీ కంతభయమెందుకోయి" అన్నాడు దాసు.

"నేనయితే ఆమెయింటికి వెళ్ళి స్వయంగా యిచ్చి 'థ్యాంక్స్' అనిపించుకొని వుండేవాడిని" అన్నాడు రామారావు.

"నీకోసమే స్వయంగా జారవిడిచి వుంటుంది" అన్నాడు వంద యెకరాల భూస్వామి ఏకైక సుపుత్రుడు సుబ్బారావు.

"అంతదూరం ఆలోచించే తెలివి తేటలు నాకు లేవు" అన్నాడు శర్మ.

"వట్టి అమాయకుడివి" అన్నాడు సుబ్బారావు.

చప్పట్లు కొట్టేరు అతని కాఫీ హోటల్ మిత్రులు.

శర్మ కాలేజీ జీవితం అంతా ఈవిధంగానే గడిచింది. యం. ఏ. ఫస్టుక్లాసులో ప్యాసయ్యేడు ఈ అమాయకుడు. చదువు పూర్తికాగానే ప్రతివారికీ వచ్చే సమస్యే అతనికీ వచ్చింది. ఏదో తన చదువుకుతగ్గ వుద్యోగం సంపాదించాలి. నిజానికి శర్మకు వెంటనే వుద్యోగం రాకపోయినా జీవితానికి పెద్ద యిబ్బంది లేదు. అతనితండ్రి ఆ వూళ్ళో పోస్టుమాష్టరుగా పనిచేస్తున్నాడు. అదికాక ఆ గ్రామంలో ఒక డాబా యిల్లు, పదియెకరాల భూవసతి ఉన్నాయి. అతనొక్కడే కొడుకు. అక్క



"ఇంతకంటే పనికివచ్చే పనేమిటో నీవే చెప్పరాదూ?" అన్నాడు. చంకలోవున్న పాపాయిని చూపించి "కసేపు ఎత్తుకొని ఆడిస్తే వంటేనా త్వరగా అవుతుంది" అంది.

★ ఉద్యోగాలు ★

విశాలాక్షికి పెళ్ళైంది. అయితే ఇంటిలో తొందర ఎక్కువైంది.

"ఉద్యోగం పురుషలక్షణం" అంది అతని శ్రీమతి - రాజ్యం.

"ఉద్యోగం లేకుండా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే యేమి తోస్తుందిరా" అంది తల్లి.

"మీ అబ్బాయి యేంచేస్తున్నాడంటే ఊరికేనే కూర్చున్నాడని చెప్పటానికి నామర్దాగావుంది" అన్నాడు తండ్రి.

అతని చదువు పూర్తికాకపూర్వమే పున్నామనరకంప్రాప్తించే ప్రమాదంకూడా తప్పిపోయింది.

అయితే వుద్యోగానికి శర్మ చేయవలసిన ప్రయత్నాలన్నీ చేస్తునే వున్నాడు. ఇంగ్లీషు పత్రిక్కి చెలచందా కట్టేడు. ఒక్కటికూడా తప్పకుండా 'వాంటెడ్ కాలమ్స్' వెదుకుతున్నాడు. చదివి ప్యాసవటమంటే అతని చేతిలో వుందికాని వుద్యోగం అతని చేతులో లేదు. ఈ విష యాన్ని ఎవ్వరూ గ్రహించినట్లు లేరు.

"ఉద్యోగం వెదికే గట్టిప్రయత్నం చేయకూడదా" అంది ఒకరోజున ధర్మపత్ని.

"వీధిలోపడి వెదికితే దొరికే వస్తువను కున్నావా యేమిటి?" అన్నాడు శర్మ.

"ఉహూ! ఇంటిలో కూర్చుంటేనే వచ్చి మీదపడే వస్తువు" అంది భార్య ఈసడిస్తూ.

ఏదోవిధంగా డబ్బు సంపాదిస్తే ఈబాధ తప్పుతుందనుకున్నాడు శర్మ. తను ఇంగ్లీష్‌లోను, తెలుగులోనూ కూడా చక్కగా వ్రాయగలడు. పత్రికలకు ఏవేనా కథలు వ్రాసి పంపితేకి తనకు కొద్దో గొప్పో డబ్బు వస్తుంది; పేరు వస్తుంది; ఇంటిలో పోరు తప్పుతుంది.

మర్నాడు ఉదయమే లేచి స్నానంచేసి కలం కాగితాలు ముందరవేసుకు కూర్చొని తదేకదీక్షతో వ్రాయటం మొదలుపెట్టేడు. కాసేపట్లో శర్మ పడే శ్రమ యేమిటో యింట్లోవాళ్ళందరకు తెలిసిపోయింది.

"వీడి వ్రాతల్ని పేపర్లో వేసుకొనే వెర్రివాళ్లు యెవరో?" అని నెమ్మదిగా గొణుక్కుంటూ అవతలకు వెళ్లేడు తండ్రి. విననట్లు నిర్లక్ష్యంగా వ్రాసుకుపోతున్నాడు శర్మ.

"బజారుకు వెళ్ళి కూరలేవేనా తీసుకు రాకూడదురా అబ్బాయీ! ఈ పాడువ్రాత పెట్టుకుని కూర్చోకపోతే" అని సాగదీసుకుంటో అంది తల్లి.

ఇంకాసేపటికి వంటింట్లోంచి శ్రీమతి కూడా విజయం చేసింది.

"ఇంతకంటే పనికొచ్చే పనేమీలేదా?"

"ఇది యెందుకూ పనికిరాని పని అనా నీ వుద్దేశ్యం?" అన్నాడు గట్టిగా.

"ఆ మాట వేరే చెప్పాలా! మీరు చింపి క్రిందపారేస్తున్న కాగితాలు చూస్తే తెలియటంలేదూ?"

నెమ్మదిగా కలాన్ని దింపేడు శర్మ, ఆలోచిస్తూ.

"అయితే ఇంతకంటె పనికివచ్చేదేమిటో నీవే చెప్పరాదూ?" అన్నాడు.

చంకలోవున్న పాపాయిని చూపించింది భార్య. "కాసేపు యెత్తుకుని ఆడిస్తే వంటేనా త్వరగా అవుతుంది" అంది.

శర్మకి పట్టలేనంత కోపం వచ్చింది. తనంత పనికిరానివాడా? అయితే గట్టిగా మాటాడలేకపోయేడు. గట్టిగా మాట్లాడటం అతని స్వభావం కాదు.

"నేను ఈ పనికిరాని పనే చేయటానికి నిశ్చయించుకున్నాను." అన్నాడు కనుబొమ్మలు చిట్లిస్తూ.

భార్య వదిలి వెళేటప్పటికి, వీధిలో ఒక ముష్టివాడు తయారయ్యేడు. మొదట్లో నెమ్మదిగాను, దీనంగాను ముష్టి వేయమని అనేకవిధాల అడిగేడు. అంతకంతకూ స్వరం హెచ్చించి, మానవుల సమానత్వం మీద ఉపన్యాసం మొదలు పెట్టేడు. శర్మకి చికాకు యెక్కువైంది. బాకీవున్నట్టు అడుగుతున్నాడు. ముష్టివాడు పుట్టుకతోనే డబ్బు తీసుకొనిరామని, వెళ్ళిపోయేరోజున వెంటరాదని ఇష్టం వచ్చినట్లు పేలుతున్నాడు.

ఇంతలోనే తండ్రి గబగబా బయటనుంచి లోపలికి వచ్చేడు. వస్తూనే "కనీసం ఆముష్టివాణ్ణి పొమ్మనటమేనా చేతకాదా?" అన్నాడు.

"చాతవటానికి, కాకపోవటానికి అదోక పెద్దవిద్యా యేమిటి?" అన్నాడు శర్మ నెమ్మదిగా.

అయితే గట్టిగా పొమ్మనటం అతని తత్వంలో లేదు. పైగా ఈరోజుల్లో ముష్టివాళ్ళను సమాధానపరచి పంపివేయటం ఒక పెద్దవిద్యే...ఈసంగతి శర్మకు తెలుసు.

భోజనానికి పిలుపు వచ్చింది. "భోజనం చేసి రాసుకోవచ్చులే, నీకథ యెక్కడికీ పోదు" అన్నారు యింట్లోవాళ్లు, నెమ్మదిగాలేచి మడికట్టుకున్నాడు శర్మ.

భోజనాలు కాగానే పోష్టుమాన్ ఒక కవరు తెచ్చి యిచ్చేడు. శర్మ వందలకొద్దీ పెట్టిన దరఖాస్తులలో ఒకదానికి సమాధానం అది. ఏదో మంచి ఉద్యోగం వచ్చిందనుకున్నారు. తీరాచూస్తే ఒకచిన్న బ్యాంక్‌లో ఒక చిన్న గుమాస్తా ఉద్యోగానికి ఇంటర్వ్యూకి మెడ్రాసు రమ్మని ఆహ్వానం. అసలే ఒక చిన్న బ్యాంక్. అందులో ఒక చిన్న గుమాస్తా! దానికో ఇంటర్వ్యూ!!

"ఐతే ఢిల్లీకివెళ్ళి వచ్చారన్నమాట...అక్కడ హిందీ భాష అర్థంకాక చాలా అవస్థలు పడి వుంటారనుకొంటా"

"ఆఁ...నా కెందుక వస్థ. పైగా నేను మాట్లాడేదేమిటో అర్థం చేసుకోలేక అక్కడి వాళ్లంతా బిక్కమొహాలు వేసి ఊరుకున్నారు.

—జి. వి. జి. కృష్ణ, మద్రాసు.

వెళ్ళనన్నాడు శర్మ.

వెళ్ళి తీరాలన్నాడు తండ్రి.

"ఇంతకంటే ఏశిక్ష వేసినా సరే" అన్నాడు శర్మ.

"ఈ జీవితానికి ఈ శిక్ష చాలు" అన్నాడు తండ్రి.

"ప్రయాణపు ఖర్చులుకూడా దండగే" అన్నాడు మళ్ళీ.

"అయితే గియితే నాకు దండగకాని నీకేం?" అన్నాడు తండ్రి.

"క్షమించమ"న్నాడు తను.

"ఎప్పుడూ క్షమిస్తూనే వున్నాను. వెళ్ళి తీరవలసిందే" అన్నాడు తండ్రి.

గత్యంతరంలేక ప్రయాణమయ్యేడు శర్మ. కావలసిన దుస్తులు సర్టిఫికేట్లు ఒక చేతి సంచీలో పెట్టుకున్నాడు. ఇంట్లో అందరూ ఉత్సాహంగా వున్నారు, అతను తప్ప.

* * *

మొత్తంమీద శర్మ మెడ్రాసుకు టిక్కట్టు కొనుక్కొని రైలు యెక్కేడు. పెట్టె కొంచం ఇరుకుగానే వుంది. కాని బిక్కగా వున్న శర్మకు కూర్చునేందుకు సరిపోయిన జాగా లేకపోలేదు. అయితే జరిగి సర్దుకునేందుకు కూర్చున్నవాళ్ళెవరూ ఇష్టపడేట్లు లేరు. ఒకవైపు వరుసలో ఒక యువకుడు కూర్చొని ఒక సినిమాపత్రిక చదువుకుంటున్నాడు. నల్లటి శరీరం, అంతకంటె నల్లని చలువ అద్దాలు, పెద్ద హైరోడ్డు క్రాపింగ్, ఆవారాబొమ్మల బుష్‌కోటు, వలిగిపోయిన తెల్లపాంట్, ఒకచేతిలో సిగరెట్టు, కొంచం సామాన్యులైనవారికి ఇద్దరికి సరిపోయే చోటు ఆక్రమించుకొని కూర్చున్నాడు.

తప్పకుండా అతడొక కాలేజీ విద్యార్థి అయివుంటాడనుకున్నాడు శర్మ. కారణమేమంటే చదువైన తర్వాత అటువంటి వేషం వేయటం అసంభవం.

"కొంచం చోటిస్తారా" అని నెమ్మదిగా సందేహిస్తూ ఇంగ్లీషులో అడిగేడు.

"క్షమించాలి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్" అని అతి వెగటుగా నవ్వుతూ సమాధానం చెప్పాడు.

శర్మ నీరసంగా నేలచూస్తూ నిలబడ్డాడు.

కాలేజీ విద్యార్థికి యెదురుగావున్న వరుసలో ఒక ముసలాయన జాలిపడి శర్మకి కాస్త చోటిచ్చేడు. ఆ వరుసలోవున్న మిగతావాళ్ళు మాత్రం ముసలాడి దాతృత్వాన్ని లోలోపల నిందించుకుని, పైకి మాత్రం "పాపం యేదో లెండి, చాలాదూరం వెడుతున్నట్టున్నారు, కూర్చోనీయండి" అన్నారు.

లయ పర్వతమంత మనిషెక్కేడు. శర్మకి యెదురుగుండావున్న వరుసలో తనంతట తనే కొద్దిస్థలం చిక్కించుకొని క్రమంగా యిటుప్రక్కవారిని అటుప్రక్కవారిని ఒక విదులుపు విదిల్చేడు. ఆ వత్తిడికి అవారా బుష్‌కోటు సీటు అవతలకి వెళ్ళిపడ్డాడు.

"చూడలేదు. క్షమించాలి" అన్నాడు పర్వతం.

"దానికేమిలెండి. ప్రయాణాల్లో అందరూ ఓపిక పట్టాలి" అన్నాడు అవారా బుష్‌కోటు లేచి దుమ్ముదులుపుకుంటూ.

ఈ సమాధానం వినగానే శర్మకు నవ్వొచ్చింది. తను నిజంగా అమాయకుడే అనుకున్నాడు.

తర్వాత స్టేషన్లో ఒక గుడ్డివాడు యెక్కేడు. "ఏతీరుగ నను దయచూచెదవో" అంటూ వో పాట పాడి ముష్టివాడు డబ్బులు అడగటం మొదలుపెట్టేడు. కాని వాడి మొహాన్ని చూసేవాళ్ళు ఎవరూ లేకపోయేరు. శర్మ ఒక కానీ వేద్దామనుకు

★ ఉద్యోగాలు ★

న్నాడు. అయితే సంపాదనలేని తనకు దానంచేసే అధికారం లేదని వూరుకు న్నాడు. ముష్టివాడూ, మానవపర్వతం దిగి పోయారు. వాడి గుడ్డి సరియైనది కాదని, లేకపోతే కదిలేరైలును అంతచాకచక్యంగా యెక్కి దిగలేడని అవారా బుష్‌కోటు వ్యాఖ్యానించేడు. కొందరు 'ఔ'నన్నట్లు నవ్వేరు. ముసలివాడు మట్టుకు "ఏదో బ్రదుకు తెరువుకోసం గుడ్డైనా, కుంటైనా ప్రాణాన్ని తెగించి వాడి పాట్లు వాడు పడుతున్నాడు" అన్నాడు. ఆ స్టేషను లోనే ఖద్దరు దుస్తులతో ఇంకొక వ్యక్తి యెక్కి పర్వతం ఖాళీచేసిన స్థలాన్ని భుక్తం చేసుకున్నాడు. అతని ప్రక్క జేబులో సమయానుకూలంగా ఉపయోగించుకునే నిమిత్తం ఒక ఖద్దరు టోపీ కూడా వుంది.

రైలుపెట్టె యెక్కింది లగాయితు ఏక ధాటీగా రాజకీయాలమీద ఉపన్యాసం చేస్తున్నాడు. ఐక్యరాజ్య సమితి మొదలు ఆంధ్రరాష్ట్రము వరకు గల సమస్త విషయాలని తిరుగులేని పద్ధతిలో చెప్పుకుపోతున్నాడు. శర్మకి తలనెప్పిగా వుంది. ఒక అరగంట తర్వాత రాజకీయ పండితుడు ఉపన్యాసాన్ని తాత్కాలికంగా ఆపేడు. ఎదురుగుండా కూర్చున్న శర్మని "ఒక బీడీ వుంటే యిస్తారా" అని అడిగేడు.

"నేను బీడీలు కాల్చను" అన్నాడు శర్మ ముఖం చిట్లించి.

"అయితే ఒక సిగరెట్టు యిప్పించండి" అని నవ్వాడు రాజకీయవేత్త. పెట్టెలోని వారుకూడా నవ్వేరు. శర్మ మాట్లాడలేదు. "నేను సిగరెట్టు తాగను" అన్నట్లయితే "ఇతడొక అమాయకుడు" అని వెంటనే లోకం సమాధానం చెబుతుందని అతని భయం.

మళ్ళీ రాజకీయవేత్త ఉపన్యాసం మొదలుపెట్టేడు ఎవరో యిచ్చిన బీడీ ముక్కని వెలిగించి. కాని యింతలో శర్మ వెనకనుంచి ఇంకొకస్వరం అతని వాదానికి ప్రతివాదం మొదలు పెట్టింది. ఇంకొక నిముషంలో పెట్టెలోనివారందరూ, కొందరిటూ కొందరటూ చేరిపోయారు శర్మా, శర్మకు చోటిచ్చిన ముసలివాడూ తప్ప. తన లాంటివాడు యింకొక డున్నందుకు శర్మ సంతోషించేడు. కాని వాడు ముసలివాడు. తనో - జీవితంలో, కొత్తగా ప్రవేశిస్తున్న ఒక యువకుడు.

అభిప్రాయాలు, విరుగుడు అభిప్రాయాలు, వాదనలు ప్రతివాదనలతోటీ రైలు పెట్టి వేడెక్కిపోతోంది. వాగ్యుద్ధంలోంచి ముష్టియుద్ధంలోకి దిగే సూచనలు కనబడ్డాయి. "చిలికిచిలికి గాలివాన అయ్యేటట్టుందే" అన్నాడు ముసలివాడు. శర్మకి యెక్కడలేని ధైర్యం వచ్చింది. వెంటనే లేచి నిలబడి "అయ్యా! మీలో కొందరు ఈ దేశానికి మంత్రులయ్యే ప్రమాదం వుంది. కాబట్టి మీమీ అమూల్యమైన అభిప్రాయాల్ని యింత తేలికగా ఈ రైలుపెట్టెలో పారేయ వద్దు" అన్నాడు.

వెంటనే పెట్టెలోనివారు శర్మవైపు చూసేరు. కాబోయే మంత్రులు చాలమంది తమ వాదనల్ని కట్టిపేసేరు. శర్మ తెలివైనవాడేయని బొత్తిగా అమాయకుడు మాత్రం కాడని తెలుసుకున్నారు.

"మీ రేమి చేస్తున్నారు?" అన్నాడొకడు.

"ప్రయాణం చేస్తున్నాను" అన్నాడు శర్మ. అందరూ నవ్వేరు, శర్మకూడా నవ్వేడు. తర్వాత, తను యం. ఏ. ప్యాసైయ్యానని, ఉద్యోగంకోసం వెడుతున్నానని టూకీగా చెప్పేడు. అవారా బుష్‌కోటు ఒక్కసారి గుడ్లు మిటకరించి చూసేడు తనకంటె యెక్కువ చదివినవాడు ఇంకొకడు ఈ పెట్టెలోనే వున్నాడా! అన్నట్టు.

క్రమేపీ బయట చీకటి యెక్కువవుతోంది. ఒక్కొక్కళ్ళే వీలును చూసుకొని నడుములు వాల్చటం మొదలుపెట్టేరు ఆ యిరుకులోనే. అందులో కొందరు అనారోగ్యంగా వున్నట్టు తమ శరీర లక్షణాల్ని మార్చివేయటం మొదలుపెట్టేరు. అయితే ఒకరాత్రి యిరుకులో పడుకునే నిమిత్తమై రోగలక్షణాల్ని అభినయించటం 'అమాయకుడైన, శర్మకు తెలియదు. అవారా బుష్‌కోటు కూడా ఒడుంవాల్చి గాఢనిద్రని అభినయించటం మొదలుపెట్టేడు.

తర్వాత స్టేషనులో ఒక పదహారేళ్ల బిచ్చకత్తె యెక్కింది. 'అఖియ మిలాంకె... చెలె సహీ జానా !' అంటూ గొంతుక యెత్తింది మగస్వరంలో. నిద్రపోతున్న కుంభకర్ణులందరూ చివాలున లేచికూర్చున్నారు. పాటకత్తె చేతినిండా డబ్బులు వసూలు చేసుకుంది. అవారా తనకున్న ఎనిమిది జేబులు అతి అట్టహాసంగా వెదకి చివరకు ఒక రాగి డబ్బును పైకితీసి 'ఠంగ్' మని బిచ్చకత్తె చేతిలో వేసేడు.

శర్మ నవ్వుకున్నాడు. తనేనా అమాయకుడవ్వాలి లేదా ఈ ప్రపంచమేనా అమాయకమై వుండాలి. తనకు ఈ ప్రపంచానికి తేడామాత్రం వున్నట్టు గుర్తించుకున్నాడు.

అవారా బుష్‌కోటు మాత్రం శర్మతో బాగా పరిచయం వున్నవాడిలాగ మాట్లాడటం మొదలుపెట్టేడు. శర్మ యే కాలేజీలో చదివిందీ, ఏ యూనివర్సిటీలో చదివిందీ, యం. ఏ. లో యే క్లాసు వచ్చిందీ మొదలైన విషయాలన్నీ క్రమంగా అడిగి తెలుసుకున్నాడు. శర్మకి

మాట్లాడటం యేమాత్రం యిష్టం లేకపోయినా వాడడిగిన ప్రశ్నలకు ముభావంగా సమాధాలు మాత్రం చెప్పేడు. తర్వాత అవారా, చలంగారి రచనలు, ఎంకి పాటలు వగైరాలమీద తనకుతోచిన వ్యాఖ్యానాలు చేసి కేవలం రాచకీయాల్లోనే కాకుండా సాహిత్యంలో కూడా తనకు ప్రవేశం వున్నట్టు ఋజువుచేసుకున్నాడు. తరువాత మద్రాసులో ఏదో కాలేజీలో చదువుతున్నానని కొంత స్వీయచరిత్రకూడా చెప్పుకున్నాడు. శర్మ మాత్రం మౌనంగా కూర్చుని వింటున్నాడు. తిరుగు ప్రశ్నలు వేయలేదు. ఒకరు చెప్పే విషయాలు తనకు సంబంధం లేనంతవరకువిని వూరుకోవటమే కాని వాడు నిజం చెబుతున్నాడా, లేదా, కాలేజీలో చదువుతున్నాడా లేదా, మొదలైన విషయాల్లో ఆరా తీయాలనే ఆసక్తి అతనికి లేదు.

రైలు సూళ్ళూరుపేట చేరింది. అవారా బుష్‌కోటు 'టీ' అమ్ముకునేవాణ్ణి పిలిచి 'రెండు టీ' అన్నాడు. ఒక కప్పుతీసుకొని శర్మకి అందించబోయేడు. శర్మ తనకక్కర్లేదన్నాడు.

"పరవాలేదు. తీసుకోండి"

"పర్వాలేని మాట వాస్తవమే కాని మొహం కడుక్కోకుండా కాఫీ టీలు త్రాగే నాగరికత నాకింకా అలవాటు కాలేదు" అన్నాడు శర్మ.

"మీరు చాలా ఖచ్చితమైన మనుష్యులుకుమండీ" అన్నాడు అవారా.

అంతవరకు సంతోషించేడు శర్మ, టీ యిచ్చినా పుచ్చుకోని తన్ను ఒక అమాయకుడి క్రింద జమకట్టనందుకు.

మిగతా ప్రయాణం ఆట్టే విశేషాలు లేకుండానే జరిగింది. మద్రాసు రాగానే యిద్దరు దిగిపోయారు. వెళ్ళిపోతూ "గుడ్ బై-మిత్రమా!" అన్నాడు అవారా—

"వీడా నా మిత్రుడు!" అనుకున్నాడు శర్మ. కాని మాట్లాడలేదు.

"కాస్తదూరం నడిచి మళ్ళీ వెనక్కి తిరిగి "తప్పులుంటే క్షమించండి" అన్నాడు అవారా.

"శిరస్సు మొదలు పాదాలవరకు యెంత వెదికినా ఒక్క తప్పుకూడా నాకు కనబడ లేదు" అన్నాడు శర్మ.

బిగ్గరగా నవ్వి వెళ్ళిపోయేడు అవారా.

అక్కడితో అవారాపీడ వదిలినందుకు సంతోషించేడు శర్మ.

* * *

స్నానాలు పానాలు ఒక హోటల్లో ముగించి ఇంటర్వ్యూకి నిర్దేశించబడిన స్థలానికి వేళకు కొంచెము ముందుగానే చేరుకున్నాడు శర్మ. అయితే బ్యాంక్ డైరెక్టర్లలో ఒకరికి వేరేపని వుండటంవల్ల బెంగుళూరు వెళ్ళేరని అందరిడైరెక్టర్ల సమక్షంలోమాత్రమే ఇంటర్వ్యూ జరగవలసి వుందని అందుచేత అభ్యర్థులు రెండురోజుల తర్వాత మళ్ళీ రావలసివుంటుందని అక్కడ తెలియజేసేరు. కాళ్ళీడ్చుకుంటూ హోటలు చేరి ఈసంగతి తండ్రికి వ్రాసేడు. ఒక డైరెక్టరు వూళ్ళోలేడని అతడు వచ్చేవరకు ఇంటర్వ్యూలు జరగవని అతడు రెండు మూడురోజుల్లో తిరిగి రాగలడని బ్యాంకు

★ ఉద్యోగాలు ★

దగ్గర చెప్పినప్పటికీ తనకుమాత్రం ఆనమ్మకం లేదని, ఆ పరిస్థితులలో ఇంటికి తిరిగిపోవటం ఉత్తమమని వ్రాసేడు.

రెండోరోజున తండ్రిదగ్గరనుంచి ఉత్తరాలు-చిరునామాకు రెండుకవర్లువచ్చేయి. శర్మ వ్రాసిన ఉత్తరం అంది సంగతులు తెలిసినవనిన్నీ, ఇంటిదగ్గర మునిగిపోయే పనులేవీ లేవనిన్నీ రెండుకాకపోతే నాలుగు రోజులైనాసరే ఇంటర్వ్యూ జయప్రదంగా ముగించుకుని మాత్రమే తిరిగి రావలెనని వ్రాసేడాయన. రెండో కవరులో (ఒక పెద్ద కంపెనీ) లెక్కల తనిఖీ డిపార్టుమెంటులో ఒక వుద్యోగానికి ఇంటర్వ్యూ కార్డు వచ్చిందనిన్నీ, ఆ వ్యవహారం కూడా చూసుకొని రమ్మనమనివుంది. ఇంటర్వ్యూ కార్డుకూడా అందులోనే జతపర్చి వుంది.

తండ్రిశాసనం అంత కఠినంగావున్నప్పుడిక తను చేయగల్గిందేమీ లేదనుకున్నాడు. ఈమానవలో కొన్ని తప్పించుకుని తిరుగుతూ నాలుగు రోజులు ఆ హోటల్లోనే యెల్లాగో గడిపేడు. అదృష్టవశాత్తు బ్యాంకు ఇంటర్వ్యూ అయిన మర్నాడే లెక్కల తనిఖీ డిపార్టుమెంటుకు ఇంటర్వ్యూ.

వేళకు ముందుగానే బ్యాంకుకి జేరుకున్నాడు. అప్పటికప్పుడే అభ్యర్థులు చాలామంది అక్కడ సమావేశమైవున్నారు. వాళ్ళందరూ రంగురంగుల నెల్ టైలు వాళ్ళ వాళ్ళ తాహతునుబట్టి ట్వీడ్, సిల్కు అనావా మొదలైన సూట్లు వేసుకొని నిండుగా వున్నారు. వాళ్ళని చూడగానే శర్మకి వణుకుపుట్టింది. కనీసం పి. హెచ్ డి. డి. లిట్ లు సంపాదించినవాళ్ళై యుంటారనుకున్నాడు. తనొక లాల్చీ ఒక పంచి, కండువా వేసుకొని వచ్చేడు. అవేనా పూర్తిగా మాసిపోయివున్నాయి. మెద్రాసు మకాం ఒక్కరోజే అనుకొని ఒక జత దుస్తులతో తను వచ్చేడు. తీరా అక్కడ నాలుగురోజులు ఆగవలసివచ్చింది. పరిస్థితులన్నీ తనకి పూర్తిగా వ్యతిరేకంగా వున్నట్టు కనబడ్డాయి. వాళ్లందరూ తన్ను చూసి నవ్వుతున్నారేమో అనిపించింది. వాళ్ల మొఖాలనుంచి తన దృష్టిని తప్పించుకుంటూ అక్కడున్న బల్లమీద కూలబడ్డాడు. ఇంటర్వ్యూకి ఇంకొక గంట టైముంది. "ముంచుకుపోయినటు అంత ముందరగా యెందుకు వచ్చానా!" అనిపించింది. చుట్టూవున్న జనాభాని ఒక్కసారి చూసేడు. చాలామంది జేబుల్లో స్కూలు ఫైనల్ రిజిష్టర్లు ఎత్తుగా కనిపించేయి. ఒక్కసారి ఆశ్చర్యం ధైర్యం వచ్చాయి. కేవలం వేషంతో యెంతో మోసం చేయవచ్చునని తెలుసుకున్నాడు. ఎవరు యెంతెంత ఘనులో తెలుసుకుందామని ఒకరి రిజిష్టర్లు ఒకరు చూచుకోవటం మొదలుపెట్టారు. చాలమంది రిజిష్టర్లు పూర్తిగా నిండిపోయి వున్నాయి. అందులో యే వొక్కడూ దండయాత్రలు చేయకుండా ప్యాసైనవాడు లేడు.

ఆ గుంపులోని ఒకడు శర్మని "నీ రిజిష్టరేది?" అని అడిగేడు.

"నాకు రిజిష్టరు లేదు."

"స్కూలుఫైనల్ ప్యాసైతే కాని ఉద్యోగం యివ్వరు" అన్నాడు వాడు సగర్వంగా.

"కనీసం చదివేనా ఉండాలి" అన్నాడు రెండోవాడు. బహుశా వాడింకా ప్యాసై వుండడు.

నెమ్మదిగా శర్మ సంచీలోంచి తన పట్టాని బయటపెట్టేడు. ఒక్కసారి వాళ్లందరకూ మూర్ఛవచ్చినంత పనైంది. శర్మనీ, శర్మ డిప్లొమానీ చూడటం తప్ప మరేం మాట్లాడలేకపోయారు. చివరకు అందులో ఒకడు ధైర్యంచేసి

"మీ కేమిటీ, మీ చదువేమిటీ! ఈ వుద్యోగానికి రాటు కేమిటి!!" అన్నాడు ఆశ్చర్యంగా.

"నిజమే" అనుకున్నాడు శర్మ. "తన

చదువేమిటీ, ఈ వుద్యోగానికి రావట మేమిటి!" బలవంతముగా పంపిన తన తండ్రిమీద యెంతేనా కోపము వచ్చింది. అసలు తప్పంతా తనదే. "ఇంతోటి ఉద్యోగానికి తను దరఖాస్తుచేయటం ఎందుకూ?"

దూరాన్నుంచి అవారా రొప్పుకుంటూ గబగబా వస్తున్నాడు. అయితే అవారా బుష్‌కోటు మాత్రం లేదు. సూటు, నెక్‌టైతో అతి అట్టహాసంగా వున్నాడు.

"కొంపతీసి వీడుకూడా యీవుద్యోగానికే కాదుకదా!" శర్మని చూడగానే అవారా ఆశ్చర్యపోయేడు. దూరంగానే నిలబడిపోయి ముందుకు వెడదామా వద్దా, అన్నట్లుతటపటాయిస్తున్నాడు. శర్మకూడా ఈవుద్యోగానికే వస్తున్నాడని వాడూహించుకొని వుండడు. శర్మ యిక యేమైనా అక్కడ వుండకూడదనుకున్నాడు. వీళ్లతోటి పోటీచేయటం బుద్ధి తక్కువ పని అనిపించింది. ఇంటిదగ్గర వాళ్లు తన్ను యేమన్నా సరే అని ధైర్యంచేసి లేచేడు. అయినా రేపు యింకో ఇంటర్వ్యూవుండనే వుంది. ఆ ఇంటర్వ్యూ సంగతేదో చూసుకోవచ్చును. అందుచేత మద్రాసు రావటం పూర్తిగా దండగమాత్రం కాదు. ఇంటిదగ్గర వాళ్ళ నేదోవిధంగా సమాధానపరచవచ్చును. ఒకవేళ వాళ్ళను సమాధానపరచలేకపోయినప్పటికీ, దానివల్ల వచ్చే పరిస్థితి యింతకంటె విషమంగా వుండదు. ఈ నిశ్చయంతోనే శర్మలేచి నడక సాగించేడు.

"వెళ్ళిపోతున్నారేమిసార్" అన్నాడు ఆ గుంపులోంచి ఒకడు. "చిన్న పని వుంది" అని వెనక్కి చూడకుండానే ముందుకు సాగిపోయేడు. అయితే దూరంగావున్న అవారాని చూడనట్టునటించి వెళ్ళిపోయేడు.

దారిలో ఒక సన్‌లైటు సబ్బు కొనుక్కొని హోటలుకు చేరి సంచీలోంచి పూర్తిగా మాసిపోయిన ఒకజరీఅంచుపంచీ, కండువా ఒకచొక్కాని తీసి తెల్లగా వుతుక్కున్నాడు. ప్రక్కనే వున్న లాండ్రీ షాపుకువెళ్ళి వాటిని ఇస్త్రీ చేయించుకున్నాడు.

మళ్ళీ రోజున ఇంటర్వ్యూకి వచ్చి తంగా టైముకి వెళ్లేడు. నిన్న జరిగిన పొరపాట్లు ఈసారి జరగకూడదనుకున్నాడు. ఇక్కడ అభ్యర్థులు పాతికమందికి లోపుగా వున్నారు. అయితే వేషంలోమట్టుకు నిన్నటివారివలెనే తనకంటె భిన్నంగా వున్నారు. వారితో కలవకుండా తను కొంచెముదూరంగా కూర్చున్నాడు.

ఇంటర్వ్యూలు ప్రారంభమైయేయి. ఒకరొకరే లోపలకువెళ్ళి వస్తున్నారు. ఎవరికి వారు ఈ ఉద్యోగం తమకే ఖాయం అన్నట్టు వున్నారు. శర్మవంతు వచ్చింది. తనపేరు పిలువగానే సవినయంగా లోపలికి వెళ్ళేడు. పెద్ద టేబులుకి యెదురుగుండా ఐదుగురు సభ్యులు కూర్చొని వున్నారు. శర్మ వారికి నమస్కరించి వారు చూపించిన ఒక కుర్చీలో కూర్చున్నాడు. ముందు కుశల ప్రశ్నలు యేవేవో కొన్ని నడిచేయి. తనకు తోచినట్టు సమాధానం చెప్పేడు. ఇంతలో మధ్య కూర్చున్నాయన అసలు ప్రసంగంలోకి దిగేడు.

"బాంగ్‌కాక్ యెక్కడ."

"సయాంలో."

"సయాం యెక్కడ?" మిగతా సభ్యులందరూ నవ్వేరు.

దాంతో ఈ వుద్యోగం తనకు రాదనుకున్నాడు. ఇక అతను మాట్లాడలేక పోయేడు. పుస్తకాల్లో వున్నంతవరకు ప్రతి విషయం శర్మకు క్షుణ్ణంగా వచ్చును. వారికి కావలసినది పుస్తకాలలోని విషయం కాదు. ఒక్క ఐదునిమిషాలపాటు వాళ్ళను తన స్థితిలోను, తన్ను వారి స్థితిలోనూ వుంచితే "సమారా యెక్కడ? టిరానా యెక్కడ? అంకారా యెక్కడ?" అని గుక్క తిరగకుండా ప్రశ్నలువేసి వారిని చిత్తుచేసి వుండేవాడే. తర్వాత సభ్యులు అతని యం. ఏ. డిప్లొమాను చూసేరు. అతడు మొదటి తరగతిలో ప్యాసైనట్టు అది చెబుతోంది. యూనివర్సిటీని పుణులు క్షుణ్ణంగా పరీక్షచేసి అతనికి ప్రసాదించినదది. అయితే వీరు పరీక్షచేసే దేమిటి? "ఇదంతా కేవలం ఒక తంతు" అనుకున్నాడు శర్మ. మొదటితరగతిలో ప్యాసైన శర్మని పుస్తకజ్ఞానంలో ప్రశ్నించటం నిరర్థకం అనుకున్నారు కాబోలు వారు. మిగతా ఐదునిముషాలు గడపటానికి ఏవేవో ప్రశ్నలు వేయటం మొదలుపెట్టేరు.

"నీవు ధరించిన ఉత్తరీయం ప్రయోజనం యేమిటి?"

అక్కడివారి కెవరికీ ఉత్తరీయాలు లేవు. తన వేషం సరిగా లేదేమోనని శర్మ మొదటినుంచి భయపడుతూనేవున్నాడు. అందరిలాగ సూటు నెక్టయి వేసుకొనివెళ్ళక భిన్నంగా తనెందుకు వెళ్లాలి? ఈ తేడాయే వారి నెక్కువగా ఆకర్షించినట్టుంది. అయినా తన దుస్తులసంగతి వారి కెందుకూ? పాశ్చాత్య దృక్పథంలోంచి ఆలోచించే వారికి ప్రతిదీ ముఖ్యమే (అని తమకు తెలుసు) అయితే తనుకూడా అటువంటి ప్రశ్నలు వారిని తిరగవేస్తే? "మీరు ధరించిన కోటు ప్రయోజనమేమిటి? నెక్టైప్రయోజనమేమిటీ? బనీను ప్రయోజనమేమిటీ..?" అంతులేకుండా వేయవచ్చును. నిజానికి తన ఉత్తరీయానికి కొంత కాకపోతే కొంతేనా ప్రయోజనముంది కాని "ఈ ఉష్ణదేశములో వీరు ధరించిన నెక్టయి ప్రయోజనమేమిటి?"

శర్మ తన అభిప్రాయాలు మనసులోనే వుంచుకున్నాడు కాని పైకి మాట్లాడలేకపోయేడు. ఈ పరీక్షలో ఎటువంటి ప్రశ్నలువేసినా 'తపీ'మని సమాధానంచెప్పే నేర్పరితనం కావాలి. అది అతనికిలేదు.


"నీవు వెళ్ళవచ్చు" అన్నారు వారు.

నెమ్మదిగా లేచి బరువుగా అడుగులు వేసుకుంటూ బయటకు నడిచేడు. బయట బెంచిమీద పెట్టిన సంచీని తీసుకొని మొహం ఇటు అటూ కదల్పకుండా తిన్నగా వీధిలోపడ్డాడు. హోటల్లో రూంని ప్రొద్దుటే ఖాళీచేసేడు. రైలు టైంకు యింకా ఐదారుగంటలు వ్యవధివుంది. ఈ ఐదారుగంటలు గడపటం ఒక పెద్దసమస్య అయిపోయింది. మనస్సులో రైళ్ళు విమానాలు పరిగెడుతున్నాయి.

సెంట్రల్ స్టేషనుకుచేరి ఒక అరగంట సేపు యిటూ అటూ పచార్లుచేసేడు. గానుగయెద్దులాగ ఒకచోటే తిరగటం చాల విసుగ్గా వుంది. అక్కడనుంచి పారీస్ కార్నర్ వరకు నడిచి వెళ్ళేడు. ఈ నడకతో వళ్ళు పూర్తిగా అలసిపోయింది కాని మనసుకు విశ్రాంతి మాత్రం కలుగలేదు. అక్కడ ఒక బస్సుయెక్కి మౌంట్‌రోడ్డు, అక్కడనుంచి మైలపూరు, మైలపూరునుంచి లజ్‌కార్నర్, అక్కడనుంచి త్యాగరాయనగర్ చేరేడు. మాంబళంలో ఎలక్ట్రిక్ ట్రైను యెక్కి మళ్ళీ పార్కుటౌను చేరేడు. బస్సులో వున్నంతసేపు మద్రాసులో చేసిన కార్యక్రమాన్నంతా మళ్లీ సమీక్షచేసుకున్నాడు. లెక్కల తణిఖీ డిపార్టుమెంటులో వుద్యోగం వచ్చే సావకాశం యెంతమాత్రం లేదు. బ్యాంకి యింటర్వ్యూకి వెళ్ళకపోవటం పొరపాటేమొ అనుకున్నాడు. ఈ తప్పుము యింటిదగ్గర కప్పిపుచ్చాలి. ఈ ఆలోచనలతో తల వేడెక్కిపోయింది. టైనాంపేటలో రోడ్డుప్రక్క అవారా కనపడ్డాడు. బుష్‌కోటూ, తనూ, చెట్లక్రింద అతి హడావుడిగా తిరుగుతున్నాడు. వాడి అవస్థను చూసి శర్మ నవ్వుకున్నాడు. బస్సులో వుండటంవల్ల వాడుమాత్రం తనని చూడలేదు.

సెంట్రల్ స్టేషనుకు చేరటప్పటికి రైలు టైమయింది. టిక్కట్టు, నాలుగు అరటిపళ్లు కొనుక్కొని రైలెక్కేడు. ఆపూట భోజనం ప్రసక్తి మఱి యెత్తుకోలేదు. సామానులు పెట్టుకునే పైబల్ల యెక్కి సంచి తలక్రింద పెట్టుకొని పడుకున్నాడు.

(ఇంకా వుంది)



29

జిప్సీ యువతి ఉరి బారినుంచి ఎలా తప్పించబడిందీ క్రమేణా క్లాడ్ ఫ్రాలో విని తెలుసుకున్నాడు. అంతవరకూ ఆమె చనిపోయిందనే భావంతోనే ఉన్నాడు. ఆమె చనిపోయినందుకు అతడు పడిన వ్యథ ఇంతింత కాదు. కాని ఆపైన ఆమె చనిపోలేదనీ, ఫీబస్ కూడా బ్రతికేఉన్నాడనీ తెలిసేసరికి అతని యాతన మరింత దుర్భరమయింది. క్లాడ్ తలుపులు వేసుకొని తన గదిలోనే కాలం గడుపుతున్నాడు. కొందరతడికి జబ్బుజేసిందనుకున్నారు. వాస్తవాని కది మానసిక వ్యాధి. అతని తమ్ముడు జెహాన్ అనేకసార్లు వచ్చి తలుపుకొట్టి పిలిచాడు, తలుపులు బద్దలుకొట్టినంత పని చేశాడు; గొంతు చించుకున్నాడు; కాని తలుపులు తెరుచుకోలేదు.

రోజులకొద్దీ కిటికీవద్ద నిలబడి గడిపాడు. అక్కడనుంచి ఎమరాల్డా గది కనపడుతుంది. ఎమరాల్డాని చాలసార్లు చూశాడు. మేకనికూడా చూశాడు. క్వాసిమోడో ఆమెతో మాట్లాడ్డం చూశాడు. ఆమెపట్ల క్వాసిమోడో చూపుతున్న అనురాగం, శ్రద్ధ గమనించాడు. ఆమెను తప్పించడంలో క్వాసిమోడో అభిప్రాయ మేమై ఉంటుందని ఆలోచించాడు. వారిద్దరి సంభాషణక్రమమూ, ఇద్దరి ముఖాలలోని భావాలనూ అనేకసార్లు దూరంనించి గమనించాడు. క్లాడ్ హృదయంలో ఎక్కడో క్వాసిమోడోపట్ల అసూయ జనించింది. అసూయ జనించినట్లు తెలిస్తిరాగానే క్లాడ్ సిగ్గుపడిపోయాడు. కెప్టెన్‌పట్ల ఈర్ష్య వహించడంలో వింతలేదు; క్వాసిమోడోపట్లనో! అది తలపుకు వచ్చేసరికి క్లాడ్‌కి పిచ్చెత్తినట్లయింది.

రాత్రులతనికి దుస్సహంగా ఉన్నాయి. జిప్సీసుందరి అతని మనోనేత్రం ముందు నృత్యం చేస్తోంది. వివిధదృశ్యాలు కన్నులకు కట్టినట్లయి అతని నెత్తురుడికిపోతోంది.

ఒకనాటిరాత్రి బాధ భరించలేక నిలువెల్లా కంపించిపోతూ లేచాడు. దీపం ఒకటి చేతపట్టుకుని గదినుంచి బైట పడ్డాడు. అతని కన్నులలో నిప్పులు కురుస్తున్నాయి. ఎమరాల్డా ఉన్న గది ముందు గోపురసోపానాల ద్వారపు తాళంచెవి క్లాడ్‌వద్దనే ఉంది.

ఆరాత్రి ఎమరాల్డా సుఖంగా నిద్రపోతోంది. గతాన్ని మరిచి భవిష్యత్తుగురించి తిరిగి ఆశలు పెంచుకొని సుఖస్వప్నాలు కంటూ నిద్రపోతోంది. ఫీబస్ సన్నిధిలో ఉన్నట్లు కలకంటున్న సమయంలో ఆమెకు సమీపంలో సవ్వడి వినవచ్చింది. మేలుకుని కన్నులు తెరిచి చూసింది. చుట్టూ చీకటి దట్టంగా ఆవరించి ఉన్నప్పటికీ కిటికీవద్ద ముఖం స్పష్టంగా ఆమెకు కనపడింది. ఆ ముఖంపైన దీపపు వెలుగు పడుతోంది. ఆమె చూసినట్లు తెలియగానే క్లాడ్ దీపం ఊదివేశాడు. ఎమరాల్డా భీతితో కన్నులు మూసుకుంది. "అమ్మో! సైతాన్" అని అరవబోయింది. కాని గొంతు పెగిలి రాలేదు.

త్రుటిలో పూర్వపు దుర్ఘటనలన్నీ ఆమె స్మృతిపథంలో మెరుపువలె మెరిశాయి. భీతిచేతస్పృహరాలై పక్కపై వాలిపోయింది. కొంతసేపటికి ఆమె నెవరో తాకినట్లయింది. ఆమె అదిరిపడింది. ఒక్క ఉదుటున లేచి కూర్చుంది. క్లాడ్ ఆమెను అమాంతంగా తన హస్తాలలో బంధించాడు. ఆమె బిగ్గరగా అరవబోయింది; కాని అరవలేకపోయింది. "ఛీ! నన్ను చంపకు, ఆ! ఆ! సైతాన్!" అని హీనస్వరంతో అనగలిగింది.

"నా మాట విను. నన్ను కనికరించు!" అంటూ ఆమెభుజాలు చుంబించాడు.

మూలం:
విక్టర్ హ్యూగో

అనువాదం:
సూరంపూడి సీతారామ్

ఎమరాల్డా విడివడ్డానికి పెనగులాడింది. కాని సాధ్యపడలేదు. రెండు చేతులతోను-అతని బటతల చివర మిగిలిన కొద్ది జుట్టూ గట్టిగా పట్టుకుని తలవెనక్కి వంచి అతని ముద్దులు వారించింది. క్లాడ్ ఆమె నోడిసి పట్టడానికి ప్రయత్నిస్తూ అన్నాడు "నా ప్రేమ ఎటువంటిదో నీకు తెలియదు. అది నిప్పు. నాలో భగ భగ మండి నన్ను కాల్చివేస్తోంది." క్లాడ్ మరింత సత్తువ తెచ్చుకుని ఆమెచేతులు రెండూ గట్టిగా పట్టుకున్నాడు.

"నన్నొదులు. ఛీ! లేకపోతే నీ మొహంమీద ఉమ్మేస్తాను. విడిచిపెట్టు నన్ను!" అంది యువతి.

క్లాడ్ కొంచెం పట్టుసడలించి అన్నాడు: "ఉమ్మెయ్యి! నన్ను కొట్టు! నా రక్తం కళ్ళచూడు! నీ యిష్టంవచ్చినట్టు చెయ్యి! కాని నన్ను నిరాకరించకు." అని బ్రతిమలాడాడు.


కొది పట్టు సడలగానే ఆమె చెయ్యెత్తి అతని ముఖంమీద ఛెళ్లున కొట్టింది. "షో సైతాన్" అంటూ అతని ముఖం రక్కడానికి వేళ్లు నిగిడ్చి చేతులుచాచింది. ఆమె చేతులు బలంగా పట్టుకుని తిరిగి భుజాలపైనా చేతులపైనా ముద్దులు కురిపించ నారంభించాడు. పెనగులాటలో యువతి అలసిపోయింది. తిరిగి ఓపిక తెచ్చుకుని ఆర్తనాదం చేసింది. ఎవ్వరూ రాలేదు. మేకమాత్రం మేలుకొని అరవడం మొదలు పెట్టింది.

"అరవకు" అని క్లాడ్ ఆమె నోరు నొక్కాడు. శక్తి నశించి ఆమె పక్కపై ఒరిగిపోయింది. ఒరిగినప్పుడామె చేతి కేదో చల్లగా తగిలింది. వెంటనే ఆమె కెక్కడలేని శక్తి వచ్చింది. అందిన ఈల తీసుకుని బిగ్గరగా ఊదింది.

"అదేమిటి?" అన్నాడు క్లాడ్. అంటున్నంతలోనే ఉక్కువంటి చెయ్యొకటి అతని భుజాన్ని ఒడిసి పట్టుకుంది. భయపడి క్లాడ్ యువతిని వదిలేశాడు. చూస్తే చీకటిలో ఎవరో తెలియ లేదు. పళ్లు కొరుకుతున్నట్టు పటపట శబ్దం స్పష్టంగా వినపడింది. చీకటిలో కత్తి ఒకటి ఛాయామాత్రంగా కనపడింది. లీలగా క్వాసిమోడో ఆకారంకూడా అతనికి కనపడింది. ఇంకెవరూ అక్కడికి రారు. బయట ద్వారంవద్ద కాలి కేదో మెత్తగా తగిలిన గుర్తు కూడా వచ్చిందతనికి. కాని వచ్చినవా డొక్కమాటైనా పలక్కపోవడంవల్ల ఏంచేయాలో తోచలేదు. కత్తి చూపుతున్న చేతిని క్లాడ్ గట్టిగా పట్టుకున్నాడు. "క్వాసిమోడో—ఆగు" అన్నాడు కొంచెం బిగ్గరగా. అతడు చెవిటివాడని ఆ క్షణంలో మరిచిపోయాడు!

త్రుటిలో క్లాడ్ని నేలపై పడవేసి ఛాతీపైన మోకాలాన్ని నొక్కిపట్టాడు క్వాసిమోడో. మోకాలి వంకరనుబట్టి అతడు క్వాసిమోడో అని గుర్తించాడు క్లాడ్. కాని ఏం చెయ్యడం. తానెవరో అతని కెలా తెలియచెయ్యడం? ఇంక తనకు చావు తప్పదనుకున్నాడు.

క్వాసిమోడో కత్తితో పొడువబోయి ఆగిపోయాడు. "ఊహూ. తప్పు! ఆమెకీ పాపం అంటకూడదు" అని గొణిగాడు. కంఠస్వరాన్ని గుర్తుపట్టి అతడు క్వాసిమోడో అని రూఢిపరుచుకున్నాడు క్లాడ్. క్వాసిమోడో లే క్లాడ్ని ఒక కాలుపట్టుకుని బయటికి బరబర ఈడ్చుకుపోయాడు అవతల చంపాలని అతడి ఉద్దేశం.



రామలక్ష్మణులు

ఫొటో: ఎమ్. ఎస్. శర్మ (రుస్తుంబాదా).

★ ఘంటారావం ★

కాని అదృష్టవశాత్తు అప్పుడే వెన్నెల వచ్చింది. వెన్నెలలో క్లాడ్ ముఖాన్ని గుర్తుపట్టి క్వాసిమోడో గజగజ వణికిపోయాడు. క్లాడ్ కాలు వదిలేశాడు. క్లాడ్ ఒక్క ఉదుటున లేచి రోషంతో రొప్పడం మొదలుపెట్టాడు. క్వాసిమోడో చేతులు నులుము కుంటూ దీనంగా నిలబడిపోయాడు. గుమ్మంలోకి వచ్చి నిలబడిన ఎమరాల్డా ఈమార్పు చూసి ఆశ్చర్యపడింది. క్లాడ్ సంజ్ఞలలో తన రోషాన్ని వ్యక్తపరుస్తున్నాడు. కొంతసేపు క్వాసిమోడో తల వంచుకుని నిలబడ్డాడు. తరువాత గుమ్మాని కడ్డంగా మోకరిల్లి ఇలా ప్రార్థించాడు: "ముందు నన్ను చంపి తరవాత మీ యిష్టం వచ్చినట్లు చెయ్యండి" ఇలా అంటూ కత్తి క్లాడ్‌కి అందించాడు. క్లాడ్ కోపంతో అది అందిపుచ్చుకోబోయేటంతలో ఎమరాల్డా చటుక్కుని లాక్కుంది. "ఇప్పుడు రా!" అంటూ క్లాడ్ వంక కత్తి ఝుళిపించింది. క్లాడ్ వెనుకంజ వేశాడు. "ఇప్పుడు రా దగ్గిరికి. పిరికిపందా!" అని అరిచింది. క్లాడ్ ఈర్ష్యను గుర్తించిన ఎమరాల్డా ఈ అవకాశాన్ని విడిచిపెట్టలేదు. "నాకు తెలుసులే. ఫీబస్ బ్రతికే ఉన్నాడు" అంది.

క్లాడ్ భరించలేకపోయాడు. క్వాసిమోడోని పడతన్ని కోపంతో ఉడికిపోతూ గోపురసోపానాలవైపు చరచర నడిచిపోయాడు.

క్లాడ్ వెళ్లిపోగానే క్వాసిమోడో ఈలతీశాడు. అది యువతి కందిస్తూ: "తుప్పుపట్టిపోతోంది" అన్నాడు. మెల్లిగా అక్కడి నుంచి నడిచి వెళ్ళిపోయాడు.

ఎమరాల్డా పక్కపైపడి ఏడ్వసాగింది. తిరిగి ఆమెకు భవిష్యత్తు అంధకారమయమైనట్లు కనపడింది.

క్లాడ్ తన గదిలో తలుపులు గడియవేసుకుని కూర్చున్నాడు. అతనికి క్వాసిమోడోపట్ల ఈర్ష్య పెల్లుబికి వచ్చింది. పళ్లు పటపట కొరుకుతూ "ఆమె నెవ్వరూ పొందడానికి వీల్లేదు" అనిగొణుక్కున్నాడు.

30

జిప్సీయువతి నాటర్‌డామ్ చర్చిలో ప్రాయశ్చిత్తం చేసుకుంటున్న సమయంలో, ఇంక ఆమెకు ఎలాగూ ఉరితప్పదనే భావంతో గ్రింగైర్ గ్రీవ్ చౌకునుంచి తప్పుకున్నాడు. విలాసంతో జోక్యం చేసుకోవడం వృథా అనుకున్నాడు. ఆమె నాటర్‌డామ్ చర్చిలో ఆశ్రయం తీసుకున్నట్లు కొన్నాళ్ళకి బికారుల నిలయంలో విని అతడు సంతోషించాడు. అతడికి డాలీ అంటే ప్రాణం. ఆపైన నిశ్చింతగా బికారుల నిలయంలోనే రాత్రులు గడుపుతూ, పగటివేళ మొగ్గలువేసి ఫీట్లుచేసి పొట్ట పోషించుకుంటూ హాయిగా కాలం గడుపుతున్నాడు. రాత్రివేళ రెండు మహత్తర కావ్యాల రచనలో కృషిచేస్తున్నాడు. ఇదిగాక తంత్రశాస్త్రం అధ్యయనించి కొన్నాళ్లకు శిల్పశాస్త్రాభ్యాసంలో పడ్డాడు. శిల్పశాస్త్రాభ్యాసం ఎంతవరకూ వచ్చిందో తెలియదు కాని అతడు ప్రతిభవనం ముందూ, ప్రతి చర్చిలోనూ నిలబడి శిల్పాలను తదేకంగా చూస్తూండడం మొదలుపెట్టాడు. కల్పనపట్ల ప్రీతి, రూపకల్పనపట్ల ప్రీతిగా మారింది.

ఒకరోజున అలా ఒక చర్చివద్ద నిలబడి తదేకదృష్టితో అతడు శిల్పాలను దీక్షగా పరిశీలిస్తూ పరమానందం అనుభవిస్తున్న సమయంలో అతని భుజంపైన ఎవరో తట్టినట్లయింది. తిరిగిచూడగా క్లాడ్ ఫ్రోలో కనపడ్డాడు. గ్రింగైర్ నిశ్చేష్టుడైనాడు. అతడు క్లాడ్‌ని చూసి చాల రోజులయింది. సంశయాత్ముడైన తత్వవేత్త గ్రింగైర్, క్రీస్తుమతంపట దృఢవిశ్వాసి అయిన క్లాడ్‌ని చూస్తే ఎప్పుడూ అతడి మనస్సు వికలమైపోతుంది.

క్లాడ్ కొంతసేపు మౌనంగా ఉన్నాడు. క్లాడ్ ముఖంలో మార్పు గమనించాడు గ్రింగైర్. తరువాత క్లాడ్ అడిగాడు "ఏం ఎలా వున్నావు?"

"ఏమిటి? నా ఆరోగ్యమా? ఆ! ఉందండి, అలాగే. మొత్తం మీద బాగానే ఉన్నానులెండి. దేనికీ నేనంతగా లక్ష్యపెట్టనండి. సంతోషం సగం బలం అన్నారండి."

"అయితే నీకే బాధలూ కష్టాలూ లేవా?"

"అబ్బెబ్బె! అలాటివేం లేవండి. నా కసలు లేవండి."

"ఇప్పుడేం చేస్తున్నావు?"

"శిల్పాలు పరీక్షిస్తున్నాను. అబ్బ! ఎంత అద్భుతంగా ఉన్నాయి!"

క్లాడ్ ముఖంలో చిరునవ్వు తోచింది.

"ఇవిచూసి ఆనందిస్తున్నావా?" అన్నాడు.

"ఆనందమా! ఇది స్వర్గం." అంటూ శిల్పాలవంక దృష్టి మరల్చాడు. "చూడండి. ఈ శిల్పాలు ఎంత అద్భుతంగా ఉన్నాయో ఆ వొంపులు, ఆ సౌకుమార్యం..."

"అయితే నువ్వు సుఖంగానే గడుపుతున్నావన్నమాట!"

"అవునవును. మొట్టమొదట కొంతలంటే ఆసక్తి ఉండేది. తరవాత ఆ ఆసక్తి మేకవంటిమృగాలపైకీ, ఆపైన రాళ్ళమీదికీ మారింది. ఆడవాళ్లూ మృగాలవల్ల భంగపడతాం. రాళ్లు మోసం చెయ్యవు. చూడండిఆరాళ్లు ఎంత చక్కగా చెక్కబడ్డాయో!..."

"ఇంక నీకే జీవితంలో వేరేసుఖం అక్కర్లేదా?"

"అక్కర్లేదు"

'ఏవిచారమూ లేదా?"

ను. కోరికలూ లేవు. నా బ్రతుకుపద్ధతి నేను ఏర్పాటు

చే న్నాను."

'మనిషి చేసే ఏర్పాట్లు పరిస్థితులవల్ల తలక్రిందులౌతాయి."

"నాకాభయం లేదు. నాబుద్ధి స్థిరంగా కాపాడుకుంటాను"

"నీ జీవనోపాధి?"

"మామూలే. కావ్యాలు రచిస్తున్నాను. కాని దానివల్ల సంపాదనేంలేదు. మీరు చూశారుగా! దవడబలం చూపించి కుర్చీలు అవీ నిలబెట్టే మొగ్గలువేసి డబ్బు సంపాదిస్తున్నాను."

"కవికి ఇదేం దిక్కుమాలినవృత్తి?"

"అదిమాత్రం తక్కువదా? దానికీ స్థిరచిత్తం, కౌశలం అవసరమే."

"అయితే దరిద్రం ఇంకా వదల్లేదన్నమాట."

"నిజమే కావచ్చు కాని నాకు దుఃఖమనేది లేదు. అది చాలు."

ఇంతలో గుర్రాల డెక్కలచప్పుళ్లు వినవచ్చాయి. మహారాజుగారి అశ్వికదళం ఆదారినే వెళ్ళింది. ఆవంక చూస్తూ ఇద్దరూ కొంతసేపు మౌనంగా ఉన్నారు.

"కెప్టెన్‌వంక అలా చూస్తున్నారేమిటి?" అన్నాడు గ్రింగైర్.

"అతన్ని బాగా చూసిన గుర్తు నాకు" అన్నాడు క్లాడ్.

"పేరు?"

"పేరు కెప్టెన్ ఫీబస్ అనుకుంటాను"

"ఫీబస్! చిత్రమైన పేరు. ఒకమ్మాయి ఫీబస్ పేరుచెప్తే కాని రెండోమాట మాటాడేది కాదు."

"ఇటురా! నీతో కొంత మాట్లాడాలి" అంటూ క్లాడ్ కొంచె పక్కకు నడిచాడు. గ్రింగైర్ వెంటవెళ్లాడు.

"నీకంటె, నాకంటె అతనిపనే బాగుంది."

"అది నాకు తెలియదు కాని, నామట్టుకు నాకు ఏ లోటూ కనపడ్డంలేదు."

"నీకంటె అదృష్టవంతులైన వాళ్ళని చూస్తే నీకు ఎన్నడూ ఈర్ష్యపుట్టదా?"

"ఈర్ష్యా? ఎందుకు?"

"అటువంటి అధికారం, దర్పంచూస్తే?"

"వద్దు! స్వర్గంలో బానిసగా ఉండడంకంటె నరకంలో రాజుగా ఉంటాను."

"చిత్రమే!" అన్నాడు క్లాడ్ఫ్రాలో. కొంతసేపు ఆలోచించి ఇలా అన్నాడు: "జిప్సీయువతి సంగతేమిటంటావ్?"

"అరె! ఆమె సంగతెందు కొచ్చిం దిప్పుడు?"

"ఆమె నీ భార్యకాదా?"

"ఒకవిధంగా అవుననుకోండి. ఓటికూజా ఒకటి బద్దలుకొడితే ఆపెళ్ళయిపోయింది. ఒక టడుగుతాను చెప్పండి. మీరు నిత్యం ఆమెగురించే ఆలోచిస్తున్నారేం?"

"నువ్వు ఆలోచించావా?"

"ఉహు, అసలాలోచించను. ఆలోచించడానికి నాకు తీరిక లేదు."

"ఆమె నీ ప్రాణాలు కాపాడలేదా?"

"నిజమే కాపాడింది"

"ఆమె ఏమయింది?"

"ఏమో నాకు తెలియదు. ఆమెని ఉరితీశారనుకుంటాను."

"అనుకుంటున్నావా?"

"అవును. ఉరితీస్తారని తెలిసి ముందే అక్కడినించి వెళ్ళిపోయాను."

★ ఘంటారావం ★

"నీకు తెలిసిందింతేనా?"

"ఆగండి. ఆమె నాటర్‌డామ్ చర్చిలో ఆశ్రయం తీసుకుందని విన్నాను. మేకకూడా అక్కడుందేమో తెలియలేదు. నాకు తెలిసిందింతే."

"అయితే నే చెప్తాను విను. ఆమె అక్కడున్నమాట నిజమే. కాని మూడురోజుల్లో పార్లమెంటు డిక్రీ ఇస్తుంది. డిక్రీ ఇవ్వగానే అధికారులు చర్చి ప్రవేశించి ఆమెను పట్టుకుని తీసుకువెళ్ళి ఉరితీస్తారు."

"అయ్యో! పాపం." అని చప్పరించేశాడు గ్రింగైర్. క్లాడ్ మాట్లాడలేదు. గ్రింగైర్ మళ్ళీ అన్నాడు. "పాపం ఆమె ఆ గోపురంలో పిచ్చుకగూళ్ళమధ్య కూర్చుంటే పార్లమెంటుచేత డిక్రీ ఇప్పించాలనే పాపపుబుద్ధి ఎవరికి పుట్టిందో?"

"రాక్షసులున్నారు."

"లోకం మహా చెడ్డది."

కొంతసేపుండి హఠాత్తుగా అడిగాడు క్లాడ్: "ఆమె నిన్ను రక్షించిందని ఒప్పుకుంటావా?"

"తప్పకుండా ఒప్పుకుంటున్నాను. నా మెడకి ఉచ్చు తగిలే సమయంలో వచ్చి రక్షించింది."

"అయితే ఆమెని నువ్వు రక్షించాలా వద్దా?"

"తప్పకుండా. నా కంతకంటె కావలసిందిలేదు. కాని నేను ఉచ్చులో పడతానేమో?"

క్లాడ్ తల కొట్టుకున్నాడు. "ఆమెని రక్షించడం ఎల్లాగ?"

"భగవంతుడే ఉన్నాడు."

"కాదు. మనమే రక్షించాలి. ఎల్లాగ?"

"ఆగండి నే చెప్తాను. మహారాజాగారిని క్షమించమని ప్రార్థిస్తే?"

"లాభంలేదు. పులినోట్లో మాంసంముక్క లాక్కోవచ్చు గాని ఆయన క్షమించడం జరగదు."

గ్రింగైర్ ఆలోచించాడు: "ఒకపని చేద్దాం. ఆమె గర్భిణీ అని చెప్పేద్దాం."

క్లాడ్ ఉలిక్కిపడ్డాడు. ముఖంలో రోషం ఉట్టిపడింది. "గర్భిణీయా? అదేదో నీకు నిజంగా తెలుసునట్లుందే!"

"నేనా! అబ్బెబ్బే! కాదుకాదు. అసలు మాది బలవంతపు పెళ్ళి. పైగా ఆమె నన్నెన్నడూ దగ్గిర చేరనివ్వలేదు ఏమయితేం, అలాచెప్తే కొంత వ్యవధి చిక్కుతుంది. ఆ తరవాత ఆలోచించవచ్చు. ఆస్పత్రి మంత్రసానుల కేదో ముట్టచెప్పితేచాలు; పనయిపోతుంది. వాళ్లు బీదవాళ్లు."

క్లాడ్ ఇతనిమాటలు వినిపించుకోడం మానేశాడు. తనలో అనుకున్నాడు: "మూడురోజుల్లో ఆమె నక్కడనించి తప్పించాలి. డిక్రీమాట ఎలావున్నా క్వాసిమోడో అడ్డున్నాడు. ఛీ. వాడెల్లా నచ్చాడో ఆమెకి. ఆడవాళ్ళు చపలబుద్ధులు. గ్రింగైర్! నాకొక్కటే ఉపాయం తోచిరది. దానికి నువ్వొప్పుకోవాలి."

"ఏమిటది?"

"నీప్రాణం రక్షించినందుకు నువ్వామెకు ఋణపడి ఉన్నావు. ఆ ఋణం తీర్చుకోవాలంటే ఇదొక్కటే పద్ధతి."

"ఏమిటండది?"

"రాత్రీ పగలు చర్చిచుట్టూ కాపలా ఉంటోంది. చూని లోపలికి వెళ్లనిచ్చినవాళ్ళనే తిరిగి ఇవతలకి రానిస్తున్నారు నిన్ను తేలిగ్గా లోపలికి వెళ్ళనిస్తారు. నువ్వువెళ్ళి ఆమెతో దుస్తులు మార్చుకుని ఆమెని పంపించు."

"మరి నామాట?"

"నిన్ను విడిచిపెట్టవచ్చు. లేదా ఉరితీయవచ్చు. కాని ఆమె తప్పించుకుంటుంది."

గ్రింగైర్ బుర్ర గోక్కున్నాడు. అంతవరకూ కళకళలాడుతున్న అతడి ముఖం విన్నబోయింది.

"ఏమంటావు?"

"నన్ను ఉరితీస్తే?"

"నువ్వు ఒప్పుకోవాలి! ఆమె నిన్ను రక్షించింది. ఆ ఋణం నువ్వు తీర్చుకోవాలి."

"ఓస్! నేను తీర్చని ఋణాలు చాలానే ఉన్నాయిలెండి."

"అలా కాదు గ్రింగైర్. నువ్వొప్పుకోవాలి."

"అంటే? నేను చచ్చిపోవాలన్నమాట! చచ్చిపోవడం అంటే చాల అద్భుతమైన విషయం! ఉరిలో చావడం అంటే? మామూలుగా చచ్చిపోతే ఎంతో అంతే! అయినా తేడాఉంది. ఉరిలో చచ్చిపోవడం అంటే, గాలిలో ఊగులాడాలి—బ్రతుకులో మనుషులు సుఖదుఃఖాలమధ్య, ఆశ నిరాశలమధ్య ఊగిసలాడినట్లు ఊగిసలాడ్డం. చచ్చిపోయేముందు ఉరిలో ఎలావుంటుంది? చావుకీ బతుక్కీ మధ్య ఘట్టాన్ని స్వయంగా అనుభవించి చూడవచ్చు. బ్రతికి, బ్రతుకు మాస్తున్నంత స్పష్టంగా, చావబోతూ చావు బ్రతుకుల్ని స్పష్టంగా చూడవచ్చు. బలే! అద్భుతం! చాలా బాగుంది."

"అయితే నువ్వు ఒప్పుకున్నట్లేనా? భేష్!"

"అయినా చావంటే ఏమిటి? ఒక్కక్షణం బాధగా ఉంటుంది. అంతేకదా! ఉన్నదనుకున్న ఈ కాస్తా లేనిదై శూన్యమైపోతుంది. చచ్చిపోవడం ఇష్టమేనా అని అడిగితే ఒక కవి అన్నాట్ట: 'ఏం ఎందుకు ఇష్టం ఉండకూడదు? చచ్చిపోయిన తరవాత మహామహులైనవారందరినీ, స్వర్గలోకంలో చూడవచ్చు."

"అయితే నువ్వొప్పుకున్నట్లేనన్నమాట. రేపేవస్తావా?"

గ్రింగైర్ ఆలోచనలోనుంచి బైటపడ్డాడు. "ఏమిటన్నారు? రేపా? ఎందుకు? ఉరితీయించుకోడానికా. ఛ! అదేంమాట. అదెల్లా కుదురుతుంది? మహామంచిమాట చెప్పారు. నన్ను క్షమించండి."

క్లాడ్ పళ్లు పటపట కొరికాడు. "అయితేపో! మూర్ఖుడా!" అంటూ వెళ్ళిపోబోయాడు.

"ఆగండి. ఒక్కమాట వినండి" అని పిలిచాడు గ్రింగైర్. "నాభార్యకోసం మీరింత తాపత్రయపడుతున్నారు బాగానే ఉంది. ఆమెని తప్పించడానికి ఉపాయం చెప్పారు. అది నాకు నచ్చలేదు. కాని నా కింకో మంచిఉపాయం తట్టింది. వింటారా? లేకపోతే నేను చచ్చిపోతేగాని మీకు తృప్తి ఉండదా? ఏదో చెప్పండి."

"ఏమిటో ఆ ఉపాయం చెప్పరాదూ?"

గ్రింగైర్ కొంతసేపు ఆలోచించాడు. ముక్కుపైన వేలు తాటించి "అదీ! అలాగ!" అన్నాడు. "పారిస్‌లో బికారులందరికీ ఆమె పరదేవత. వాళ్ళని రెచ్చగొట్టడం ఎంతోసేపుపట్టదు; క్షణం. వాళ్లు ఒక్కపెట్టున దాడిచేసివచ్చి ఆమె నెత్తుకుపోవచ్చు. ఆ పని వాళ్ళు తప్పకుండా చేస్తారు. రేపురాత్రి చేయిస్తే సరి."

"ఏమిటది? మళ్ళీ చెప్పు"

"ఆగండి. నన్ను ఆలోచించుకోనివ్వండి. ఆలోచనకి అడ్డుపడకూడదు." గ్రింగైర్ కొంతసేపు ఆలోచించాడు. "భలే! మంచి ఉపాయం. దీంతో పని నెరవేరిపోతుంది" అని బిగ్గరగా అరిచాడు.

"అదెల్లాగో చెప్పు."

"ఇలా రండి. చెప్తాను. మంచి ఉపాయం తట్టింది. నాబ్రుర కూడా తక్కువకాదే! అయితే ఒకమాట చెప్పండి. మేకకూడా ఆమెదగ్గరుందా?"

"ఉంది."

"మేకనికూడా ఉరితియ్యాలనుకున్నారు కాదూ?"

"అదంతా నాకెందుకు?"

"అవును డాలీనికూడా ఉరితీద్దామనుకున్నారు. పాపం!"

"నీ ధోరణి మానేసి నీ ఉపాయ మేదో ముందు చెప్పవోయ్"

"ఆగండి. మెల్లిగా. అన్నీ జాగ్రత్తగా సమకూర్చుకురావాలి."

గ్రింగైర్ క్లాడ్ చెవిలో చెప్పాడు. "సరే అయితే రేపు" అన్నాడు క్లాడ్.

"రేపు" అన్నాడు గ్రింగైర్.

తరువాత ఇద్దరూ చెరొక దారీ పుచ్చుకున్నారు.

క్లాడ్ నాటర్ డామ్ చర్చివద్దకు వెళ్లేసరికి అక్కడ అతని తమ్ముడు జెహాన్ నిరీక్షిస్తున్నాడు. ఏమీ తోచక జెహాన్ గోడపైన బొగ్గుతో అన్నగారి రేఖాచిత్రం చిత్రించాడు. అయితే చిత్రంలో అన్నగారి ముక్కు పొడుగ్గా గీశాడు.

క్లాడ్ తీవ్రమైన ఆలోచనల్లో పడి తమ్ముణ్ణి గమనించలేదు.

జెహాన్ అన్నను పిలిచాడు: "నిన్ను చూడ్డంకోసం వచ్చాను" అన్నాడు.

"ఏం పని?"

"అన్నా! నన్ను చాలా ఆపేక్షతో చూస్తూన్నావు. నిన్ను విడిచిపెట్టి నేనెక్కడికీ వెళ్ళిపోకుండా ఏదేనా ఉపాయం చెప్పు."

"ఊ. తరవాత?"

"నావల్ల దోషం ఉన్నందువల్లే నువ్వు నన్ను నిందించినా ఏమీ అనుకోను. 'ఇలా ప్రవర్తించుకో, అలా చెయ్యి' అని నన్ను ఆజ్ఞాపించు."

"ఊఁ"

"అన్నా! నేను పాపిష్ఠిని. నా పాపాలకి ఫలంకూడా లభిస్తోంది. చేతిలో డబ్బున్నంతవరకూ విచ్చలవిడిగా తిరిగాను. ఇప్పుడు నా చేతిలో చిల్లిగవ్వలేదు. ఇప్పుడా స్వేచ్ఛ, ఆసక్తి, వ్యసనాలు పోయినాయి. నేను పశ్చాత్తాప పడుతున్నాను."

"ఓహో!"

"నేను నా జీవితం మార్చేసుకుంటాను. నా దోషాలు ఒప్పుకుని మంచిగా ఉంటాను. మళ్ళీ చదువుకోవాలని బుద్ధిపుట్టింది. కాని నాదగ్గర పుస్తకాలులేవు, కలంలేదు, సిరాలేదు. అన్నీ కొనాలి. కొంచెం డబ్బు కావాలి."

"అంతేనా?"

"అంతే! కొద్దిడబ్బు."

"నా దగ్గిరేంలేదు."

"ఇంక నాకు దారేముంది? చదువులేకపోతే బికారిలా తిరగవలసిందే."

"బికారిలాగే పో."

జెహాన్ ముఖం మారిపోయింది.

"సరే. బికారినే అవుతాను."

"తప్పకుండా."

జెహాన్ గిరుక్కున వెనక్కి తిరిగాడు. క్లాడ్ ఒక పర్సుతీసి తమ్ముడిమీదికి విసిరాడు. "ఇదే ఆఖరు. ఇంకెన్నడూ నాదగ్గరికి డబ్బుకోసం రాకు. పో" అన్నాడు.

జెహాన్ పర్సు అందిపుచ్చుకుని చరచర వెళ్ళిపోయాడు.

(ఇంకా వుంది)

భావన

రంధి సోమరాజు

అతను సుఖశ్రీ. అతని భార్య ఉష నవరేఖ. అత డామెను 'రోజా కుమారి' అని పిలుస్తాడు. అలా అన్నప్పుడల్లా, ఆమె ముసిముసి నవ్వులతో, 'ఊరుకుందురూ...అదేమిటీ(...' అంటుంది. ఆమె అలా అన్నప్పుడల్లా అతను పకపక నవ్వుతాడు.

ఆవేళ అతని సైకిలు నడచేస్థితిలో లేదు. అందువల్ల వీధిలోనికి నడచివెళ్లడానికి అతనికి మనసొప్పలేదు. ఆ వాహనంమీద తప్ప అతనికి కాలినడకను బజారులోనికి పోవడమంటే—అతని పరువేదో బజారున పడిపోయినట్టుగానే ఉంది. అందువల్లనే కాబోలు, అతను చాలసేపు ఇంట్లో అటూ ఇటూ తిరిగాడు. ఇంతలో అతని భార్య, 'ఇంకా ఇక్కడే ఉన్నారేమిటి? ఇలా అయితే వేళకు అన్నం అమరినట్లే...ఉ ఉ ...త్వరగా వెళ్లిరండీ(...' అంది. అతను మెల్లగా ఆమెతో, 'సైకిలు పాడైంది' అన్నాడు; పాపమామె తను నడచివెళ్ళవలసి వచ్చినందుకు ఎంతో సానుభూతిని చూపవలసిన అవసరమున్నట్టు. అయితే ఆమె అదేమీ ఆలోచించకుండానే, 'అయితే నడవలేరా...పాపం చిట్టి పాపాయిలా మాట్లాడుతున్నారేమిటి!' అంది. అలా ఆమె అన్నందు కాతనికి కోపం రాలేదు. కాని అత నా సైకిలుపై కినుక వహించకుండా ఉండలేకపోయాడు.

'ఏమిటో చేతిలో సంచి ఉంచుకొని నడచి ఇంటికి కూరగాయలు తెస్తూఉంటే, అబ్బ! ఎంతసవ్యంగా ఉంటుంది! ఎంత తలవంపులుగా ఉంటుంది! అసలు తనంతటి వాడు కూరగాయలు తేవడమేమిటీ? ఏమిటో ఆ సాయీబునుమానిపించి వేయడం ఎంత పొరపాటైంది!' అనుకున్నాడు.

ఇంతలో అతని భార్యామణి, క్రొత్త ఫేషనులో శిల్పి చిత్రించినట్లుగాతీర్చి దిద్దుకున్న వీగముడిని, భూమికి జేనెడెత్తువరకు, అతిఅందమైన ఫక్కిలో జార్చిన చక్కని చీర చెరగును, రవ్వల దుద్దుల్ని, నెక్లెసు హారాన్ని, ప్రక్కవాటుగానిలచి అద్దంలో తిలకిస్తూ, పల్చని గులాబిరెమ్మల పెదవి, తెల్లని పలువరుస, సువిశాలమైనకనులు, ఒకించుక ముద్దుగా కదపి, 'చూశా రా......ఇవ్వాళ కూడ దాసీ దిరాలేదు. ఇలా అయితే నేనీ ఇంట్లో పని చేయలేను బాబూ' అని తమలపాకులవంటి అతి సున్నితమైన చేయిచాచి, పసిడిగాజుల నిగనిగలూ, పొడవైన వ్రేళుల ఎర్రని గోళ్ల తళతళలూ మెరిపించింది. సుఖశ్రీకి ఆమె వ్రేళులను ముద్దుపెట్టుకోవా లనిపించింది. ఒక్కసారి ఆమెను నిలువునా కౌగిలించుకోవాలనిపించింది. అతనికి నందుడు జ్ఞాపకానికి వచ్చాడు. కాని తన భార్య సుందరి వలె తనగురించి బెంగపెట్టుకోవడంలేదు. బజారుకు పోవొద్దని చెప్పడమూ లేదు. అంచాతనే అతనికి తప్పక ఇంటికి తిరిగి రాగలననే ధైర్యం కలిగింది. మరి బజారుకు వెళ్ళక తప్పదనీ అనిపించింది. ఇంతలో ఆ సుందరి, 'నేనడిగినదానికి సమాధానం చెప్పకుండానే వేంచేస్తున్నారేమిటీ...' అంది. ఇంత పరాకు - రోజా కుమారి అడిగితే జవాబు చెప్పకుండా పయనమై వెళ్ళిపోయేటంత పరాకు, ఎట్లా కలిగిందా అని సుఖశ్రీ ఒకసారి తనగుండె లోతుల్ని గాలించాడు. ఇంతలో అతని ప్రియసఖి, 'ఏమిటండీ ..మాట్లాడరేమిటి? దాన్ని మాని పించి ఇంకోదాన్ని పెడతారా లేదా

అంది. సోయగపు మిటారి ఇన్ని పలుకులు పలికినా మారాడని తన బుద్ధిమాంద్యతకు సిగ్గుపడి సుఖశ్రీ పుంగవుడు, 'అలాగే, అలాగే...దాన్ని మానిపించేదాం' అన్నాడు. అంటూ బజారుకు విచారంగా అడుగులు వేసుకుంటూ, దించిన తల ఎత్తకుండా, చేతిలోసంచి ఇతరులకు కనిపించకుండా, బహు నేర్పుగా చిన్న మడతపెట్టి దాన్ని చేతి రుమాలుగా హస్తాన నొక్కి ఉంచి, దీర్ఘంగా ఏమిటో ఆలోచిస్తూ దారితీస్తున్నాడు. ఇహ ఆ చెలి, ప్రియుని గుమ్మమువరకూ సాగనంపి, 'వేగమే వచ్చేయండే(' అని కోయిలవలె ఒక మధుర ధ్వని వినిపించి, అతను వెనుదిరిగి చూసేవరకు ఒయ్యారంగా అక్కడే నిలచి, మోహానంగా లోనికి వెడలిపోయింది. దానితో సుఖశ్రీ మనసు కొంత సుఖానపడింది. రోజాకుమారి తను వెనుతిరిగి చూసేసరికి, చిరునగవు మొగాన సగం సగంగా సిగ్గు తొణికిస్తూ తనను మురిపెంగా గుమ్మంవద్ద నిలచి వీక్షిస్తూఉండడం, అతని కెంతో ఉత్సాహాన్ని కూర్చింది. ఇహ అతను ఆ ఉత్సాహాన్ని అమాంతా తీసుకొని ఎంత పనైనా చేసెయ్యగలడు. అయితే అట్లా అత కొంతమట్టుకు ఆచరిస్తాడూ లేదా ఆలోచించవలసిన విషయమే!

అసలు సుఖశ్రీ బహు సుకుమారి. ఆమెయో మరి లవలీ కిసాలయము. ఈ ద్వయము ఒక అందమైన రోజాపూల జంట. మరి వారి పలుకు, సుమనోహర పుష్ప సువాసనా సమ్మిశ్రిత సమీరము. దారి నడక, చల్లని నీలిమబ్బు వెల్లువల మెల్లని కదలికల నిండు ఒయ్యారము. వారి ఎదలు, నీలికడలి హృదయాన నిండు జాబిల్లి నర్తించిన రేయి, పులకించిన బంగరు కాంతుల విచ్చుకొనే పూలవంటి సోయగము!

సుఖశ్రీ వీధివెంబడి తలవాల్చి ఏమిటో ఊహిస్తూ మెల్లగా నడుస్తున్నాడు. రోజా కుమారి అతని కళ్ళముందు అవతరించింది. వెంటనే, 'రోజా కుమారి ఎంత సుకుమారి' అనుకున్నాడు సుఖశ్రీ. 'ఆమె ఏడు మల్లెపూల ఎత్తు ఉండునో, ఉండదో...నిజముగా నేటి నవనాగరికతా చిహ్నమునకామె మచ్చుతునక! సరియైన వేషరచనా శిల్పమున కామెది అందెవేసిన చేయి! తనది ఎంత అదృష్టము! ఆమె చేయి కదపినా, కాలు కదపినా అందాలరాసులు, రాసులు పోసినట్లుంటుంది. ఆమె ఎంత అందమైనది. ఆమె, నిజంగా చందనపు బొమ్మ! ఇట్లా సుఖశ్రీ ఊహల అంతరిక్షాన ఊరేగుతూ వుండగా, 'నమస్కారమండీ(...సుఖశ్రీ గారు' అంటూ ఒకాయన సుఖశ్రీని పలకరించాడు: సుఖశ్రీ ఒకింత పరధ్యానముగా తల ఎత్తి 'ఒహోహో...మీరా...నమస్కారమండీ...' అని ఇంకా ఏమిటో చెప్పడానికి నోరు విప్పబోతూవుంటే, ఆ పెద్ద మనిషి, 'అరే...నడచి వెళ్తున్నారేం... సైకి లేమయ్యింది' అని సుఖశ్రీ పడుతూన్న కష్టమున కాత నెంతో సానుభూతిని ప్రకటించాడు. పాపము సుఖశ్రీ తన మిత్రుని మాటకు, రెండు ముక్కలుగా తన తల తెగిపోయినట్లయి,పాతాళమునకు కృంగి కృంగి, కంఠమువరకూవచ్చిన దుఃఖమును దిగమ్రింగి సైకిలుకువచ్చిన రోగమును, సవివరముగా ఆయనకు వివరించి, తనమార్గమున తాను తిరిగి పయనము సాగించాడు.

అప్పటికి బారెడు ప్రొద్దెక్కింది. తరు లెక్కుతూవున్న తరణికాంతుల్ని, తరిగి పోతూవున్న నీలినీడల పొడవుల్ని సుఖశ్రీ, చూసేస్థితిలో లేడు. అతనిగుండె అర్థంకాని సామర్థ్యాతో తెగ ఇదైపోతూంది. అతని మనస్సు అవమానంతోదహించుకపోతూంది. ఇహ నడచి వీధిలోనికి అందులో కూరగాయలు తేవడానికి ఎప్పుడూ రాకూడదనే భావం అతనిలో చొచ్చుకొని, కాంక్రీటు గోడలోనికి బలంగా దిగిన మేకువలె ఊడి రావడం లేదు. ఎవరి జీవితపుస్థాయిని వారు తప్పకుండా కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉరదని ఈ సందర్భంలో సుఖశ్రీకి

గట్టిగా తట్టింది. ఇట్లాంటి గోడలు ఉండకూడదనే భావం, అత్యంత శోచనీయమైనదిగా అతనికి వెనువెంటనే తోచింది. తను నిజంగా ఒక ఉచ్చస్థితిని అందుకున్నవాడు. ఆస్థితికి తగ్గగౌరవాన్ని, తను సంపాదించగలుగుతూన్నప్పుడు, ఆ గౌరవాల పొలిమేరలచుట్టూ కంచెకట్టకపోతే, ఆ గౌరవముతోబాటు ఆస్థితికూడ అధోగతికి దిగజారిపోక ఏమౌతుంది? తప్పకుండా ఈ విషయంలో తను జాగ్రత్తపడవలసిన అవసరం ఎంతైనా ఉంది. రేపే ఎంతజీతానికైనా ఒక కుర్రవాణ్ణి ఇంటిపనుల నిమిత్తం నియమించాలి. ఇందులో ఇహ ఆలస్యం ఏమాత్రం చెయ్యకూడదు అని ఓ నిర్ణయానికొచ్చాడు సుఖశ్రీ.

'అసలు తన స్థితికి తాను ఒక చక్కని కారును పోషించగల తాహతు ఉన్నవాడే. కాని, కారు కొనడానికి మనసెందుకనో జంకుతూంది. ఏమైనా రోజా కుమారికి పనిమనిషినే కాకుండా వంటమనిషిని కూడా వెంటనే సహాయంగా ఇవ్వకపోతే ఆమెకు తాను చాల ఇక్కట్లు కలిగించినవాడౌతాడు. ఆమె కీయవలసిన స్థానాన్ని ఆమెకీయకుండా, ఆమెను పనిమనిషిగా ఉంచడం చాల నీచంగా లేదూ? ఎంత తప్పుపని జరిగింది! ఇన్నాళ్లవరకూ ఇట్లాంటి ఆలోచనే తట్టలేదెందుచేతనో! ఆరామారావూ కుటుంబం తనను చూసి నవ్వుతున్నారంటే... నవ్వరూమరి! ... ఇలాంటివిషయాలలో తను పిసినిగొట్టుగా వ్యవహరిస్తున్నట్లు ఇతరులుభావిస్తే అది వారి తప్పెట్లౌతుంది? ఇహ ఏవిధంగా చూసినా చిల్లరి చిల్లరి స్నేహాల్నొకటి కట్టిపెట్టడమే మంచిది. ఒకవిధంగా తను ఇకముందునుంచి రిజర్వ్‌డ్‌గా ఉండడం ఎంతైనా అవసరం. మాటలో నడకలో, క్రియలో — ఒక హుందాతనం ఉట్టిపడేట్టు సంచరిస్తూ ఉంటేగాని ఇహఏమీ లాభంలేదు. ఈ లోకానికి లోకువై పోవడానికి కారణం నిజంగా ఇట్లాంటి బహు చిన్నవిషయాలను ఖాతరు చెయ్యకపోవడం వల్లనే అని చెప్పాలి.'

సుఖశ్రీ ఈ ఆలోచనలతో సాగిస్తూన్న నడక, అకస్మాత్తుగా ఎందుకనో మందగించిపోయినట్లయి అందుకు కారణం ఏమిటా అన్నట్లు పరిశీలనగా అతను అటూ ఇటూ చూశాడు. కాని దానికి తగిన కారణమేమీ అతనికి కనిపించలేదు. కాని అతని ముందు ఒక స్త్రీ ఒకగంప నెత్తుకొని ముందుకు సాగిపోతూంది. అయితే అతని నడక మందగించి పోవడానికి మాత్రం ఆమె కారణంకాదు. కాని ఒకసారి ఆమెను చూసినతరువాత, ఆమెను మరొకసారి చూడాలని అతని మనసు ఉవ్విళ్ళూరింది. అతని దృష్టి మరొకసారి అటు ప్రసరించింది.

ఆమె ఎంతో బరువును మోస్తూంది. ఆ పెద్ద గంపనిండా నాలుగయిదు మణుగుల వంకాయలుంటాయి. గంప పూర్తిగా నిండిపోగా, గంపచుట్టూ పొడుగుపాటి వంకాయలు గుచ్చి, ఆ కలసివచ్చిన ఎత్తు మేరకు ఆ కాయలను పూర్తిగానింపి, ఆమె భారముగా అడుగులు వేస్తూ నడుస్తూంది.

ఆమె ఏమాత్రం అజాగ్రత్తగా గంపను కదపినా, ఆ కాయలు భూమిని చేరుకుంటాయి. ఆమె ఎంతదూరంనుంచి అంత బరువు గంపను నెత్తిమీదఉంచి, మెడను కాస్తకూడ కదలనివ్వకుండా, ప్రాణాలు బిగపెట్టి, మొగాన జారే నీటి బొట్టులను వ్రేళ్లతో చిందుకుంటూ, ఎల్లా నడచి ఇంత దూరం రాగలిగిందో సుఖశ్రీకి అంతుపట్టలేదు. కాని ఆమెపై అతని కేదో అభిమానం కలిగింది. ఆమెను పదేపదే చూడాలని అతని గుండె తహతహలాడిపోయింది.

పాప మామె నల్లగాఉంది. ఆమె మెడదాని స్థానములో పొంకముగా అమరిఉంది. ఆమెకు సొమ్ములులేవు. ఆమె సింగారించిన చీరలో సొగసులులేవు. ఆమె సిగ ముడిలో అద్భుత శిల్ప రచనా నైపుణ్యములేదు. అయినా సుఖశ్రీకి ఆమెవైపు చూడాలనే కాంక్ష హెచ్చయింది. ఆమె వెనుకనే నడవాలనే కోరిక అధికమైంది.

ఆమె సుకుమారికాదు. ఇంటివద్ద కూర్చున్నచో ఆమెకు గడచేస్థితిలేదు. వీధి వెంబడి ఈ గంపను నెత్తిపై ఉంచుకొని నడవటాని కామె కెట్టి ప్రతిబంధకమూ లేదు. ఆమె కచ్చాపోసి నడుస్తూంది. ఆమె పిక్కలూ, తొడలూ యౌవ్వన ప్రాదుర్భావముతో మిసమిసలాడి పోతున్నాయి. ఆ కఠిన స్తనోన్నత రేఖాస్ఫూర్తి పెల్లుబికి, జాలిగా స్వేదజలాన తడిసిన రవికను కౌగిలించుకుంటూంది.

ఆమె కొక ప్రక్కగా నడుస్తూన్న సుఖశ్రీ ఆమె యీ కష్టమునకు మనసులో చాల కష్టపడి, వివిధ విధాలైన ఆలోచనలలో మునిగిపోయాడు. ఆమె అంత బరువుతో కూడ నడకలో ఎంతో వేగమును సాధిస్తూంది. సుఖశ్రీ కొంచెము వెనుకపడిపోయాడు. కాని ఆమెనుండి అతని ఊహాలు కదలిరాలేదు. సుఖశ్రీ మనసులో జాలి నిండింది. అది మానవునిగా తలఎత్తి ఆమె పడుతూన్న కష్టమును పూర్తిగా ఆకళింపు చేసుకుంది.

అదే సమయాన ఎట్లా జారిపడ్డదో నిలువుగా గుచ్చిన ఒక వంకాయ క్రిందపడింది. దానితో మరి నాలుగయిదు కాయలు క్రింద పూడిపడ్డాయి. అవి పడిన ధ్వనికి ఆమె నిలచిపోయి, మెల్లగా వెనక్కి తిరిగి, అక్కడే ఎదురుగా కనిపించిన సుఖశ్రీని ఉద్దేశించి,


'బాబ్బాబు. కూతంత ఆటినిటివ్వండి' అంది. ఆమె మొగంలో క్లేశము ముడివడి ఉంది. బాధాసూచిత సజల నేత్రాలలో దైన్యము తడబడింది. 'అయ్యో... ఈరికా పనిచెప్పావు ... ఎంత తప్పు చేశావే ... అయ్యో...' అని ఆమెగుండెల్లో ఏదో పశ్చాత్తాపపు గుండము సుడివడింది. ఆమె పూర్తిగా భయముతో వణకిపోయింది.

సుఖశ్రీ ఒక్కసారిగా నిశ్చేష్టుడైపోయాడు. వెనువెంటనే అతని ఎదలో ఎందరో క్రూరరాక్షసు లుద్భవించారు. వారు, 'ఓయి సుఖశ్రీ! నీకీనాడు సైకిలు లేకపోవడంవల్ల ఎన్ని ఇక్కట్లు సంభవించాయి! నీ పరువు మంట గలపటానికే అది అట్లా మూలను పడింది. పోనీ నీవు సైకిలు రిక్షామీదైన బజారుకు బయలుదేరిఉంటే ఎంత బాగుండి ఉండేది. ఇంతటితోనైన ఒక కుర్రవాణ్ణి వెంటనే ఇంటిపనులనిమిత్తం నియమించవయ్యా. అబ్బ! ఇది ఇతరుల కంటబడితే ఎంత నగుబాటుగా ఉంటుంది! ఇక్కడ ఒక్కక్షణముకూడ ఉండక తక్షణమే పయనము సాగించవయ్యా! అసలిది నిన్నిట్లా తెగించి అడిగినందుకు చెప్పాలి... అబ్బ! రోజులెట్లా మందుక పోతున్నాయి' అన్నారు. పాపం సుఖశ్రీకి ఎటూ తోచలేదు. కాని అతనిపాదములుమాత్రం అతనికి తెలియకుండానే బరువుగా ప్రక్కకు తిరిగిపోయాయి.


అట్లా అవి ప్రక్కకు తిరిగినవెంటనే అతనిలో ఎందరో దేవతలు తలఎత్తారు. వారు అతనికి ఆమె అతికష్టంమీద, ఒంటికాలిమీద నిలచి, రెండవకాలి వ్రేళ్ళతో వాటిని ఒక్కటొక్కటిగా అందుకుంటూ, ఆ కాలు చేతి కందేవరకు వెనుకగా మడచి, ప్రేగులు తెగిపోయే పర్యంతమూ అయి, ఎలాగో వాటిని ఆ గంపలోనికి చేరవేస్తూండటము చూపారు. సుఖశ్రీ ఆ దృశ్యాన్ని చూడలేకపోయాడు. అతని గుండె వెక్కి వెక్కి ఏడ్చింది. 'అయ్యో! సుఖశ్రీ......నీ కిట్టి దుష్టభావము లెట్లా కలిగినవయ్యా! కలిగినా నీవు వాటికి బానిసవెట్లా అయిపోయావయ్యా!' అని ఆ ఎద ఎంతగానో కుమిలి కుమిలి ఏడ్చింది.

పాపం సుఖశ్రీ 'నేను బానిసను... నేను బానిసను' అని గట్టిగా విలపించబోయాడు కాని అందుకుకూడ అతడస్వతంత్రుడై అయి, రెండు కన్నీటి చుక్కలు మాత్రం తన బానిసత్వానికి చిహ్నంగా మెల్లగ రాల్చాడు.

[ఆలిండియా రేడియో ప్రసారితం



పాపనాశనం



ఫోటో : వి. రామకోటేశ్వరరావు, జాండ్రపేట.

పిల్లల పిచ్చి

లోకంలో ఒక్కొక్కళ్లకి ఒక్కొక నైజగుణం వుంటుంది. ఒకళ్ల నైజం ఇంకొకళ్లకి తప్పుగా కనిపిస్తుంది. క్రొత్తగా తలితండ్రులయన ప్రతివారికీ కూడా ఒకే నైజగుణం వున్నట్టుంది. ఈ విషయంలో మాత్రం ఒక జంటకొక జంట ఏమాత్రం తీసిపోరు, ఇంకా ఒకరినిమించి ఒకరు రెండాకులు ఎక్కువ చదివినవాళ్లేగాని.

"విశ్వం, విశ్వం"

పిలుపు ముందు వినిపించుకోకూడదనుకున్నాడు, కాని విధిలేక వెనక్కి తిరిగాడు శ్వనాథం. రంగారావు జోరుగా వస్తున్నాడు. తనకా రోజు స్నేహితుల బారి నుండి తప్పించుకునే అవకాశం దొరకనందుకు మనస్సులోనే అందరినీ తృణ్ణంగా తిటుకుంటూ, ముఖం అదోలా పెట్టుకుని నుంచున్నాడు.

"ఎక్కడికిరా పోతున్నావు?" అని భుజంమీద ఆప్యాయంగా చెయ్యివేస్తూ అడిగాడు.

"పార్కులోకి. ఏం వస్తావా? ఇంకెక్కడికయినా పోవాలా?" ఇంకెక్కడికయినా వెడితే బాగుండునని దేవుడికి మొక్కుకుంటూ అడిగాడు విశ్వం.

"ఎక్కడకీలేదు పద నేనూ వస్తాను."

ఇద్దరూ మౌనంగానే నడక సాగించారు. కాస్సేపు ఊరుకున్నాక రంగారావు ప్రశ్నించాడు.

"ఏరా అలా వున్నావు ?"

"బాగానే వున్నాను" విసుగ్గా జవాబిచ్చాడు విశ్వం.

రంగారావు పరీక్షగా చూశాడు విశ్వంకేసి. అసలువిషయ మేమిటో కనుక్కోలేక మౌనమే ప్రస్తుత కర్తవ్యమని ఊహించి ఊరుకున్నాడు. ఇద్దరూ పార్కులో ప్రవేశించి ఒకమూల బెంచీమీద ఆసీనులయ్యారు. సిగరెట్లు ముట్టించి, వలయాకారంగా వెడుతున్న పొగనుచూస్తూ ఎవరి ఆలోచనలలో వాళ్ళు మునిగిపోయారు. కొంత సేపయాక రంగారావే విశ్శబ్దం భేదిస్తూ అడిగాడు.

"ఇంట్లో బాగానేనా!"

"బాగానే వుంది." ఈ సమాధానం వినేసరికి రంగారావుకి వళ్ళుమండుకొచ్చింది.

"అసలు విషయ మేమిటో చెప్పకూడదూ? నీలో నువ్వు కుళ్ళి ఏడవకపోతే?" విశ్వం మాట్లాడకుండా నేలకేసి చూస్తూ వూరుకున్నాడు. పది నిమిషాలు గడిచాక నెమ్మదిగా అన్నాడు "ఈ వేళంతా నాకు విశ్రాంతి లేదంటే నమ్మ"

"ఏం? ఆఫీసువర్కా?"

"సంగతి పూర్తిగా వినరా బాబూ! వివాహం చేసుకోడమనేది మహాతప్పు. ఎటువంటి పరిస్థితులలోనైనా చేసుకోక తప్పక

ఎం. బాల

విధిలేక చేసుకున్నా, బిడ్డల్ని కనడం అనే దానికన్నా మించిన మహాపాపం ఇంకొటి లేదు..........."

"ఈ విషయమై నీ అభిప్రాయాలు తరువాత వింటాను. ముందు అసలు విషయంలోకి దిగు." అన్నాడు రంగారావు తనూ, విశ్వంకూడా బ్రహ్మచారులే అవటంవల్ల ప్రస్తుతం బెంగలేదన్నట్టు.

నాకు చంటిపిల్లలంటే మహా రోత, అసహ్యం. మూడేళ్లు దాటితేగాని వాళ్ళని దరికిజేరనీయను. వాళ్లు చేసే చేష్టలుచూస్తూ కూర్చుందుకు ఓపికకూడా నాకులేదు. మా ఆఫీసులోనే రెండవశెక్షనులో పనిచేస్తున్న సూర్యనారాయణకి, గురుమూర్తికి, జనార్ధనాచారికీ ఒకటి రెండు సంవత్సరాల మధ్య పెళ్ళయిందని నీకు తెలుసుగా. వీళ్ళ భార్యలు ముగ్గురూకూడ ఈ ఒకటి రెండు నెలలమధ్య పిల్లల్ని కన్నారు. ప్రథమ సంతానం అందరికీకూడాను. నే నుంటున్న ఇంటాయన వీరాస్వామిగారికి లేక లేక పదేళ్ళకి నిరుడే ఒక మగపిల్లాడు పుట్టాడు. ఇంక నాపాట్లుచూడు, ఆ ఇంటి కెడదామంటేనే భయంగా వుందిప్పుడు. ఆవిడ ఆస్పత్రిలో వుండగానే నన్ను తీసుకెళ్ళి చూపించాడు. రెండో అంజనేయ

డంటే నమ్మ. సరే అప్పటితో ఊరుకోవచ్చా! అక్కే ఇంటికి వచ్చాక ఆ పిల్లాడు "కేర్" మంటే నన్ను పిలిచి దాని కర్థం చెప్పేవాడు. పిల్లాడు చెయ్యి పైకెత్తితే తనని పిలుస్తున్నట్లు అర్థం చెప్పేదావిడ. పిల్లాడు నవ్వాడని ఒక మాటు, ఒత్తిగిల్లాడని ఒకమాటు, తనని గుర్తించాడని ఒకమాటు నన్ను గదిలో కూర్చోనివ్వకుండా ఈడ్చుకుపోయేవాడు. ఇంక ఆవిడ తన కొడుకుని గురించి తను తీసుకుంటున్న జాగర్త మొదలైనవన్నీ ఏకరువు పెట్టేది. అన్నింటికీ గంగిరెద్దులా తలూపేవాడిని చేసేది లేక. నేను వీధిలోకి వెడదామని ఇస్త్రీ మడతలుతీసి కట్టుకుంటే, ఆ కుఱ్ఱాణ్ని నానెత్తి నెత్తేశేవాడు. మర్యాదకి భంగమని ఏం చెయ్యాలేక ఊరుకునే వాడిని. ఆ శిశువు నా బట్టలు పాడుచేస్తే వాడేదో ఘనకార్యం చేసినట్టు పకపక నవ్వుతూ, నా అవస్థ ఏమాత్రం చూడకుండానే వాడిని తీసుకుని లోపలికి ఉడాయించేవారు ఆ తల్లిదండ్రులు. నేను లోపలికిపోయి చచ్చినట్టు ఆ జతమార్చి కొత్తది వేసుకుని బయలుదేరేవాడిని. వాడికి పాకడం, నడకా వచ్చినప్పటినుండీ నా అవస్థ మరీ అధ్వాన్నంగావుంది. గదిలో నీళ్లు, సిరా, పాలు పారబోయటం, కాగితాలు చింపటం, పుస్తకాలు చింపటం; గది మారుద్దామంటే, అన్ని సౌకర్యాలు వుండీ, తక్కువ అద్దెలో ఆఫీసుకు, బజారుకు, దగ్గరగా ఇంకోగది దొరకదు.

సంవత్సరమైనా అవస్థ ఇలా వుంది. ఇంకనూ మిత్రత్రయం, వారం రోజులయి తమ పిల్లలని చూడటానికి రమ్మని ఆహ్వానిస్తూ వచ్చారు. తాము తండ్రులైనందువల్ల ఏదో ఘనకార్యం నెరవేర్చినట్టు, బ్రహ్మచారినైన నాకు అందులోని ఆనందం ఏమీ తెలియదన్నట్టు, మాట్లాడుతూ వచ్చారు. నే నూరుకున్నాను. కాని వాళ్ళూరుకుంటేనా? ఈవేళ ఆదివారం. శెలవు. ప్రొద్దున్న 7 గం॥ మొదలు ఒక్కొక్కడే వచ్చి నన్ను వాళ్ళింటికి లాక్కుపోయి ఆ పసికందుని చూపించి ఆ పిల్లచేసే ప్రతీ చేష్టకీ అర్థం చెబుతూ వచ్చారు. ఆ పిల్ల ముఖంలో ఎంత తేజస్సువుందో గమనించమనేవారు. ప్రతీ పిల్లా పుట్టేసరికి రెండు మూడు పౌన్లుంటే ఆపిల్ల బరువు తొమ్మిది పౌన్లుట - ఇంతలోనే ఆయన గృహిణి వచ్చి పదమూడు పౌన్లంది. కాదు తొమ్మిది అనే నాకు జ్ఞాపకమని ఆయనన్నాడు. కాదు తను స్వయంగా తూనిక వేస్తూంటే చూశాననీ 13 పౌన్లనీ ఆ[illegible]ంది. చివరకు తగవులాడుకుని దామాషాకట్టి పదకొండు పౌన్లని రాజీకివచ్చారు. గురుమూర్తి దంపతుల ఈ వాదనంతా నా ఎదురుగానే. ఆ శిశువు 9 అయితేనాకేం, లేక 90 అయితే నాకెందుకుచెప్పు? ఆ పిల్ల తెలివితేటలు ఎంత గొప్పవో జాగర్తగా వర్ణించారు. సరిగ్గా ఆకలయే టయిముకి ఎలా ఏడుస్తుందో, దాని ప్రత్యేకతా, మిగతా సమయాల్లో ఏడుపు, తండ్రిని చూసేసరికి ఎలా నవ్వుతుందో, ఎలా చేతులందిస్తుందో, తల్లి ఆ పసికందుగూర్చి ఎంత అసమానమైన జాగర్త తీసుకుంటుందో చెప్పారు. మొత్తం మీద నా చెవులు వర్ణనలతో గింగుర్లెత్తి, పూర్తిగా ఇంకోశబ్దానికి అతీతాలయిపోయాయి. ఇంతటితో ఆగిపోతే బాగుండును. రోజూ సాయంకాలం ఒకసాటు వచ్చి నేనాపిల్లదర్శనం చేసుకుని, ఆ పిల్ల ఆరోజు క్రొత్తగా నేర్చుకున్న విద్యకనులపండువగా వీక్షించిపోవాలట. లేకపోతే ఊరుకోరట. ఈ విషయంలో నా స్నేహధర్మం చూపమంటారు వీళ్లు.

"ఇంక జనార్దనాచారి అంటాడు. 'ఒరేయి, ఒకపిల్లాడు లేకపోతే ఏదో వెల్తిగా కనిపిస్తుందిరా జీవితం.' నే నుండబటలేక 'ఏడిశావు. ఇప్పటికే 360 మిలియన్ల జనాభాతో చస్తూవుంటే ఇంకా పిల్లలొకటి' అన్నాను. 'బ్రహ్మచారిగాడివి నీకేం తెలుస్తుంది? నువ్వేం సజెషన్స్ ఇవ్వకు. చెప్పింది జాగర్తగా విని వంటబట్టించుకో. మేము అనుభవజ్ఞులం' అని సంస్కృతం ప్రారంభించాడు నా దగ్గర. దాంతో నేనో సలాముకొట్టి ఊరుకున్నాను.

"ఇంకా సూర్యనారాయణ పిల్లలపోషణ మీద మూడు డజన్ల పుస్తకాలు చదివి వినిపించాడు. ఈవేళ ఇంకా ఏవో కొన్నాడు. అవి రేపు చదివి వినిపిస్తాడట. ఆఫీసునుండి తనతో నే వాళ్లింటికి తీసుకెడతాడట. ఇదంతా ముందు, ముందు నాకుపయోగిస్తుందిట. అంతా నా బాగుకోసమేట, వాడుపడే తంటాలన్నీ. నాకు లేనిబాధ వీళ్ళకెందుకో నా కర్థంకాలేదు. ఆ కొడుక్కి ఇంకా నెలనిండలేదు, వాడు పట్టి రౌడీ అయిపోతున్నాడురా అంటాడు. 'నీ ముచ్చట బాగుంది లేరా బాబు' అనుకున్నాను మనస్సులోనే.

"ఇలాగ నాఅవస్థ నాకే అర్థంకాకుండా తయారయింది. ఒకళ్ళుకాదు, ఇద్దరుకాదు రోజుకి నలుగురు పిల్లల్ని ఎలాగ భరించడమా అని బెంగపట్టుకుందిరా మహాప్రభూ! నాకు ఇదొక దినదినగండంగా పరిణమించింది. ప్రతి ఇంట్లోనూ ఇదెక్కడి పిచ్చి దాపరించింది? తమకి ముద్దైతే ముద్దెట్టుకోవాలి కాని ఇతర్లమీదకూడా రుద్దడం ఏం బాగుంది? నీపేరు ఎప్పుడూ చెప్పుకుంటానుగాని నాకీ అవస్థ తప్పేమార్గం చూపిద్దూ."

అంతా విని రంగారావు పకపక నవ్వాడు. విశ్వం మహాకోపంతో ఉరిమిచూశాడు. "నాస్థితి నీకు నవ్వులాటలాగకనిపిస్తోందా?"

"అబ్బే కాదురా! శాంతించు. మొన్నటిదాకా నేనూ నీలాగే బాధపడ్డాను. ఆఫీసులో క్రొత్తగా ఎవడికి పిల్లపుట్టినా నన్ను తీసుకెళ్ళి చంపేవాడు. వాళ్ళకి బహుమానాలు తీసుకెళ్ళడమే కాక, వాళ్ల వర్ణనలు వినడం, ఒకరోజు రెండురోజులు కాదు రోజూ బలవంతపు బ్రాహ్మణార్థం అవడంతో నాకూ నీలాగే మతిపోయింది. అప్పుడు బుఱ్ఱకి కొంచెం పనిచెప్పాను. ఏం చేశానో తెలుసా?"

"చెప్పరా! చంపక నేనూ బ్రతికి బయటపడతాను."

"ఏంలేదురా! వెళ్ళినప్పుడల్లా ఆ తల్లిదండ్రులు చూడకుండా వాడి పిర్రగిల్లేవాడిని. దాంతో ఆ శిశువు నన్ను చూసినవెంటనే 'కేర్' మని ఏడ్చేసేది. బస్! ఇక చూసుకో మరి నన్నెవరూ పిలవడమే మానేశారు.

"బలే! క్షేమయిన ఉపాయంరా! బ్రతికాను. ముందు మా యింటాయనకొడుకుని వదుల్చుకోవాలి. ఆతరువాత మిగతావాళ్ళు ఒక్కొక్కరే. చాల కృతజ్ఞుడనురా భాయి. పద. పద. ఈవేళ నీకు ష్రడసోపేతంగా భోజనంపెటిస్తాపద. ఆతరువాత సినిమా." అని విశ్వం ఆనందం పట్టలేక గంతులేస్తూ రంగారావుని చెయ్యిపుచ్చుకుని ఈడ్చుకుపోయాడు మోడరన్ కేఫ్ కేసి. ★

వర్తమాన శకలం

1

"అమ్మేది, విశాలా?"

"అత్తయ్యింటికి వెళ్లిందక్కా!"

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? నిన్నీ నెలలో మంచి రోజు చూచి మన ఇంటికి తీసుకువచ్చి—"

"ఊఁ! తీసుకొచ్చి—"

"నీ పురుడయ్యేవరకూ వుంచుకొని పంపుతానని అడగడానికని వెళ్లిందే."

"అదేమిటే, విశాలా! నిండా ఆర్నెల్లు కాలేదు; అప్పుడే నన్ను తెచ్చి ఇంటిలో పెట్టుకొంటానని అడగడమేం బాగుంటుందే? నీవైనా అడ్డు పెట్టలేకపోయావే?"

"అడ్డుపెట్టలేక కాదక్కా! అమ్మతో తిరిగి అనసంటే నీకో చిన్న రహస్యం చెప్తా."

"చెప్పు, ఫర్వాలేదు, చెప్పవే"

"మరేం లేదక్కా. నీ పెళ్ళిచేసి సంవత్సరం దాటుతున్నా అల్లుడిగారికి మొదటి దీపావళీ, మొదటి సంక్రాంతి పండుగ సర్దాలన్నా తీర్చలేకపోతున్నామే అని అమ్మకెంతో బెంగ!"

"అమ్మ సంగతి ఎవరికి తెలియదూ? ఆ కాలంలా, ఈకాలంలోకూడా ఆహంగులూ ఆర్భాటాలూ ప్రదర్శించుకోవాలనే పిచ్చి కదా! అయితే -"

"అయితే - ఏముందీ? రేపు దీపావళీ, ఆపైన సంక్రాంతీ దగ్గరకొచ్చాయిగదా! ఈ పండుగలకైనా అల్లుడిగారికి ఖుషీ చేయాలనీ, నీ పురుడూ బారసాల వైభవంగా జరిపించాలని రాత్రింబవళ్లూ ఒకటే ఆలోచిస్తున్నది!"

"ఆలోచనెందుకింక?"

"అదేమిటే అక్కా? చేతిలో డబ్బేదీ? అది లేనప్పుడింక వినోదాలేమిటీ, విలాసాలేమిటీ, నా బొంద!"

"అయితే, ఇదేం పనమ్మా?"

కె. పి. బాబు

"ఏముందీ - నన్నిప్పుడు తెచ్చి ఇంట్లో పెట్టుకొంటే, నీవు వున్నంతకాలం నెలనెలా నీకొచ్చే జీతంతో ఈ ఖర్చులన్నీ సరిపుచ్చుకోవచ్చుగదా అని అమ్మ ఆలోచన!"

"అ...మ్మ!"

"ఈ సంగతి ఎంతో గుట్టుగా ఉంచింది సుమా! నీవుగాని ఏమాత్రం తేలిపోయినా, నా పీక పట్టుకొంటుందే! జాగ్రత్త!"

"హుఁ! అమ్మ చివరికి ఎంత దిగజారిపోతూంది?"

"ఏంచేస్తుందే మరింక? తన పెద్ద అల్లుళ్ళందరకూ చాల కాలంవరకూ ప్రతి పండుగ పబ్బానికీ ఎంతో ఘనంగా సత్కారాలు చేసేదట! పెద్దమ్మాయిలందరి పురుళ్ళూ ప్రజలంతా కలకాలం గుర్తుంచుకొనేటంత దివ్యంగా నెరవేర్చిందట! ఆనాటి ఆ వైభోగాలన్నీ అమ్మ వర్ణించి చెప్తుంటే, - ఆమెకు కన్నీరొస్తుంది కాని; నాకేమో భలే ఆశ్చర్యం కలుగుతుందిసుమా!"

"ఆనాడలాగని నేడిలా చెయ్యటం బాగుంటుందా? సర్లే - నేనింటికి వెళ్తున్నాను. అమ్మ కలిస్తే సరేసరి - లేకపోతే మాత్రం నేనిలా వచ్చివెళ్లానని చెప్పడం మరిచిపోకుసుమా! ఊర్లో ఉంటూకూడా కని పెంచినదాన్ని పరామర్శించనైనా లేదని - ఓ. బాధ పడ్తుంది, పిచ్చిది!"

"అది సర్లేగాని - ఈ సంగతి మాత్రం నీవు చాల భద్రంగా ఉంచాలిసుమా!"

"అలాగే లేవే - నీవో పిచ్చిపిల్లవే!"

2

—అలా పుట్టింటినుండి అత్తింటికి బయల్దేరిన కామాక్షీ పైకి మామూలుగానే కన్పిస్తున్నా, లోలోన మాత్రం పరిపరివిధాల చింతిస్తూ నడువసాగింది......

ఆ ఊళ్లో ఒకప్పుడు సూరయ్యంటే - గొప్ప భూస్వామీ, దానకర్ణుడూ, గుణశీలి! అందమైన భవనంలో, గొడ్డూ గోదాతో తోటలూ దొడ్లూ; పొలం పుట్రా సరిచూచుకొంటూ అందరకూ తలలో నాల్కగా కాలంగడిపేవాడాయన! సూరయ్యకి వరుసగా ఆరుగురూ ఆడపిల్లలే పుట్టారు. అయిదేళ్లు ఎదిగి ఒకతె చనిపోగా అయిదుగు రమ్మాయిలు మిగిలారు. వారినే తమ పంచప్రాణాలుగా సూరయ్యా పేరమ్మా ఎంతో గారాబంగా పెంచుకొచ్చారు.

మొదటి ముగ్గురికీ సూరయ్య గొప్పింటి సంబంధాలు స్వయంగా వెతికి వెతికి మరీ తెచ్చి పెళ్లిళ్లు చేశాడు! ఒక్కొక్క పిల్లకీ వేలకు వేలు కట్నాలు గుమ్మరించాడు. అయిదేసి రోజులు, వేలాది సొమ్ము వెచ్చించి మరీ అట్టహాసంగా వివాహాలు జరిపించాడు. బ్రాహ్మణులకు సంభావనలేమిటి - బీదలకు అన్నవస్త్రదానాలేమిటి - బంధుమిత్రులకు పంచభక్ష్య పరమాన్నాదులతో సత్కారాలేమిటి - ఓ....పిల్ల జమీందారనిపించాడు సూరయ్య!

ఆనాటి ఊరేగింపులు - ఈనాటికీ ప్రజల కళ్ళముం దాడుతున్నాయ్!...బ్యాండ్, సానాయ్, గన్‌సెట్, నౌబత్ ఖానా, రాండోళ్లు - ఊఁ...ఇంకా - భోగం మేళాలు, బొమ్మలాటలూ - గ్యాస్ లైట్లతో పూలఓడలో ఊరేగింపు!........

అంతా చూస్తూ "నా వంశ పరువు ప్రతిష్ఠలు నిలిపానుగదా!" అని గర్వపడ్డాడు సూరయ్య! "నా గౌరవమర్యాదలు పెంచుకొనగల్గానని" తృప్తిచెందాడు. ఆ తృప్తితోనే హాయిగా ఓనాడు కన్నుమూశాడాయన......

.........ఆ వైభవాలూ, ఉత్సాహాలూ, అట్టహాసాలూ, అన్నీ సూరయ్యతోనే సరిపోయాయా అన్పించేది ఊరివారందరకూ. అభిమానవతియైన పేరమ్మకదెంతో ఆవేదన కల్గించేది! మిగతా ఇద్దరు పిల్లలకూ తానైనా పూనుకొని వెనుకటి విధంగానే - హంగూ ఆర్భాటాలతో వైభవోపేతంగా వివాహాలుచేసి, పంపించి మరీ సుఖంగా భర్తను చేరుకోవాలని విపరీతంగా వాంఛించేది! కాని, ఏం చేస్తుంది!...

...సూరయ్య ఊపిరి ఉన్నంతవరకూ ఆ చుట్టుప్రక్కలకే రానట్టివారనేకమంది, ఆయన ఇహలోకయాత్ర చాలించాడని తెలిసీ తెలియగానే వచ్చిపడ్డారు! పిల్లల పెళ్ళిళ్లకనీ, ఇతర అవసరాలకనీ అప్పుడప్పుడూ వారివద్దా, వీరివద్దా సూరయ్య గుట్టుగా చేసినట్టి అప్పులన్నీ ఆయన మరణించగనే - ఒక్కసారిగావచ్చి పేరమ్మ

మీద పడ్డాయ్! "మరి...నోటు గీటు అక్కర్లేదంటూ మాటా, మనిషీ నమ్మక మీద ఎంతెంత రొఖ్ఖం ఎంతమందికి బదు ళ్ళిచ్చాడోగాని - ఒక్కరూ ఇప్పుడైనా పిలచి ఇచ్చిన పాపాన్న పోలేదుగదా, ఖర్మమను"కొంటూ గుట్టుగాచేసిన బాకీలని గుట్టుగా తీర్చుకొంటేనే మానమర్యాదలు నిలుస్తాయని పేరమ్మ తొందర తొందరగా ఆ వ్యవహారాలన్నీ తేల్చేసుకొన్నది!...

...చిట్టచివరికి తణఖా తీర్చవలసిన మేడ, అయిదెకరాల పొలం మాత్రం మిగి లాయి! అంతా - ఆ వెలుగంతా ఆరిపోయి నటయింది! పాపం, చాలకాలం మనో వ్యథతో మంచం ఎక్కింది పేరమ్మ. మెల్ల మెల్లగా కోలుకొంది, చివరికి!

పొలంమీద వచ్చేగింజలు తింటూ, మేడలో చిన్న భాగంలో నివసిస్తూ - మిగతా దంతా అద్దెలకిచ్చి, ఆ వచ్చేడబ్బుతో తణఖా బాకీ తీరుస్తూ - మిగిలిన ఇద్దరు పిల్ల లకు కూడా సలక్షణంగా వివాహాలు చేయడ మెలాగా అని యోచిస్తూ కాలం గడపసా గింది...

వెనకటిలా కట్నాలివ్వలేదు; ఆర్భా టంగా పెళ్ళిళ్ళు చేయలేదు, కాని - సూరయ్యగారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లని విధంగా అమ్మాయిలను మంచిమంచి అయ్యల చేతులలో ఉంచాలి! ఎలా? పేరమ్మకీ ఆలోచనలు మతి పోగొట్టేవి...

అప్పుడు నాలుగోపిల్ల కామాక్షి తరు ఫారం చదువుతూ సమర్తాడింది. ఆడపిల్ల రజస్వలానంతరం స్కూలుకు వెళ్ళడం ఎన్నడూ ఆయింట ఆచారంగా లేదు. కాని, ఈసారిమాత్రం కామాక్షి ఇంకా స్కూలుకుపోయి పెద్ద చదువులు చదువుతా నని పట్టు బట్టింది. మొదట్లో పేరమ్మ కంగారుతిన్నా, దూరదృష్టితో కూతురి వాదానికి తలొగ్గింది, చివరికి!

అవసరాలు ఎంతఅధోగతికి ఈడుస్తాయో, అంత అభ్యుదయానికీ గొనిపోతాయి కాబోలు!...

ఆవిధంగా పేరమ్మ పట్టుదలగా కూతుళ్ళకి వారి కిష్టమైనంతవరకూ ఎలాగో ఒకలాగున కష్టపడి చదువుచెప్పించడానికే నిశ్చయించు కొన్నది ... కాని, కామాక్షి - అభిలాష ఉన్నా ఆలోచనమీద స్కూల్ ఫైనల్‌తో చదువాపి, నర్సు ట్రైనింగ్‌కు వెళ్ళింది! విశాలాక్షి ఫిఫ్తుఫారం చదువుతోంది!...

కామాక్షికి తల్లి ఊహలూ, ఆ వేదనలూ బాగా తెలుసు! అందుకనే కాలేజీ గడప త్రొక్క లేకపోయింది. తాను ఉద్యోగంలో ప్రవేశించి ఆవిధంగా కుటుంబాన్ని - ముఖ్యంగా చెల్లెల్ని ఉన్నతికి తేవాలనీ, [illegible] ఎన్నుకొని వివాహమాడి తల్లిమనస్సుకు శాంతి కల్గించి - ఆవిధంగా తన జీవితాన్ని ధన్యమందించు కోవాలని కామాక్షి ఆశించింది! ఆ ఆశయాల తోనే ట్రైనింగ్ పూర్తిచేసుకొని కామాక్షి ఇంటికి తిరిగి వచ్చేవేళకి -

- ప్రకాశరావుకి తననిచ్చి వెంటనే పెళ్ళి చేయడానికి ప్రయత్నాలు జరుగుతూ వున్నాయ్ "ఇదేమిటే అమ్మా! అప్పుడే నాకు పెళ్ళా?" అని నిర్ఘాంతపోతే "నేనేంచేసేదేతల్లీ" అంటూ పేరమ్మ నీర సంగా మూల్గింది!...

తల్లి మనసు నూహించుకో గల్గింది, కామాక్షి..... పేరమ్మకి కూడా పిల్లకి వెంటనే పెళ్ళిచేయాలనే ఊహేలేదు! కాని, బంధువర్గంలో తమపై సానుభూతి నశిస్తోంది; పెద్దపిల్లల్ని చదువు లకీ, ఉద్యోగాలకీ పంపడమన్నదీ, చితికి పోవడమన్నదీ వారిలో చులకన కల్గిస్తున్నది! ఇప్పుడొచ్చిన సంబంధం అన్ని విధాల సంతృప్తి కల్గించేది! ప్రకాశరావు దూరపు బంధువు లబ్బాయే; కలక్టరేట్‌లో పని చేస్తున్నవాడు; బుద్ధిగల సుందరుడు! సూరయ్యగారి కుటుంబంపై చక్కని గౌరవం, సానుభూతి గలవాళ్ళు! మరొక ముఖ్యాంశం, వాళ్ళూ ఆ ఊరివారే! అదీ గాక, ప్రకాశరావు ఖచ్చితంగా "కట్నం అనేది ఏమాత్రం ముట్టననీ, ఎటువంటి ఆర్భా టాలూ, లాంఛనాలు అనవసరమనీ, మంచి సంప్రదాయం గల కుటుంబంలో నుండి వచ్చిన నాగరికయువతి అయితే చాలుననీ" ఆశించాడు! అతనికి కామాక్షి అన్నివిధాలా నచ్చినది. కామాక్షికీ చిన్నతనంలో సహా ధ్యాయియైన ప్రకాశరావంటే గుర్తే... ప్రకాశరావుకి వెంటనే పెళ్ళిచేసుకోవాలని లేదు. కాని, అతని చెల్లెలుకో మంచి సంబంధంవచ్చింది. వాళ్లు "అన్నకు పెళ్ళి కానిదే, చెల్లెల్ని చేసుకోలేమ"న్నారు. కనుక - చెల్లెలికా మంచి సంబంధం పోకుండా వుండడానికని సాధ్యమైనంత తొందరలో ప్రకాశరావుకూడా పెళ్లిచేసు కోవలసిన అగత్యం పట్టింది!...ఇదంతా చూచిన పేరమ్మ లోతుగా ఆలోచించింది. ప్రకాశరావువంటి కుర్రాడిని ఏదో స్వార్థం కోసమని చేజార్చుకొంటే, తిరిగి అటువంటి సర్వోత్తమమైన సంబంధం తమ వారిలో దొరుకడమన్నది బహుకష్టం! "అంతా మన మేలుకే కానివ్వమ"ని పేరమ్మ కామాక్షికి ప్రకాశరావుతో వివాహం ఖాయపర్చు కొంది! కామాక్షికి స్వల్పప్రయత్నంమీదనే ఉన్న ఊళ్లోనే పనికూడ దొరికింది. కాని, పేరమ్మకుగాని, కామాక్షికిగాని ఆశుభవార్త ఏమాత్రం సంతోషాన్ని కల్గించలేక పోయింది. విధిగా పేరమ్మ ఉన్న అయి దెకరాల్లో రెండెకరాలు తెగనమ్మాల్సి వచ్చింది! ఆ డబ్బు ఖర్చుపెట్టి అంతంత మాత్రంగా కామాక్షికి పెళ్ళిఅయిం దనిపిం చిందా తల్లి!

...జరిగిందొక్కరోజు పెళ్ళి, చాల నిరాడంబరంగా - సాధ్యమైనం నంత స్వల్పంగా జరిగిపోయింది. ఆరోజంతా కూడా పేరమ్మ కేమిటో నలతగా ఉన్న ట్లుంది! జరిగిపోయిన కూతుళ్ళ పెళ్ళిళ్లు పదేపదే స్ఫురణకు తెచ్చుకుంటూ-ఆనాటి విశేషాలూ, వైభవాలూ, ఆనందోత్సా హాలూ; ప్రస్తుతంతో పోల్చుకొని-మరీ మరీ కామాక్షి దురదృష్టానికీ, తన ఖర్మానికీ దుఃఖించింది!!

ప్రకాశరావు నాగరికత, అతని విశాల హృదయం, నిర్మల భావాలూ గుర్తించిన కామాక్షి - కాలానికి కట్టుబడలేని మనుషు లకి మనోవేదనలు తప్పవని తల్లినిచూచి తెల్సుకొన్నది! కాని, అంత తెగింపుతో, ఎంతో కష్టించి చదివించి, ఏదో ఉద్ధరిస్తుం దని ఆశలో ఎదురుచూచే తల్లికెంతో సంతోషంతో, సగర్వంగా అందించా లను కొన్న తన మొదటి జీతాన్ని అత్తగారి చేతుల్లో పెట్టున్నప్పుడు మాత్రం కామాక్షి కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయ్...... చెల్లెలి కాలేజీ చదువుకోసమని అమ్మ మరో ఎకరం పొలం అమ్మిందన్న వార్త తెల్సు కొని, లోలోన కుళ్లిపోయింది! అంతకు మించి ఏంచేస్తుంది తాను?..."అవును - నేనేమి చేయగలనింక?" అనుకొంటూ, చెమ్మగిల్లిన కళ్లతో అత్తిల్లు చేరుకొన్నది, కామాక్షి...

3

"ఏమిచేస్తున్నావ్ కామూ?"

"రండీ! ఏమీ తోచకపోతే పుస్తక మొకటి తిరగేస్తున్నాను. ఆఫీసునుంచి ఇవ్వాళ ఇంత లేటుగా వచ్చారేం?"

★ వర్తమాన శకలం ★

"అవును. ఆఫీసులో కొంచెం ఆలస్యమైందిలే కాని, ఏమిటా పుస్తకం అంత శ్రద్ధగా పఠిస్తున్నావ్? ఓ...ఐ. సీ...అచ్చమాంబగారి 'ప్రసూతి శిశుపోషణా?' అహ్హాహ్హా ... నర్సమ్మలకి కూడా గైడ్స్ కావాల్సివస్తున్నయ్యే - చిత్రం!"

"పండితులకేగా నిఘంటువుల అవసరం!"

"వాహ్వా! బాగా చెప్పావ్!...ఆ! ఏమిటే ఇవ్వాళ మీఅమ్మ వచ్చిందట, ఇక్కడికి?"

"అవునట"

"నిన్ను ఈ నెలలోనే తీసుకెళ్తానన్నదట!"

"అలాగా! అత్తయ్య ఏమందట?"

"ఏమంటుందీ? మీ అమ్మకి చాదస్తం కాకపోతే ఇంకా ఆరో నెలన్నా నిండలేదు, అప్పుడే ఏంతొందర చెప్పు?"

"మీఅమ్మ ఏమన్నదో చెప్పారుకారు!"

"ఇప్పుడేంతొందర అందట! అదీగాక - 'ఏదో భోజనం, నిద్ర మినహాయిస్తే మిగతా వేళంతా అయితే హాస్పటల్లో, లేకుంటే మీయింట్లోనేగా కాలం గడుపుతున్నదీ, మరేంబాధ?' అని సర్ది చెప్పిందట!"

"ఆ...లా...గా! మరి - మరి - మా అమ్మేమన్నదో?"

"మీ అమ్మేనా? ముఖం చిన్నబుచ్చుకొని 'అవున్లే, ఏంతొందర్లే? ఆ రోజుల్లోనైతే మా అమ్మాయిలని మా కిష్టమైనప్పుడు తెచ్చేసుకొని, తిరిగి మా కిష్టమైనప్పుడు పంపుకొనేవాళ్ళం! అయినా ఈ రోజుల్లో ఆతాహతేదీ; ఆ వ్యవహారాలేవీ? ఎలాగో ఒకలాగున కానివ్వండమ్మా, ఏంచేస్తాం?' అంటూ అలిగి లేచిపోయిందట! చూచావూ! మీఅమ్మపైకి ఇలా కన్పించినా, పాపం చాలమంచిదిసుమా! ఆమె అలా బాధపడి వెళ్ళిందంటే, నాకెంతో బాధగా వుంది. ఏమ్మంటావా కామూ?"

"అదేంమాట?"

"అదికాదు కామూ! మీ అమ్మ నిన్నెంత గారాబంగా పెంచుకొచ్చిందీ మాకు తెల్సు! నీకిది మొదటి కాన్పుకూడానయ్యే! నీకూ, మీఅమ్మ చేతిభోజనం తినాలనీ, మీ ఇంట్లో కాలం గడపాలనీ ఆపేక్షగా ఉంటుంది - సహజమే! కాని - "

"నీళ్లు నములుతారేం? చెప్పండీ పూర్తిగాను"

"ఇప్పట్లో నీ విక్కడ లేకుంటే, నేను ఏకంగా నీళ్ళే నమలాల్సి వస్తుంది!"

"చిత్రంగా మాట్లాడాగేనుండీ?"

"నిజం చెప్తున్నాను కామూ! ఈకుటుంబమంతా నా ఒక్కనిమీద ఆధారపడి జీవిస్తున్నది. ఇంతకాలం నేనెలా ఈ సంసారాన్ని ఈదుకొచ్చానో దేవుడి కెరుక! ఇప్పుడు, నీవు మా ఇంట్లోకొచ్చేక నీవు తెచ్చేజీతం నాకెంతో బరువు తగ్గిస్తున్నది తెలుసా?"

"అ...బ్బా! ఆఁ!"

"అవును కామూ! నిజం చెప్పకోవడానికి నేనభిమానపడను!" నా పెళ్ళికీ, చెల్లి పెళ్లికి, చాల అప్పులయ్యాయ్! తమ్ముళ్ల చదువులకెంతో ఖర్చవుతోంది! ఈ ఇంటిపరిస్థితులేమీ నీకు తెలియనివి కావుగదా! నాన్న జబ్బుతో ఉన్నాడు - రోజు కెంత ఖర్చవుతుందో చూస్తున్నావుగా? నీవు మాఇంట్లో ఉన్నంతకాలం నీ జీతం మాకివ్వడంగాని, మేము పుచ్చుకోవడంగాని బాగోదు. అలా జరుగరాదని కూడా నా సిద్ధాంతం! మరి, నీవిప్పట్లో మీఇంటికివెళ్తే - నేనొక్కణ్ణే ఇంతభారం ఎలా భరించేదో నీవే చెప్పు కామూ? నీవు కాలు పెట్టాకనే, మా సంసార మేదో కొంచెం కుదుటపడ్డట్లయింది! తిరిగి ఓ నాల్గయిదునెలలు ఈఇల్లు ఒదిలి పెట్టావూ - మాకెంతో కష్టంగా ఉంటుందని అమ్మా నాన్నా గోల చేస్తున్నారు. అంచేతనే నిన్ను పంపడానికి నేనింత జంకుతున్నాను కామూ!"

"బాగానే ఉంది! ఇంతకీ నన్నేం చేయమంటారూ? అంతా మీఇష్టం!"

"అది కాదు. అంతా నీ ఇష్టంమీదనే ఆధారపడివుందనుకో! ఈ పరిస్థితుల్ని నీవు బాగా ఆలోచించి చూడు. నీవు గట్టిగా మీ అమ్మగారింటికి వెళ్తానంటే - నేనేం బాధపడను! ఈ వారంలోనే నిన్ను పంపే ఏర్పాట్లు చేస్తాను. మరేం ఫర్వాలేదు - ఏంసగతీ నిర్మొగమాటంగా చెప్పెయ్ కామూ!"

"...................."

4

ప్రకాశరావు కల్లాకపటం లేకుండా అంత ఇదిగా పరిస్థితులు వివరించి చెప్పేసరికి, కామాక్షికి ఏమి చెప్పడానికీ పాలుపోలేదు.

అటు అమ్మ - తమ పాతకాలపు హుందా నిల్పుకోవాలనీ, కూతుళ్లకేమేమో సౌఖ్యాలందించాలనీ ఊరికే తాపత్రయపడుతోంది! అందరి కూతుళ్లకు చేసినట్లు తన కట్టహాసంగా పెళ్ళి చేయలేకపోయాననీ, సారెన్నా సరిగ్గా పెట్టలేకపోయాననీ, కట్నమసలే ఇచ్చుకోలేకపోయాననీ, కడకు పండుగసర్దాలన్నా తీర్చలేకపోతున్నాననీ, అదనీ ఇదనీ అమ్మకెన్నో మనోవేదనలు! కాని, ఒక్కటైనా - ఆమె ఆశలొక్కటైనా నెరవేర్చబడే సూచనల్లేవుగదా!...

ఇటేమో తన భర్త - మంచంలో పడి కొట్టుకొంటున్న తండ్రినీ, ఎన్నో ఆశలుంచుకొన్న తల్లినీ, ముగ్గురు తమ్ముళ్లనీ, ఇద్దరు చెల్లెళ్లనీ తనొక్కడి రెక్కల కష్టంమీద సమాధానపర్చుకొంటున్నాడు. కుట్టుగా - దినదినగండం నూరేళ్లాయుష్షుగా వున్న ఆ సంసారంలోకి తాను పాదంపెట్టాక, వారంతా తన్నొక కల్పవృక్షంలా అభిమానిస్తున్నారు. ప్రకాశరావు, అతని చెల్లెలు వివాహాలకని చేసిన అప్పులు తీర్చుకోవాలి; ఒక తమ్ముడికి స్కూల్ ఫైనల్ - మరొకడికి థర్డుఫారం - ఇంకొకడికి ఫస్టుఫారం చదువుల ఖర్చులాదుకోవాలి; మిగిలిన చెల్లి పెళ్లికై ప్రయత్నాలు చేయాలి - ఇంకా, ఇంకా - అనేక అవసరాలున్నాయ్, ఆ కుటుంబంలో!...

ఈ రెంటిమధ్య నిలచిన కామాక్షికి ఏమి చేయాలో ఆలోచించేలోగానే మరో వార్తచేరింది.

విశాలాక్షికి ఏదో సంబంధం వచ్చింది. మంచిది అని లోచగానే పేరమ్మగారు పెళ్లిచెయ్యడానికి ఒప్పేసుకొన్నది. అప్పుడే బి. ఎ. పూర్తిచేసిన విశాలాక్షి తన ఊహలేమిటో ఎవరికీ చెప్పుకోలేదు కాని, తల్లి ఇష్టప్రకారమే నడవడానికి తన సంపూర్ణాంగీకారం తెల్పింది. వరుడు ఎక్కడో ఏదో హైస్కూల్లో టీచరట! కట్నం అక్కర్లేదు—హాంగులూ గిటవ్!.. సామాన్యంగా వివాహంచేసి పంపేస్తే చాలునట! "దివ్యంగా - అలాగే చేసి పంపేస్తాను" అంది పేరమ్మ.

ఉన్న రెండెకరాలు పొలం బేరం పెట్టిందని తెలిసి కామాక్షి తల్లిని కల్సుకొని అడిగింది. "అవునే - విశాల పెళ్లి ఖర్చులున్నాయా? మరికొన్ని చిల్లరబాకీలున్నాయా? రేపు పండుగలొస్తున్నాయా? అన్నింటికి తిరిగి వెతుకులాడకుండా సరిపోవచ్చునని అమ్మేస్తున్నానే!" అంది పేరమ్మ.

గుడ్లనీరు కుక్కుకొంటూ "తర్వాత?-" అంది కామాక్షి. పేరమ్మ "తర్వాతా?— తర్వాత!...ముందిది కానివ్వు...తర్వాత చూచుకోవచ్చునే!" అన్నది, ఏడ్వనారంభిస్తున్న ముఖాన్ని దాచేసుకొంటూ!....

★

ఎవరమ్మా?

చిరంజీవి

పాపాయి కనులలో
పారాడు వెలుగుల్లు
పంపినా రెవరమ్మా?
పంచినా రెవరమ్మా?

మిణుగురుల తోటలో
మేలమాడే పొగడ
విరికన్నె మొగ్గలట!

పాపాయి పెదవిపై
పారాడు చిరునవ్వు
లొలికించి రెవరమ్మ?
తొలికించి రెవరమ్మ?

మంచుజడి వానలో
మబ్బు బుగ్గలు చిదిమి
నెలవంక వొలికించె!

పాపాయి వొంటిపై
పారాడు మెరుగుల్లు .
చిలికించి రెవరమ్మ?
గిలికించి రెవరమ్మ?

పడుచుసిరి పొంగగా
పండించి ప్రేమలను
చిలికించెనట తల్లి!

కందతెచ్చిన కయ్యం

మల్లాప్రగడ నారాయణరావు

సాయంత్రం సుమారు 6-30 గం॥ అవుతుంది. శీతకాలం కాబట్టి బాగా చీకటిపడింది. 'ఏవమ్మా కులాసాగా వున్నారా? తమ్ముడేడీ' అంటూ వచ్చారు మా బావగారు. "ఇప్పుడే ఎటో అలా వెళ్లారు. వచ్చే వేళయింది. లోపలికి రండంటూ" ఆహ్వానించాను. పెళ్ళి అయాక ఆయనతో మాట్లాడడం అదే మొదటిసారి. రాక రాక వచ్చారు మా కొత్తకాపరం చూడడానికి కాబోలు అనుకున్నాను. కూర తెమ్మని వుదయం చెబితేనే జీతాలు అందనదాకా ఏదివుంటే అదే వండాలి, కూరమాట మరిచిపొమ్మని చెప్పేరు మా ఆయన. బావగారికి విస్తట్లో బొత్తిగా చారుఅన్నం ఎలా పెట్టేది. రాగానే చెబితే మాఆయన కేం కోపమువస్తుందో, కోపం రాక పోయినా ఆయనకి మాత్రం ఏం తెల్సు? కలకంటూరా? ఎక్కడనించి తెస్తారు యీ రాత్రప్పుడు అసలు ఆయన ఏదో వచ్చేవేళయిందని చెప్పేను. కాని ఎంత సేపటికి వస్తారో! అనుకుంటూ వంటగదిలోకి వెళ్లాను. మీ బావగార్కి మమ్మల్ని సేవించినంత మాత్రాన తృప్తి వుండదు కాబోలు అన్నట్లు కన్పించాయి సత్తుగిన్నెలో చారు నీళ్లు, వెంటనే వొంపివేద్దామన్నంత కోపం వచ్చింది. ఇదికూడా వొంపేస్తే ఇంకేం పెట్టేది విస్తట్లో— అనిపించిది.

తెలిసి కొన్ని, తెలీక కొన్ని పొరపాట్లు అప్పుడప్పుడు చేస్తూ వుంటాం. తెలియక చేసిన పొరపాట్లకు ఎవరమూ విచారించం. తెలిసి చేసిన పొరపాటుకి విచారించి, దిద్దు కొందుకి ప్రయత్నిస్తాం వీలుంటే. నేను మధ్యాహ్నం చేసిన పొరపాటు జ్ఞాపకమొచ్చింది. నన్ను నేను తిట్టుకొన్నాను. ఎంత తెలివితక్కువ పని చేశానను కున్నాను. ఒక్క అర వీశె తీసుకోమని సావిత్రమ్మ ఎంత బతిమాలింది! నా కిష్టంలేక యీ ఘారు కంద దురదవేస్తుందేమో అన్నాను.

"ఏమిటమ్మా, నీ కిష్టంలేకపోతే అదేపోయింది. నోటి కెలాగొస్తే అలాగంటావు. నాకేమీ సెల్లక పోదు నువ్వు కొనకపోతే అసలీయమ్మకు అక్కరలేని బేరం" అంటూ అన్న కూరల మనిషి మాటలు జ్ఞప్తికొచ్చాయి. అదే అంది. "నేనెలాగా వీశెడు కొన్నాను. కావలిస్తే చెరో అర వీశెడు సర్దుకుందాం. డబ్బుల కేమిటి, మీరు పారిపోతారా, మేం పారిపోతామా, తరువాత చూసుకోవచ్చు" అంది అప్పటికీ యిష్టపడక చక్కా యింటికి వచ్చేశాను.

అయినా ఒక్కమాటు పెరటి తన్న సావిత్రమ్మ యింటికి వెళ్లొస్తే బాగుంటుం దనుకున్నాను. ఇంతకూ యీ రాత్రప్పుడు వెళ్తే ఆవిడ ఏమను కుంటుందో? ఒకవేళ యిప్పుడుగాని ఆవిడ యివ్వనంటే తిరిగి రావడం తప్ప ప్రయోజనమేంటి? ఆవిడ కూడ కొంచెం తిక్కమనిషి, ఇప్పు డున్నబుద్ధి మరోతుణాని కుండదు. ఇంతకూ ఆ భగవంతుడ్ని అనాలి- జీతాలు అందిన తరువాతగాక ముందుగా బావగార్ని తీసుకొచ్చి నందుకు. క్రిందటికి కొత్తపాఠ మెలా వుందన్న ఓ గురువుగారికి - కొత్త పాఠమూ, పాత పాఠమూ ఒక్క లాగే వుందన్నాడట శిష్యుడు - అలాగేవుంది మా కాపరం, జీతం అందేక, అందకముందు.

ఏదైనా ఒకసారి వెళ్లొస్తే మంచి దని పెరటిత్రోవను వెళ్లాను పిలవగానే పల్కడం, తలుపు తియడం ఒక్కసారే జరిగాయి. విషయమంతా చెవిలో మెల్లిగా చెప్తే అంతా విని "ఇప్పుడెలాగే" అంది వచ్చేముందు సావిత్రమ్మకూడ గట్టిగా పైకి "ఇంతాక ఇస్తానన్నా

వని వచ్చాను" అన్నాను. "అయితే ఇప్పుడుమాత్రం యియ్యనన్నానా" అంది. తిరిగి వచ్చేద్దామన్నంత కోపం వచ్చింది. ఇంతట్లో చూడు, వీశెకు ఒక్కటే దుంప తూగింది. మరి మా యింట్లో త్రాసులేదుగా యిప్పు డరవీశె తూచియివ్వడాన్కి పొద్దున్న చూసుకుందాం లెద్దూ" అంది.

"తూకం కొయ్యాలా, ఒక్కపిసరు అటో యిటో అయినా మరేం ఫర్వాలేదు. అజ్జాని రెండుముక్కలు కోసేద్దూ" అన్నాను.

ఆవేళ ఆవిడ గ్రహబలంలో మధ్యాహ్నంనుంచి మార్పు లేకపో బట్టి ఒప్పుకుంది.

ఆ కందకూర పొయ్యిమీంచి దింపడం, మా ఆయన రావడం ఒకేసారి జరిగాయి. అన్నదమ్ముల కుశలప్రశ్నల అనంతరం వడ్డన సాగించాను. కాళ్లు కడుక్కొని పీట మీద కూర్చున్నాక నాకుమాత్రం ఎందుకో కొంచెం భయమేసింది. కొంపదీసి దురద వెయ్యదుగదా, కూర. వేసినా ఏంజేసేది? ఇంతకూ, కూరంటూ విస్తట్లో పెడుతున్నాను. భగవంతుడిదే భారమనుకున్నాను.

బావగారు మాత్రం ఒక్క పిడచ నోట్లో పెట్టగానే కాస్త మంచినీళ్లు త్రాగి "ఒరే బుచ్చిబాబు, సుమారు పదిహేనురోజులైంది. ఈ పన్ను ఒకటే సలుపు, అన్నం సరిగా తినలేకపోతున్నాను, ఓమాటు పెద్దాసుపత్రిలో చూపించుకుందామని వచ్చాను. పొద్దున్నే వెళ్ళాలి" అంటూ నావైపు చూసి "నాకు మరేమీ వద్దు. మజ్జిగ వెయ్యమ్మా" అన్నారు. బ్రతుకు జీవుడా అనుకున్నాను. ఇంక మా వారు కూర రెండుముక్కలు నోట్లో పెట్టుకున్నారో లేదో నావైపు ఒక్కసారి తీక్ష్ణంగా చూశారు. ఎంత తీక్ష్ణంగా అంటే చెప్పలేనుగాని - నెలాఖరు రోజుల్లో ఆయన కచేరీకి వెళ్ళేముందు రాత్రికి బియ్యంమాట మర్చిపోకండి అని చెప్పినపుడు ఎలాగ చూస్తారో అలాగే చూశారు. కాని ఏమయితే అదే అవుతుంది, బావగారి భోజనం మాత్రం అయిపోయిందిగదా! అనుకున్నాను.

భోజనాల తరువాత ఎదురైన సమస్య ప్రక్కల ఏర్పాటు గురించి, బావగారు గదిలోనే కూర్చున్నారు. ఆయనమాత్రం ఎందుకో ఒక్కమాటిలారా - అంటూ పెరట్లోకి పిలిచారు. బాహుశా బావగార్కి ప్రక్క ఎక్కడ ఏర్పాటు చెయ్యడం గురించి అనుకొని దగ్గరగా వెళ్లాను. తలుచుకుంటే ఇప్పటికీ బుగ్గ మండుతున్నట్లే వుంది - ఒక్కటి ఛెళ్లుమనిపించేరు చెంపమీద. నాకు వెంటనే అర్థమయింది, తప్పక కంద మహాత్యమే అయివుంటుందని. ఆయన నోటివెంట ఒక్క మాటగూడ రాలేదు. నాకు ఏడుపు అంతకన్నా రాలేదు. కారణం చెట్టంత పెద్దమనిషి ఎదురుగా గదిలో కూర్చుండడమే! కనబడకపోయినా బహుశా బావగార్కి వినపడేవుంటుంది.



"ఏమిటమ్మా, నీ కిష్టంలేకపోతే అదేపోతుంది. నోటికిలా గొస్తే అలాగంటావ్. నా కేమీ సెల్లకపోదు నువ్వు కొనకపోతే."

★ కంద పెట్టిన కయ్యం ★

అయినా ముభావంగా ఊరుకున్నారు. లేక తగలడం మంచిదే అనుకున్నారేమో! అలా అయితే ఆయనకు చెయ్యలేని మర్యాదకు నేనూ విచారించను.

సావిత్రమ్మ మర్నాడు ఉదయమే ప్రత్యక్షమయింది. డబ్బుల కోసమేమో అనుకున్నాను. కాని మొదట ప్రశ్నే కందగురించి వేసింది. నాకు పట్టరాని కోపంవచ్చి మూకుడుతోనే మూతపెట్టిన కూర చూపి, తరువాత జరిగిన సంగతంతా చెప్పాను.

అంతవరకూ సావిత్రమ్మ ఎలాంటి మనిషో తెల్సుకోలేకపోయినా బొత్తిగా జాలిగుండె మనిషని ఇట్టే తెలుసుకున్నాను. ఒక్కమాటుగా ఆమె రెండుకళ్ళూ చెమ్మగిల్లాయి. "దీని కంతకూ నేనే కారణ"మంది.

"నీ తప్పేముంది, అడగ్గానే ఏదో యిచ్చావు. కూరంటూ ఆ రాత్రప్పుడు పుట్టింది, అదే చాలు." అన్నాను.

"అది కాదమ్మా, అసలు మధ్యాహ్నం నువ్వున్నప్పుడే నాకూ అనుమానం వేసింది - దురద వేస్తుందేమోనని. అందుకే నిన్ను పట్టుకెళ్ళమని బ్రతిమాలేను. నువ్వు వండక చూసి వండొచ్చునని. ఇప్పుడు రావడంగూడ అందుకే వచ్చాను. మీ ఆయన అంతటితో చాలించారుగాని మా వారైతే సాయంత్రం యీపాటికి పుట్టింట్లో దింపి మరీ వస్తారు. వెళ్లొస్తానమ్మా!" అంటూ చక్కాపోయింది.

నాకుమాత్రం ఇన్నేళ్లు వచ్చి, ఇందరు పిల్లలుపుట్టి, ఇంతకాలమైపోయినా "కందమ్మా, కంద" అని వీధిలో కేక వినిపిస్తే చాలు ఎందుకో ఒక్కసారి ఒళ్లు ఝల్లుమనిపిస్తుంది. ★

దారినపోతున్న పెద్దమనిషిని బీటు జవాను లాటీతో వీపుమీద రెండు దెబ్బలు వేశాడు.

"ఎందుకయ్యా! నిష్కారణంగా నన్ను కొడతావ్?" అని ఆ పెద్దమనిషి ప్రశ్నించాడు.

"ఆఁ ఏమీ లేదండి. వెనక కాంగ్రెసువాళ్లు సత్యాగ్రహం చేసేరోజుల్లో నేను ఒకాయనని లాగే లాటీతో నిష్కారణంగా కొట్టాను. ఆయనగారిప్పుడు మినిష్టరైనాడు. మీరుగూడ మినిష్టరు కావాలని నాకోరిక" అన్నాడు.

—"రవి"

"తెలుసుకో త్యాగరాజార్చిత...."

సామవేదం శకుంతల

ఇప్పుడు నాకు తొమ్మిది సంవత్సరములు; మా చెల్లెలికి ఏడు సంవత్సరములు. మా నాన్నగారికి మేమంటే అతి గారాబం. మమ్మల్ని ఎప్పుడూ పల్లెత్తుమాట అనేవారు కారు. ఎవరయినా అన్నా, ఒక దెబ్బ కొట్టినా చూస్తూ వూరుకొనేవారు కాదు. వారిని నాలుగు చివాట్లుపెట్టి గదమాయించేవారు. అసలే పల్లెటూరేమో, గొడ్డూ గోదా జొన్నలు వులవలు ఉడకెయ్యడం, జొన్నపిండి కొట్టడం, గేదెదగ్గర పాలుతియ్యడం, వాటికి పాలేళ్లు సరిగా మేత వేశారో లేదో చూడ్డం ఇటువంటి పనులతో తెమలక సతమతమయి పోయేది మా అమ్మ. అటువంటి పనిసమయంలో ఆమెను ఆ ప్రశ్నలు ఈ ప్రశ్నలు వేస్తూ, చెప్పినమాట వినక విసిగిస్తోంటే పని కాదేమో అన్న తొందరవల్ల మమ్మల్ని కసురుతూ మా నాన్నగారు ఉన్నారో లేదో చూసి రెండు వడ్డిస్తూ కూడా వుండేది.

మా ఇద్దరికీ చిన్నప్పటినుంచీ పాటలు పాడటం అంటే మహా సరదా. ఎవరయినా ఒక కొత్త పాట పాడేరూ అంటే, అది నేర్చుకునేదాకా ఊరుకో బుద్ధయేది కాదు. మా ఇంటిప్రక్క గండికోటవారి కోడలు క్రొత్తగా కాపురానికి వచ్చింది. 'మా కోడలు వచ్చింది చూసిపొండి ఒదినగారూ' అని ఆవిడ మా అమ్మతో చెప్పింది.

"ఏమోనండి వదినగారూ! ఎంత పాలేళ్లు, పాచిమనుష్యులూ వుండి చేసినా, నాకు పనే తెమలదు. సరేలెండి మధ్యాన్నం కాస్త తొందరగా తెముల్చుకొని వస్తాను" అంది మా అమ్మ, మళ్ళీ తన పనిలోకి వెళ్ళిపోతూ.

ఆ మాటలు వినగానే మేము అమ్మ ఎప్పుడు వాళ్ళఇంటికి వెడుతుందా, మేముకూడా వెళ్ళి వారి కోడల్ని ఎప్పుడు చూద్దామా అని తహతహ పడ్డాం. ఆమె ఏమయినా పాట పాడుతుందేమో, నేర్చుకోవాలని కోరిక కలిగింది. అమ్మ పని ఎప్పుడైపోతుందా అని ఆమె వెంట తిరుగుతూనే ఉన్నాం.

మా నాన్న భోంచేసి పొలం వెళ్ళాక అమ్మ "గండికోట అత్తయ్యగారి కోడలు వచ్చిందట రండర్రా చూసివద్దాం" అని మమ్మల్ని పిలిచింది. పిలిచినదే తడవుగా ఒక్కగంతేసి అమ్మకన్న ముందరే వెళ్ళి వీధిలోపడ్డాం. మా అమ్మ తలుపులూ అవీ వేసుకువచ్చాక, మెల్లిగా వారింటికి వెళ్లాం. మమ్మల్ని చూడగానే "ఏమే పార్వతీ! పిన్నిగారు వచ్చారు చాపవెయ్యి" అని ఆమె కోడలికి ఆజ్ఞాపించింది చాపవేశాక అమ్మ, అత్తయ్యగారు, వారికోడలు అందరం కూర్చున్నాం. మా అమ్మ "పుట్టిల్లు ఏవూరు బుల్లెమ్మా, మీ నాన్నగారికి ఏంపని, అన్నదమ్ములు అక్కచెల్లెళ్ళు ఎంతమంది?" అని ఆ కొత్తకోడల్ని ప్రశ్నల వర్షం కురిపించింది. తరవాత "ఒక పాటపాడు బుల్లెమ్మా" అంది. ఆమె కొత్తగా కాపురానికి రావటం అదే మొదటిసారి కనక అత్తగారివంక పాడమంటుందో వద్దంటుందో అన్నట్లు, చూసింది. అప్పుడు మాకు అత్తగారు ఏమంటుందో, పాడమంటుందో వద్దంటుందో, ఒకవేళ పాడమన్నా సిగ్గువల్ల పాడుతుందో లేదో, అని ఆమె నోటివంక చూస్తూ కూర్చున్నాం. అంతలో "పాడవే ఏదన్నా, ఒక కృతి, పిన్నిగారు వింటారు" అంది అత్తగారు. అన్నదే తడవుగా ఆమె 'శ్రీ రఘువర సుగుణాలయా' అన్న కృతి చక్కగా ఆలాపిస్తూ పాడింది. పాడటం అయ్యాక మాకు బొట్టుపెట్టి తాంబూలం ఇప్పించింది కోడలిచేత అత్తగారు.

మేము తిరిగి ఇంటికి రాగానే "ఏమే అక్కా, ఆవిడ పాడిన కృతి బాగుంది కదుటే" అని మా చెల్లెలు నన్ను అడిగింది. అసలు పాటలంటేనే చెవి కోసుకునేదానికి, ఏ పిచ్చిపాటయినా సరే అనుకున్నదానికి కృతిఅంటే నాకు మాత్రం ఇష్టంకాకుండా వుంటుందా? ఏవిధాన్నయితే నేమి, ఇద్దరం కూడబలుక్కుని ఆరోజు మధ్యాన్నంనించే వారింటికి వెళ్ళి వారి కోడల్ని 'అక్కయ్యా' అని వరస కలిపి పిలుస్తూ, ఈమాటలు ఆమాటలు చెప్పి ఆవిడ్ని నవ్విస్తూ అడిగి మొత్తానికి ఆ పాట నేర్చు

కొత్త పెన్ను

దామోజీపురపు దుర్గాప్రసాదరావు

ఆరోజు ఆదివారం బడిలేదు. నాకేమీతోచటంలేదు. వీధివరండాలో అటూయిటూ పచార్లుచేస్తున్నాను. ఇంతలోనే పూర్తిచేయవలసిన సైన్సునోట్సుసంగతి జ్ఞాపకం వచ్చింది. అదిరాయకపోతే, అనవసరంగా సైన్సుమేష్టారి పేముబెత్తానికి పనికలుగుతుంది. అదికాస్తా రాసి, పీడవదిలించుకుందామని పెన్ను కోసం డ్రాయరువద్దకు వెళ్లాను. డ్రాయరులోకి చెయ్యి పోనిచ్చాను.

పెన్ను చేతికితగలలేదు, ఖంగారెత్తిపోయింది, చెయ్యిఇంకా లోపలికిపోనిచ్చాను. కనబడలేదు...... కొంపదీసి పోయిందేమో!..... అమ్మో! అదిపోతే యింకేమన్నా వుందా? మొన్ననే కొనిచ్చారు నాన్నగారు. పోయిందని తెలుస్తే నన్ను నిలువునాచీరేస్తారు. నాకు దడ ఎక్కువయింది, డ్రాయరంతా వెతికాను. ఇల్లంతా వెతికాను. పుస్తకాలన్నీ చిందరవందర చేసేశాను. అబ్బే! కనబడతేగా! ఆ! వెధవగోపీగాడే తీసివుంటాడని వాడిదగ్గిరకెళ్లి వాణ్ణిదబాయించాను. వాడూ తియ్యలేదు.

ఇకపోయిందని నిశ్చయించుకున్నాను. ఇప్పుడు ఏంచెయ్యాలి? అలాటి పెన్నే ఒకటి ఎవరికి తెలియకుండా కొనాలి కొనకపోతే! నాన్నగారు బతకనివ్వరు. రేపుసైన్సునోట్సు రాయపోతే స్కూల్లోమేష్టారిచేత దెబ్బలుతప్పవు. ఎలాగరా భగవంతుడా అనుకుంటున్నాను. కొత్తపెన్ను కొనేందుకు డబ్బుకావాలి మూడురూపాయలు వుంటేకాని అలాటిపెన్ను రాదు. ఇంట్లో అడిగితే కానీకూడా యివ్వరు. ఏంచేయాలో తెలియక ఆలోచిస్తుకూచున్నాను. ఆ! జ్ఞాపకంవచ్చింది ఎన్నోరోజులబట్టీ, ఎవరికీ తెలియకుండా జాగ్రత్తగా డబ్బీలోదాచుకుంటున్న

"తెలుసుకో త్యాగరాజార్చిత...."

కున్నాం. అస్తమానం అదేపనిగా సాధన చేసేసరికి రెండవరోజుకే మాకా పాట కంఠతా వచ్చింది.

మా అమ్మ మమ్మల్ని రోజూ ప్రొద్దున్నే లేపి మేము ముఖం కడుక్కుని వచ్చేదాకా కొంతపని చేసుకుని, తరవాత మాకు నీళ్లుపోసి, తల దువ్వి జడవేసి అన్నం పెట్టిగాని ఇంకోపని ముట్టుకునేదికాదు. ఒకరోజున రోజూలాగే లేపి "ముఖం కడుక్కోండి నీళ్లుపోస్తాను కాగిపోయినాయి" అని చెప్పి తనపని చేసుకుంటోంది. మేము లేచివచ్చి దొడ్లో నీళ్ళపొయ్యివద్ద కూర్చున్నాము. గండికోటవారి ఇంటికి మా ఇంటికి మధ్య గోడ పడిపోవటంవల్ల వారింట్లో ఎవరు తిరుగుతున్నా మాకు కనిపిస్తారు. వారి కోడలు దొడ్లో పనిచేసుకుంటూ వుంది. ఆమెను చూడగానే మా అమ్మ ముఖం కడుక్కోమన్నా కడుక్కోకుండా ఆమె చెప్పినపాట రెండవరోజుకే వచ్చిందన్న గర్వంతో ఆవిడ చూస్తోందో లేదోనని ఆవిడవంక చూస్తూ, ఆవిడ చెప్పినపాట పాడుతున్నాం. మా ఖర్మకాలి మా నాన్నగారు ఆ రోజున ఊళ్లోలేరు. అప్పటికి మా అమ్మ మాకు రెండుసార్లు వార్నింగు ఇవ్వటం అయింది. అప్పటికీ మేము వినకుండా 'శ్రీ రఘువర సుగుణాలయా, రామా సరసిజలోచనా, విలోచన ...వేగమె తెలుసుకో త్యాగ..." అంటూ పాట సాగించాం. పాట సాంతం పాడకమునుపే, మా అమ్మ ఎంతసేపటికీ ముఖం కడుక్కోపోవటం చూసి, విసుగుతో మూలనున్న చీపురుకట్ట తీసుకుని, 'వేగమె తెలుసు'కున్నారా 'లేదా, తెలుసుకున్నారా' అని అదేపనిగా మా ఇద్దరి వీపులమీదా వుతకటం మొదలుపెట్టింది. "బాబోయి కొట్టకే తెలుసుకున్నాం.మే" అని ఏడుస్తూ ప్రక్క ఇంటివారికోడలు చూస్తుందేమో అన్న భయంతో లోపలికి పరిగెత్తాం. మెల్లిగా కాసేపు ఏడ్చి కళ్లు తుడుచుకొని వచ్చి ముఖం కడుక్కున్నాం. ఇది అంతా ఆవిడ చూస్తూనే వుంది. ఆరోజునుండి పాటలపిచ్చి మాకు తగ్గిపోయింది. ★

డబ్బులు ఎన్నివున్నాయో చూద్దామని పెట్టెతీసి లెక్కపెట్టాను. అంతాకలిపి రెండురూపాయిల పావలావుంది. అరే! ఇంకోముప్పావులా తక్కువయిందే! ఏంచేయటానికీతోచక విచారిస్తూ కూర్చున్నాను. ఇంతలో నాన్నగారొచ్చి పెన్నడిగితే? ... నాగుండె దడదడలాడుతోంది.

ఇంతలో "అలావున్నావేరా ?" అంటూ అమ్మ కాఫీకప్పు తెచ్చి డ్రాయరుమీద పెట్టింది. వణకుతున్న చేత్తోటి కాఫీతాగి "ఏమీ లేదని" సమాధానంచెప్పి తప్పించుకున్నాను. నాకు పెన్నునుగురించి ఆలోచనలే ఎక్కువఅయినాయి.

ఇంతలో నాన్నాగారువచ్చారు. నాకుభయంవేసింది. మూలకూచుని చదువుకుంటున్నట్టు నటించా. నాన్నగారు కాఫీతాగుతూ "వేణూ! ఇలారా" అనిగట్టిగాపిలిచారు, పిల్లిలావణకుతూ వెళ్లిపక్కననుంచుని "ఏంనాన్నా" అన్నా. నాగుండె కొట్టుకుంటూనేవుంది పెన్నేదని అడుగుతారేమోనని. "ఒరేయ్" ఈమూడుగంటలబండీకి నీవుఏలూరువెళ్లి, ఈరికార్డు నేనిచ్చానని కచ్చేరిలోవుండే రాజారావుకిచ్చి వెంటనే జనతాఎక్స్‌ప్రెస్ లో వచ్చేయ్" అంటూరికార్డుకాగితాలు, రెండు రూపాయలనోటూ యిచ్చారు. నాముఖం నారింజకాయలమ్మే జంగిడంతయింది.

రైలుచార్జీలు ఒకరూపాయికంటే ఎక్కువ అవనేఅవవు. ఇంకారూపాయిమిగులుతుంది. దాంతోటిమన పెన్నుకొనెయ్యొచ్చు అనుకుని సంతోషంతో స్టేషనుకు బయలుదేరాను నాన్నగారిని మెచ్చుకుంటూ. బుకింగు ఆఫీసులోకివెళ్లి దర్జాగా ఏలూరుకు అరటిక్కట్టుకొన్నాను.

ఏలూరు స్టేషన్లోదిగాను. అక్కడినుంచి కచేరీచాలా దూరముంది. జేబులోడబ్బులు చూచుకున్నా. ఓ! రూపాయన్నరవుంది దర్జాగా ఒకపావులా సైకిలురిక్షావాడికి పారేసి కచేరీకి రిక్షామీదవెళ్లాను. కోర్టులోపనిచూచుకొని మళ్ళీస్టేషనుకువద్దామని నడుస్తున్నాను. తస్సాదియ్యా! ఎంతదూరమో! కాళ్లు పడిపోయాయి ఇందాక సైకిలురిక్షామీద వెళ్లాను కనుక ఎంతదూరమో సరిగాతెలియదు. చచ్చీచెడీ స్టేషనుకు చేరుకున్నాను. అప్పుడేజనతాఎక్స్‌ప్రెస్‌వచ్చి స్టేషనులోవుంది. ఖంగారుగా అర్ధరూపాయిచ్చిటిక్కెట్టుకొని రైల్లోపడ్డాను.

మావూరు చేరుకున్నాను. జేబులో చాలాచిల్లరడబ్బులు వున్నాయి లెక్కపెట్టా. సరిగ్గా ముప్పావులావుంది. పెన్నుకుసరిగ్గా సరిపోతుంది; కాసీకూడా ఎక్కువలేదు. పోనీలే, పెన్నుకొంటే యింట్లోనూ స్కూల్లోనూ దెబ్బలు తప్పుతాయికదా అనుకున్నాను. చకచకానడిచి ఇంటికిచేరాను. నాన్నారితో వెళ్లినపనయిందని చెప్పాను. నాగదిలోకివెళ్లి పెట్టితీసి, డబ్బులుతీసి పెద్దబజారుకు పరిగెత్తాను. నాకుకావలసిన ఆలాటిపెన్నులేదు నిరాశతో వెనక్కుతిరిగి వస్తుంటే ఒకపెద్దషాపులో మెరుస్తూకనిపించింది, నేననుకున్నపెన్ను. కొట్లోకిజొరబడి మూడురూపాయలూ వాడికిచ్చి పెన్నుతీసికొని ఇంటికిచేరాను నాన్నారిచేతదెబ్బలు తప్పుతున్నాయని గర్వపడుతూ.

ఇంటికెళ్లి భోజనంచేసి, నాగదిలోకివెళ్ళి కొత్తపెన్నుతో సైన్సునోట్సురాయబోతున్నాను ఇంతలో మాఅమ్మవచ్చి "ఇదిగోరా నీ పెన్ను! మధ్యాహ్నం మీనాన్న ఆఫీసుకు తీసుకొనివెళ్లారు. ఇప్పుడే తెచ్చారు. రాసుకోఅంటూ పెన్ను డ్రాయరుమీదపెట్టి వెళ్లిపోయింది.

నాతల దిమ్మెక్కిపోయింది. నాపెన్ను పోలేదన్నమాట! జాగ్రత్తగా దాచుకున్న డబ్బులతోటి, కష్టపడి సంపాయించిన డబ్బులతోటీ కొన్న "కొత్తపెన్ను" దండగేఅని తెలిసి, ఏంచెయటానికి తోచక విచారిస్తూ అప్పడంలా మొఖం పెట్టేశాను. ★



విజ్ఞానవీధులు

"డాక్టర్"



172. చెట్లలో మానవ లక్షణాలు

అరటిచెట్టుకి పిల్లలమీద మహా అభిమానమూ కాపీనమూను. పిల్లల్ని చుట్టూ రాపెట్టుకునే కూర్చుంటుం దెప్పుడూ. తుమ్మచెట్టు అతిపిరికి. ఒంటినిండా ముళ్ళు పెంచుకుంటుంది శత్రువులు అపాయము చెయ్యకుండా. ఇది చాలక జంటముళ్ళ మొదట చీమలకి ఇళ్ళు కట్టిఇచ్చి, ఆకు రెమ్మల కొసని ఈ సిపాయిదండుకి ఆహారముకోసము పిండిపదార్థము తయారుచేసి పెడుతుంది. కంద గొప్ప పిసినిగొట్టు. మూడేళ్ళకి పెట్టబోయే కుటుంబముకోసము ఆహారాన్ని ఎవరికీ కనబడకుండా భూమిలో దాచుకుంటుంది. ఆ దుంపని మానవులు తవ్వితినేస్తారు. మర్రిచెట్టు పరోపకారి. పెద్ద పెద్ద కొమ్మలూ వెడల్పాటిఆకులతో చాలా మేర విస్తరించి బ్రహ్మాండమైన శరీరాన్ని పెంచుకున్నా, పళ్ళనిమట్టుకు చిన్నవాటినే చేస్తుంది. తన నీడని విశ్రమించే వారికి అపాయము కలగకుండాను.

తాటిచెట్టూ వేరుసెనగమొక్కా వంశాంకురాలను దాచడానికి మహాఅవస్థ పడతాయి. అది కాయల్ని ఎక్కడో నెత్తిమీద పెట్టుకుంటే ఇది కాయల్ని భూమిలో దాచుకుంటుంది. గుమ్మడిపాదు బలహీనమైనదైనా పిల్లల్ని ఎత్తుకోడానికి మహా ఓపిక గలది. కాఫీ, అనాస, మహాసుకుమారులు. నీరు ఎప్పుడూ తగులుతూ ఉండాలి, వరిమొక్కకిలాగ మొదళ్ళలో నిలవకూడదు.

జువ్విచెట్టు చాలా సదాచార సంపన్న. ఆకుల్ని రాల్చివేయనక్కరలేని ఉష్ణమండలాల్లో స్థిరవాసముండిపోయినా తన ప్రాచీనాచారమును మానక శిశిరఋతువులో ఆకు పూర్తిగా రాల్చి వసంతంలో చిగురుస్తుంది. తురాయికి దిద్ది తీర్చుకోడములో అతి శయమా. ఎంతమంది వంశాంకురాలను పెట్టినా, లేతరంగు ఆకుపచ్చని చీరను విడిచి ముదురెరుపు (రక్తవస్త్రాన్ని) ధరిస్తుంది. ఆముదపు చెట్టు తన వంశాంకురాలు ఎంత జిడ్డు సరుకైనప్పటికీ, వాటికి సులువుగా చిరగని చుక్కల దుస్తులు కుట్టి, ముళ్ళ ఇళ్ళలో దాచిపెట్టి, తన వంటికి లేత కుంకము నలుగు పెట్టుకుని ఆకుపచ్చని ఆకుల మచ్చల కరాచీ చీర కట్టుకుని మహాషోకు చేసుకుంటుంది.

సిగ్గ[illegible]త జంతువుల గాలి విసిరితే ఆకుల్ని ముడిచేసుకుని ముళ్ళచెట్టుని సుమా అని ఝడిపిస్తుంది. చింతచెట్టు చిన్నపిల్లల్ని 'దయ్యాలున్నాయిసుమా' అని జడిపిస్తుంది. ద్రాక్షతీగె ఎంత ఎరువు వేసినా శుభ్రంగా తినేసి ఒళ్లు పెంచేస్తుంది. ముక్కులూ చెవులు, చేతులూ కత్తిరించిపారేసినతర్వాత గాని అప్పు తీర్చదు. కేబేజీని ఇంకా అల్లరిపెట్టాలి.

ఈతచెట్టు ఎరగనివాడిలాగ ఎప్పుడూ మనిషికి దూరంగా ఉంటుంది. మామిడిచెట్టు తనకి చేసిన ఉపకారాన్ని ఉండనిచ్చుకోదు. నిద్రగన్నేరుకి ప్రాణిసేవయే పరమేశ్వరు సేవ. పగలల్లా నీడ, రాత్రి వెన్నెల అనుభవానికి తెస్తుంది. తియ్యని పాడుగాటి కాయలూ, మెత్తని అందమైన కుంచెపువ్వులూ, చక్కని ప్రాణి నిద్ర గన్నేరు.

ఆటవికులవలెనే తాటిచెట్టు స్వల్పపు ఉపకారానికి జీవితకాలమంతా సేవ చేస్తుంది. సరుగుడుచెట్టుకి ఎంత చేసినా విశ్వాసము లేదు. గాలివేసినప్పుడల్లా పాటలు పాడుకుంటూ మానవుడి ఊసే పెటదూ. తిమింగలానికిలాగ చచ్చిన తర్వాతనే దాని ఉపయోగము.

తెలివైన పేద విద్యార్థిలాగ వెదురు కొంచెము ఆసరాయిస్తే చక్కగా వృద్ధిలోకి వస్తుంది. ఎంతకాలం సాయం చేసినా ఇంకా తెమ్మనే అప్రయోజకపు పుత్రుడులాగ బదనిక ప్రత్యుపకారమంటూ తల పెట్టదు. ఎంతసేపూ తన పూలూ తన కాయలూను. వాలఖిల్య ఋషిలాగ ఎపిఫైటులు చెట్లమీదనే వుండి గాలి పీల్చుకుని బతుకుతాయి. బిచ్చగాళ్ళలాగ నాచు ఎక్కడ 'తడి' ఉంటే అక్కడచేరి పెరిగిపోతాయి. ఉద్యోగస్థునిలాగే ఆ మొక్క జీతము ఇచ్చి నన్నాళ్లూ సేవ చేస్తుంది. గుమాస్తాలలాగ గడ్డిమొక్క దూర భవిష్యత్తులో ఆశ పెట్టుకుని పశువులు కాలద్రొక్కి అందినప్పుడల్లా తినేస్తూన్నా కుటుంబం వృద్ధిచేసుకుంటూ జీవికలాగుతుంది. ప్రపంచం అంతటా ఉంటూ ఎక్కువ ఉపకారమైన పైరు గడ్డి మొక్కలూ గుమాస్తాలూను.

చిత్రప్రశ్నలకు జవాబులు

—కంఠస్వరము మారిపోడానికి కాదు గాని సాఫీగా తయారుచేసుకోడానికి పరిశ్రమలు చెప్పే కంపెనీ లున్నాయి. హిజ్ మాస్టర్స్‌వాయిస్ కంపెనీకి వివరాలకి రాయండి.

—సూర్యమండలము 'పాలపుంత' అనబడే గెలక్సీలోనిది. స్పైరల్ నెబ్యులాలలో అసంఖ్యాక నక్షత్రాలుకూడా వుంటాయని మీరు వినేవుంటారు. ఈ గెలక్సీలకి అంతు! ఎవరితరముస్వామీ అది చెప్పడానికీ?

—చలిదేశాలలో సూర్యరశ్మి అంతగా ఉండదు. కనక అక్కడి జనులు తెల్లగా ఉంటారు. ఉష్ణమండలంలోని ఉష్ణతను నిరోధించడానికి చర్మములో కొన్ని వర్ణమిశ్రమములు (*Pigments*) అవసరము. అవి కలవారే నల్లవారు. శీతలదేశాలవారి స్కంధము (*Trunk*) తెల్లగానూ, చేతులూ, మెడ, ముఖమూ ఎర్రగానూ ఉంటాయి. స్నానము చేసే ఐరోపీయులను చూడండి. ఆ భాగాలు సూర్యరశ్మికి అందుతాయి కనక ఎర్రబడతాయి. బనియను వేసుకుని కప్పుకునే భుజాలు, వీపూ ఎర్రవాటుగా తయారవుతాయి.

—లింగమునకు శివునితో అభేదము ఏకాలములో వచ్చినదో చెప్పడము కష్టము. తెలుగుదేశములో 4 వ శతాబ్దమునాటి శివాలయము చేజెర్ల కపోతేశ్వరాలయము. గుడిమల్లము (చిత్తూరుజిల్లా) లోని పరశురామేశ్వరలింగము క్రీ. శ. మొదటి శతాబ్దానిదని ఆనందకుమారస్వామి, పల్లవుల (నాలుగో

శతాబ్దము) నాటిదని లాంగ్హర్స్టు అంటున్నారు. పల్లవులు సోమస్కందమూర్తినిగా శివుని చిత్రించడములో రూప చిత్రణము చేశారు.

వివాహానికి హేతుభూతు డగు భగవంతునికి శివుడు చిహ్నమూను, సృష్టికర్త యగు భగవంతునికి లింగము చిహ్నమూను. శైవులు తమ 'శివు'నికి రెండుకర్తలూ ఆరోపించ యత్నించిన చరిత్ర పూర్వ శతాబ్దాలలో దక్షిణ భారతములోగాని ఈ 'శివ' 'లింగ' సమ్మేళనము జరిగినదేనా. శివునికి కేవలము లింగమే ఏల చిహ్నమైనదో మాకు తెలియదు.

—సకల ప్రాణికోటిలోను మానవుడొక్కడే కాదు సిగ్గుపడడము. కుక్కలలో కనపడుతుంది. ఇతర ప్రాణులలోనూ ఇంతో అంతో సిగ్గుపడడము ఉంటుంది సూర్యంగారూ.



పి. ఎన్. ఫిలిమ్స్‌వారి "ప్రజనర్ ఆఫ్ గోల్కొండ"లో బీనారాయ్.

సినిమా కళ వినోద సాధనం

(వాసన్ గారి వ్యాసానికి జవాబు)

ఎన్. వెంకటేశ్వరరావు



భరణీ వారి "చక్రపాణి"లో ఏదో విషమసమస్యలో పడిన నాగేశ్వరరావు, భానుమతి.

జెమినీ అధినేత యస్ యస్. వాసన్ గారు ఆంధ్ర (సచిత్రవార) పత్రిక సంక్రాంతి సంచికలో "సినిమాకళ వినోద సాధనం" అనే పేరుతో ఒక వ్యాసాన్ని ప్రచురించారు దానిలో సినిమారంగంలో విమర్శకుని స్థానాన్ని గురించి ప్రధానంగా చర్చిస్తూ, నిర్మాతలతరఫున ప్రాతినిధ్యం వహించి వారు తమ కార్యక్రమాన్ని యిచ్చారు. దక్షిణభారత సినిమాపరిశ్రమలో వాసన్ గారు అగ్రగణ్యులు కావటంచేత వారి 'మాటలు చేతలు', వాటి ప్రభావం సినిమా పరిశ్రమమీదా ముఖ్యంగా సినిమా నిర్మాతలమీదా అపరిమితంగా వుంటుంది. వారి వ్యాసం సినిమా కళాభిమానులలో చాలా ఆందోళన కల్గిస్తోంది; వారి అభిప్రాయాలను సాకల్యంగా పరిశీలించి వారికి సినిమాకళ అంటే ఎట్లాంటి స్వరూపం వుందో తెలుసుకోవటం చాలా అవసరం

విమర్శకులు మూడురకాలుగా వున్నట్లు వాసన్ గారు చెబుతున్నారు. అందులో మొదటిరకం విమర్శకులు అసలు సినిమాలే పూర్తిగా చెడ్డవనీ, టిని తగులబెట్టా లంటారనీ, అలాంటవాడు పూర్వం పుస్తకాల్నిటినీ తగులబెట్టమని ఆజ్ఞాపించిన సారసేన్ గాలువలె కేవలం మూర్ఖుడనీ, వారు ఒక్కటే ఉదాహరణతో నిరూపించారు. అయితే మనరోజుల్లో అలాంటి మనుషులు లేరనీ; ఉన్నా, వాళ్ళు సినిమాకళకు ఏవిధంగాను ద్రోహం చెయ్యలేరని, అలాంటివాళ్లను ఇట్టే త్రోసివేయవచ్చుననీ,—అందుచేత అట్లాంటివాళ్ల ప్రసక్తి తేవటం అనవసరమనీ మనం అనుకోవచ్చు

అయితే ఏ విశేషమూ లేని ఎలాంటి చెత్త పుస్తకాన్నయినా తమ పిల్లలు చదవడానికి అంగీకరించే (?) కుటుంబాలు ముందుగా సెన్సారు సర్టిఫికేటు పొందిన సినిమాలను నిషేధించాలనటంలో అర్థంలేదని చెబుతూ వాసన్ గారు బరువు బాధ్యతలు గల్గిన తలిదండ్రులను కూడా ఈ విమర్శకుని జాతిలోకే చేర్చారు వారు ఇచ్చిన సారసేన్ రాజు ఉదాహరణకూడా ఇందుకేనని మనం అనుకోవచ్చు వారు ఏ ఉద్దేశంతో అలా అన్నారో పరిశీలిద్దాం.

ప్రేలుడుమందు మనిషికి మేలు చేకూర్చ డానికి కనిపెట్టబడితే అది మనిషిని చంప డానికి తుపాకీ మందుగా ఎలా దుర్వినియోగపర్చబడిందో చెబుతూ వారు సినిమాల విషయంలో కూడా అంతేనన్నారు. దీన్నిబట్టి వారు సినిమాకళను ప్రపంచంలో సద్వినియోగపర్చాలనే విషయాన్ని అంగీకరిస్తున్నారన్నమాట. ఐతే మన నిర్మాతలు సినిమాకళను ఎంతవరకు ఏవిధంగా సద్వినియోగపర్చారో వారు చెప్ప లేదు కనీసం మాటవరసకైనా సినిమాలను ఏరకంగా సద్వినియోగపర్చవచ్చో కూడా వారు చెప్పలేదు. వారి వ్యాసంలో ఎక్కడా కూడా వారి కా దృష్టి వున్నట్టు కనపడదు.

సినిమాలు జనసామాన్యంతో సన్నిహిత సంబంధం కలవి జనుల నిత్యజీవితాన్ని ప్రతిబింబిస్తాయి. వినోదాన్ని ఇస్తాయి. విజ్ఞానాన్ని అలవరుస్తాయి అంతేకాదు కూడా ప్రజల జీవితాన్ని, వారిఅలవాట్లను, భావాలను వారి పరిస్థితులను తారుమారు చెయ్య గలవు. కాగా, నిర్మాత ప్రతిఫలాన్ని ఆశిస్తున్నాడు కాబట్టి, మానసికంగా మని

★ సినిమాకళ వినోదసాధనం ★

షీలో మార్పులు తెచ్చేస్థితిలో వున్నాడు కొబట్టి ప్రజోపయోగకరమైన చిత్రాలు నిర్మించాల్సిన బాధ్యత అతనిమీద వుంది. అంతేగాని ప్రేలుడు మందు దుర్వినియోగపర్చబడితే మనం ఏమీ చెయ్యలేకపోయాము; అలాగే సినిమాలవిషయంలో గూడా — అనేవి విజ్ఞులనవలసినమాటకాదు. కాగా, అలా చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమే అవుతుంది.

వాసన్‌గారు రచనాకళ, సినిమాకళ విభిన్న ప్రయోజనాలకోసం అవతరించినట్టు స్వయంగా నిర్వచించారు. అలా చెప్పి, మొదటినుండి చివరిదాకా ఈ రెండు కళారూపాలను పోలికలేనిచోటల్లా పోల్చారు. దీన్నిబట్టి వారు తమవంటి నిర్మాతలకు వీలుగా కొన్ని నిర్ణయాలు చేసుకోవడానికి మాత్రమే ఈ ఉదాహరణలు తెచ్చినట్లు ఈ క్రిందివిషయాలు చూస్తే మనకు స్పష్టమౌతుంది.

చౌకబారునవలలు ఎక్కువమంది చదువుతున్నారని, అంతమాత్రంచేత వాటిముద్రణ, ప్రచురణలు నిషేధించమని ఎవరూ అనడంలేదని, "ఇలాంటి సహనభావమే సినిమాలపట్లకూడా చూపాలని" వారి విజ్ఞప్తి.

చౌకబారు నవలలు మనిషిని దుర్బలుణ్ణిగా చేయగలవని, అయితే వాటిని చదివే పాఠకుల సంఖ్య—ఒక చెత్తచిత్రం విడుదలైన మొదటిరోజున దాన్ని చూసే ప్రేక్షకుల సంఖ్యలో నూరోవంతుకూడా వుండదని; కాగా సినిమాలు "చూడబడేవి" గనక వాటిలో అర్థంకానిదంటూ ఏమీ ఉండదు గనక దానిలోని మంచీ చెడూ వాసన్‌గారి దృష్టిలోవున్న. గ్రామీణులను ఇట్టే ఆకర్షిస్తుందనీ; దాని ప్రభావం పోల్చి చూసినప్పుడు విద్యావంతుడు, యుక్తాయుక్తాలు తెలిసినవాడూ అయిన పాఠకునిమీద కలిగే పుస్తక ప్రభావంకంటే సామాన్యుడిమీద కల్గే ప్రభావం, నష్టం సినిమాలవల్ల విపరీతంగా వుంటుందని—ఈ కారణాలవల్ల చెత్తచిత్రాలకు చెత్త పుస్తకాలకూ ఎక్కడా పోలికవుండదని, దీన్నిబట్టి వారు చెత్తచిత్రాలను నిషేధించరాదు అని చెప్పడానికే చెత్తపుస్తకాల సామ్యం తెచ్చినట్లుగా వెల్లడి అవుతున్నది.

దీన్నిబట్టి మేము చెత్తచిత్రాలుతీస్తాము. వాటివల్ల ప్రేక్షకులకు నష్టం కలుగుతుందని మాకు తెలుసు. ఐనా, మీరు మా చిత్రాలు చూడాలి సుమా! అనే వింతధోరణి వారి వ్యాసంలో ద్యోతకమవుతున్నది.

ఇట్లాగా మేము తీసేది 'చౌకబారు' చిత్రాలే అని ఇంతపెద్ద నిర్మాత బాహాటంగా చాటుకుంటే కనీసం ఇలాంటి చిత్రాలబారినుండయినా తమ పిల్లలను రక్షించుకోవడానికి తలిదండ్రులు వాటిని నిషేధించమని అడగడంలో తప్పేముంది? పైగా అలాంటి తలిదండ్రులను బాధ్యతలెరిగిన ఇంతపెద్ద నిర్మాత సారసేన్ రాజుకూ మూర్ఖులకూ పోల్చడం ఔచిత్యం అనిపించుకోదు. అయితే సినిమాలను నిషేధించమని ఎవరూ అనవలసినపనిలేదు. అవసరమైతే ఆ పనికి ప్రేక్షకులే పూనుకుంటారు.

సినిమాలను సద్వినియోగపరచే దృష్టి ఈ నిర్మాతకు లేదని దీన్నిబట్టి రుజువౌతున్నది. కాగా, 'చౌకబారు' చిత్రాలు ప్రజలను పెడత్రోవల పట్టిస్తాయని తెలిసికూడా, ఖా[illegible] చెయ్యకుండా ఇలాంటి చిత్రనిర్మాణానికి పూనుకోవడంలో ఆంతర్యం ఏమిటో వారు రెండోరకం విమర్శకునిగురించి ప్రస్తావించినప్పుడు బైటపడుతుంది.

* * *

"సినిమాలు వినోదానికి మాత్రమే ఉపయోగించబడుతున్నాయని, ప్రజలను విద్యావంతులుగా చెయ్యడానికి అవి పనికిరావడంలేదని" అనే విమర్శకుడు మరోకరకం అని చెబుతూ, వాసన్ గారు ఈ వాదనను "ఇదికూడా అర్థంలేని వాదనే" అని త్రోసిపుచ్చారు.


"వినోదంకొరకే సినిమాలు కనిపెట్టబడ్డాయ"ని ఒక క్రొత్త సిద్ధాంతాన్ని లేవదీస్తున్నారు. పైపెచ్చు ఒక విజ్ఞానాన్ని అందించడమే గ్రంథ ప్రయోజనమని కేటాయించారు "విద్యకోసమే సినిమాలకు ఎందుకు వెళ్లాలి?" అనేది వారి ప్రశ్న.

"వినోదం కావాలంటే అనేక సాధనాలు వున్నాయి. ఒక్క సినిమాలకే ఎందుకు వెళ్లాలి?" అని మనం ఎదురు ప్రశ్న వేయవచ్చు. ఐతే వీటి నిజానిజాలు ఏమిటో చూద్దాం.

అసలు ఆరంభదశలో ఏ కళారూపమయినా ఫలానా ప్రయోజనంకోసం అంటూ అవతరించలేదు. ఒకటి వినోదంకోసం, మరొకటి విజ్ఞానంకోసం అనీ లేదు. వాస్తవానికి వీటి ప్రయోజనాలు మనం వినియోగించుకోవడం మీద ఆధారపడుతూ వచ్చాయి. ఆదిలో ఒకరి భావాల నొకరు వ్యక్తం చేసుకోవడానికి ఉపకరిస్తూ వచ్చిన రచనాకళలో ఈనాడు మహాకావ్యాలు వెలువడిన విషయం మనందరికీ తెలుసు. అలాగే మొదటి సినిమా ప్రదర్శన జరిగినప్పుడు తెరమీద రైలుబండి పరిగెత్తడం చూసిన ప్రేక్షకులు ఆశ్చర్యచకితులయారు. అది అలా తప్పటడుగులు వేసుకుంటూ ఇప్పుడిప్పుడు గొప్ప గొప్ప కళాఖండాల సృష్టికి దోహదం చెయ్యడం, వినోద విజ్ఞానాలను అందించడం మనం చూస్తున్న విషయం. మనం కనీ వినీ ఎరుగని మహత్కార్యాలను సాధించగల శక్తి సినిమాకళకు ఉన్నదంటే అది అతిశయోక్తి కానేరదు.

ఏ కళయినా ఒక ఉత్తమస్థాయిని అందుకున్నప్పుడు దానిలో వినోదం, విజ్ఞానం పూర్తిగా సమ్మిళితమైవుంటుంది. అలాగే సినిమాకళ కూడా. కాగా, వినోదాన్నుండి విజ్ఞానాన్ని విడగొడ్తున్నామంటే అది వాసన్‌గారు తమ వ్యాసంలో వేరొకచోట శెలవిచ్చినట్లు "ఒక వస్తువు పూర్తిగా తెలుపైనా కావాలి. పూర్తిగా నలుపైనా కావాలి. ఈ రెంటి మధ్యలో ఎన్నో వింతరంగుల నీడలు ఉంటాయని వాళ్ళకి తోచదు." అనుకోవాల్సివస్తుంది. దీన్నిబట్టి ఏ కళయినా పరిణామంచెందేకొద్దీ దానికిగల ప్రయోజనాలుకూడా అభివృద్ధి చెందుతాయిని, విజ్ఞానదాయక చిత్రాలు తీయడమే నిజమైన వినోదాన్ని అందించడం కాగలదని రుజువౌతుంది.

ఐతే మన నిర్మాతలు తమ చిత్రాల్లో విజ్ఞానాన్ని ఎందుకు అందించ దల్చుకో లేదో అందుకు సాకుగా వాసన్‌గారు విద్యావిషయక చిత్రాలనుగురించి ప్రస్తావించారు. ఇవి ప్రజలను విజ్ఞానవంతులుగా చేస్తాయనడంలో సందేహంలేదు. అందుకు వాసన్‌గారు కూడా అంగీకరిస్తున్నారు. అయితే ప్రజలు చూడరు. అందుచేత మేము తీయము అంటున్నారు. ప్రభుత్వం గాని విమర్శకుడుగాని గ్యారంటీయిస్తే తీస్తాము అనికూడా అన్నారు. దీన్నిబట్టి 'చౌకబారు, వినోద' చిత్రాలు అనే పేరుతో ఏదో ఒకరకంగా డబ్బు సంపాదించడమే వారి ప్రధానలక్ష్యం అని తేలుతున్నది. అంతేగాని సినిమాల ప్రయోజనం విజ్ఞానాన్ని అందించడమూ కాదు, సద్వినియోగపర్చడమూ కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే సినిమాల లక్ష్యం: "వినోదం" అనే వారి వాదనంతా డబ్బు సంపాదించడానికి ఒక సాకుమాత్రమే. ఇలా వారి యిష్టానుసారంగా డబ్బు గడించడానికి వీలుండదనే భీతివల్ల, ఎక్కడ అంతరాయం కల్గిస్తాడో అనే భయంతోనే ఈ రకం విమర్శకుణ్ణి "గ్యారంటీ ఇవ్వకుండా నువ్వు ఫలానా చిత్రం నిర్మించు అని నిర్మాతకు చెప్పే హక్కు నీకులేదు" పొమ్మంటున్నారు. ప్రజాభిమానాన్ని చూరగొనే చిత్రాలు తీయడం ఎలాగో అర్థంచేసుకోలేక "తమ



యునైటెడ్ టెక్నీషియన్స్ ఎండ్ శ్యామలా వారి "పల్లెపడుచు"లో తోటి రైతులను ప్రబోధిస్తున్న పాలేరు గంగులుగా భమిడిపాటి శ్రీరామమూర్తి.

★

"పల్లెపడుచు" షూటింగ్ విశ్రాంతిసమయంలో క్రికెట్ ఆడుతున్న డైరెక్టరు బి. సుబ్బారావు, కృష్ణకుమారి, చలం, రామశర్మ మున్నగువారు.



★ సినిమాకళ వినోదసాధనం ★

ఏ చిత్రం నిర్మించాలో నిర్మాతే చూసుకుంటాడు. మధ్యలో విమర్శకు డెవరు?" అని అనవసరంగా విమర్శకునిమీద వాసన్ గారు ఆగ్రహపడితే మనకు జాలి వేస్తుంది.

ప్రేక్షకులలో - ఒకడైన విమర్శకుడు, సామాన్య ప్రేక్షకునికి ఒక చిత్రంయొక్క బాగోగులను గురించి వివరంగా చెబుతాడు. ఒకవిధంగా చూస్తే విమర్శకుడు నిర్మాతకు కూడా కొంత ప్రచారం చేసి పెడుతున్నాడు. అయితే అతను నిర్మాతకు ప్రేక్షకునికి మధ్య "లింకు"గా వుండి; నిర్మాతల తరఫున ఒక ప్రతినిధిగా ఎలాగైతే వుంటాడో, అదేవిధంగా ప్రేక్షకుల తరఫున అతను ప్రతినిధిగా వ్యవహరిస్తూ, సినిమా రంగంలో ఒక ప్రధాన పాత్రను నిర్వహిస్తాడు. ఇంతేకాకుండా డబ్బు చెల్లించుకునే ప్రేక్షకునికి 'మాకు ఫలానా చిత్రం కావాలి' అని అడిగే హక్కు వుంది. దీన్నిబట్టి ప్రేక్షకుల తరఫున మాట్లాడే హక్కు విమర్శకునికి సంపూర్ణంగా వుంది. దేశశ్రేయస్సుకు ఏదైతే భంగం కల్గిస్తుందో దానిని అరికట్టే హక్కు ప్రతి పౌరునికీవుంది. అలాగే విమర్శకునికికూడా. అంతేగాని వాసన్ గారు "మధ్య విమర్శకు డెవరు?" అనడం చాలా పొరపాటు. అయితే వారు, మేము ఫలానా చిత్రాలు తీస్తాము అంటున్నారే, వారికిమాత్రం ఆ హక్కు ఎక్కడనుండి వచ్చింది? వారు తీస్తున్న చిత్రాలకు మాత్రం గ్యారంటీ వుందా? అలా ఉన్నట్లయితే, వారుతీస్తున్న చిత్రాలలో నూటికి తొంభైదాకా దెబ్బ తినడంలేదా? దీని అర్థం ప్రజలు వీటిని గూడా చూడడం లేదు అనేగదా? ప్రజల అభిరుచులు ఎలాంటివో, వాళ్లు ఎలాంటి చిత్రాలను చూడగోరుతున్నారో — ఈ విషయాలు మన నిర్మాతలకుగాని మన ప్రభుత్వానికిగాని తెలియదని దీన్నిబట్టి సుస్పష్టం కావడంలేదా?

వాసన్ గారు ప్రేక్షకులకు నిర్మాతలకు మధ్య విమర్శకుడు లేకుండా వుంటే అడిగే వాడు — చెప్పేవాడు ఉండడుగదా, ఎన్ని మార్గాలైతే వున్నాయో వాటన్నిటిద్వారా లాభాలు గడిద్దాం, ఈ విమర్శకునితో పెద్ద బెడదగావుందని అనుకొని వుంటారు. మనం ఇంతవరకు వివరించినదాన్నిబట్టి సినిమాకళ యొక్క ప్రయోజనం వారిసౌకర్యంకోసం తప్ప మరెందుకూ గాదనే విషయం విశదమౌతున్నది. అయితే విమర్శకునిమీద ఆగ్రహపడడం తగనిపని.

వాసన్ గారు 'వినోదాన్ని' అందించడం సినిమాకళయొక్క పరమలక్ష్యం అని చెబుతున్నారు. అయితే వారు ఇవ్వదల్చుకున్న వినోదం ప్రజల నిత్యజీవితానికి సంబంధించినది కాదు. వారు యిచ్చే వినోదం కేవలం వారికి డబ్బు సంపాదించిపెట్టడానికే. అందుచేతనే వారు వినోదంలోకూడా మాకు నచ్చినట్టుగానే యిస్తాం నువ్వు ఎవరు మమ్మల్ని అడగడానికి అని మూడోరకం విమర్శకుని సవాలు చేస్తున్నారు.

ఈరకం విమర్శకుడు సినిమాల ప్రయోజనం విజ్ఞానం కాదు, వినోదమే నంటాడట. అంటే ఉత్తమ కళాఖండాలు సృష్టించడం నిర్మాతల లక్ష్యం కానేకాదని వాసన్ గారు ఘంటాపథంగా చెబుతుంటే ఈ విమర్శకుడు 'చిత్తం, చిత్తం' అంటాడన్నమాట. అయితే వారు అందించే వినోదంలో ఒక పద్ధతీ, ఒక స్థాయీ, ఒక అందం, టెంపో, కథాసంవిధానం ఉండఖ్ఖర్లేదా అని ప్రాధేయపూర్వకంగా అడుగుతాడట. అర్థంపర్థం లేకుండా ఈ కత్తియుద్ధాలు, సర్కసులు, నాట్యాలు, కుస్తీలు, ఈ హంగామా అంతా ఏమిటి! లలితా, పద్మిని, వైజయంతీమాల వీరేనా మన ఉత్తమ నటీమణులు! అని నివ్వెరపోతాట్ట! అప్పుడు వాసన్ గారు నీకు బొత్తిగా ఏమీ తెలియదులాగుంది అయితే మా నిర్మాతల ఏకైకలక్ష్యాన్ని వివరిస్తాను, సావధానంగా విను అంటారట:

మా చిత్రాన్ని లక్షలమంది వచ్చి చూడాలి. మేము మార్కెట్టులో నిలిచేట్టు చేయండి; మేము సర్కసులు, కుస్తీలు, నాట్యాలు, వివిధభంగిమల్లో పెద్ద క్లోజప్సులో తారలను తనివితీరా చూపెడతాం; అంతేగాని గొప్ప కథను సృష్టించడం మా పనికాదు. బ్రహ్మాండమైన ప్లాటు తీయడం మా కార్యక్రమమే కాదు మేము ఏదో కొంత వినోదాన్ని బట్వాడా చేస్తాం, వచ్చిచూడండి, ఆలోచించకండి; ఇలాంటి సినిమాకు ఒట్టి పుణ్యాన్నే డబ్బు దండగ పెట్టామే అనుకోకండి, అసలు ఆలోచించవద్దు!

తారలను తనివితీరా చూసేట్టు చేయడం, ప్రతిఫలంగా ప్రజలు వారికి డబ్బుకుమ్మేట్టు చేయడం, మనుషుల్లో పశువృత్తిని రేకెత్తించడం — ఇదేనా మీరు అందించే వినోదం??? అయితే వాసన్ గారు తమిళంలోను హిందీలోను తీసిన "సంసారం"లో వారు చెప్పిన నాట్యాలు ఈ ఆర్భాటాలు కుస్తీలు ఈ హంగామా హడావుడీ లేకపోయినా ప్రజాదరణ పొందిందిగదా! కానీ మరోకనిర్మాత ఈ చిత్రాన్ని తీయక మునుపైతే ఇలాంటి చిత్రాలవల్ల డబ్బు రాదని,

> మేష్టరు: నా పుట్టినరోజుకు శెలవు ఇవ్వకుండా, గాంధీ పుట్టినరోజున బడికి శెలవుఇస్తా రెందుకని?
>
> కుఱ్ఱవాడు: ఆయన అబద్ధాలు చెప్పలేదు గనుక.
>
> * * *
>
> యువతి: ఎవరి జీతంలో అయితే ఎక్కువ సున్నాలుంటాయో వార్ని పెళ్ళాడలని వుంది.
>
> యువకుడు: నా వన్నీ సున్నాలే.
>
> —వల్లూరి రామారావు, బందరు.

వీటిలో వినోదం లేదని వాసన్ గారు అనేవారేమో!

దీన్నిబట్టి వారు ఉత్తమకళా చిత్రాలను నిర్మించకపోగా, ప్రజలకు విజ్ఞానం కల్గించకపోగా, వినోదం పేరిట సంఘ జీవితాన్ని అధోగతిపాల్జేయడమే, సినిమా కళావిశిష్టతను, దాని ప్రయోజనాన్ని చెడుమార్గాల పట్టించడమే — ధనార్జనే వారి ఏకైకలక్ష్యమని మనకు సులభగ్రాహ్యమౌతుంది. అందుచేతనే దేశశ్రేయస్సుకూ సినిమా కళకూ అపారనష్టంకల్గినా సరకు చేయకుండా సినిమాసాధనంద్వారాడబ్బుసంపాదనేవృత్తిగా పెట్టుకున్న నిర్మాతలకు విమర్శకుడంటే కంటకప్రాయంగా వుంటుంది. ఐతే నిర్మాతలు ఏ రకంగాను విమర్శకులను బుట్టలో వేసుకోలేరు. తన మంచికోరైనా నిర్మాత ఈ విషయాన్ని గమనించాల్సి వుంటుంది.

అయితే ఇన్నాళ్ళూ సినిమాకళ అభివృద్ధి చెందుతూవచ్చిందంటే దానికి కారణం వ్యాపారదృష్టే పరమలక్ష్యంగా పెట్టుకున్న నిర్మాతలవల్ల కాదని మనకు తెలుసు. తతిమా నిర్మాతలుగూడా ఇట్లాంటి సంకుచిత దృష్టినే కలిగివున్నట్లయితే, అసలు సినిమాకళకేగాక వారి వ్యాపారానికి కూడా ప్రమాదం కలుగుతుందనే విషయంలో సందేహంలేదు. అందుచేత, మన నిర్మాతలందరూ ప్రేక్షకుల అభిరుచిని గుర్తించి, దేశశ్రేయస్సుకు దోహదంచేసే ఉత్తమచిత్రాలు నిర్మించడానికి ప్రయత్నిస్తారని, తద్వారా ప్రజాదరణపొంది వారి వ్యాపారాన్ని కూడా అభివృద్ధి చేసుకుంటారని ఆశిస్తున్నాను. ★

ఫిలింనిర్మాత - విమర్శకుడు

★

కోనే సర్వేశ్వరరావు (కళాసమితి)

13-1-54 ఆంధ్ర (వార) పత్రిక, సంక్రాంతి సంచికలో "సినిమాకళ వినోద సాధనం" - అనే శీర్షిక క్రింద ఎస్. ఎస్. వాసన్ (జెమినీ) గారి వ్యాసం చదివాక విమర్శకునిగా యీ వ్యాసం వ్రాయవలసి వచ్చింది. కనుక దీనిని ప్రకటించి విమర్శకులకు కూడా న్యాయం కలిగిస్తారని ఆశిస్తున్నాను...

మానవ హితకార్యంకోసం స్కాండినేవియన్ కోటీశ్వరుడు ప్రేలుడుమందు కనిపెట్టాడు. కాని ఆయన భావం తారుమారై ఆ ప్రేలుడుమందు యుద్ధకాలంలో సోదర మానవ మారణహోమంకోసం ఉపయోగపడుతోంది. అందుచేత ప్రేలుడు మందు కనిపెట్టి ఈ మహాపాపం చేశానని పశ్చాత్తాపపడి దానికి ప్రాయశ్చిత్తంగా శాంతి, ఆరోగ్యం, సారస్వతం మున్నగు వాటి అభివృద్ధికొరకు పాటుపడేవారికి తన ఆస్తిని బహుమతులుగా పంచిపెట్టమని ఆదేశించాడు, అంటూ దీనికి ఉదాహరణ చూపుతూకూడా వాసన్ గారు అందులోని నిజాన్ని గ్రహించక ఆవిధంగా విమర్శకులను చులకన చెయ్యటం న్యాయంకాదు.

వాసన్ గారు రచనాకళ గురించి వ్రాస్తూ చవకబారు నవలల ముద్రణగురించి చూపుతున్న సహనభావమే సినిమాలపట్ల కూడ చూపాలన్నారు. రచనాకళ అంటే కేవలం పెద్దపెద్ద మతగ్రంథాలలో మాత్రమే కనిపించేదికాదు. సామాన్యమైన ఉత్తమ సారస్వతము కూడా రచనాకళలోనే చేర్తుంది. కాని రచనాకళ పేరుతో చవకబారు నవలల్నే గాక పెద్దపెద్ద గ్రంథాలనైనా కూడా మానవసంఘానికి హాని కలిగించేవిగా వున్నట్లయితే నిర్దాక్షిణ్యంగా అణచివేయవలసి వుంటుంది.

ఈ విషయాన్ని వాసన్ గారు కాదనగలరా? అయితే సినిమాల విషయంలో కొందరు సమర్థులైన అధికారులు ముందే చూసి బహిరంగంగా ప్రదర్శించవచ్చునని సర్టిఫికెట్టు యిస్తారుకదా అంటారు వాసన్ గారు.

మనము సంపూర్ణ స్వాతంత్ర్యము పొంది కొద్దికాలమే అయింది. అందుచేత ప్రభుత్వము ప్రజలలోనుంచి బాగా వత్తిడి వచ్చే వరకు పరిశ్రమాధిపతులపై కఠినముగా ప్రవర్తించటానికి వెనుకంజవేయటం సహజం. అంతమాత్రాన్న విమర్శకులు తమ న్యాయదృష్టిని విడిచిపెట్టి మానవసంఘానికి ద్రోహం తల పెట్టలేరు.

కేవలం నాల్గు ఉద్రేకపరచే సీనులను అత్యంత అభివృద్ధిగాంచిన యీనాటి టెక్నిక్ తో కడురమ్యంగా తీస్తూ మానవ హృదయాలను పెడత్రోవల పట్టించి కొందరు నిర్మాతలు ధనం దోచుకొనమాస్తున్నారు. కాని యీ అక్రమాన్ని విమర్శకులు అడ్డుకుంటూ వుంటే వాళ్ళకు సరియైన సమాధానము చెప్పలేక, ఉత్తమ చిత్రాలకు టిక్కట్లు పూర్తిగా అమ్మడుపోతాయని గ్యారంటీ యిమ్మంటారు. అయితే మీ టిక్కట్లు పూర్తిగా అమ్మడుపోయేందుకుగాను భారతీయ సాంప్రదాయానికి విరుద్ధకరమైన యీనాటి తక్కువ రకం చిత్రాలను ప్రోత్సహించి, భారతీయ సంప్రదాయానికి, కళంకము కలిగించమంటారా? - ఈ విషయంలో విమర్శకుని మీరు యెంత చులకన చేసినా నిష్ప్రయోజనము.

విద్యా చిత్రాలనుగురించి వాసన్ గారు చెప్పినదాంట్లో అర్థంలేదు ఆ విద్యా చిత్రాలద్వారా స్వతంత్ర భారతదేశపు సంస్కృతి తెలుసుకుంటూ ప్రపంచం యెంతో ఆశ్చర్యపోతూవుంది.

ఈనాటి మన ఫిల్ము నిర్మాతల చిత్రాలు చూచి విదేశీయులు నవ్వుకుంటూ "ఆవారా"లో చూపిన కొన్ని దృశ్యాలు భారతదేశం అంతా తిరిగినా తమకు కనిపించలేదన్నారు. ఇట్టి చెత్త చిత్రాలను వెనకవేసుకుని వాసన్ గారు విద్యా చిత్రాలను విమర్శించడం వివేక మనిపించుకుంటుందా?

ఫిల్ము నిర్మాతలను విమర్శకులు కోరేది ఉత్తమ నీతివంతమైన, భారతీయ సంప్రదాయానికి సంబంధించిన, కథలను తీయమనే. ఈ విషయంలో న్యూ థియేటర్సు వంటివారి చిత్రాలను అనుసరించి వాళ్ళవలె కళాకారుల కర్తవ్యం, డబ్బు విలువ గమనించండి. అంతేగాని నగ్నదృశ్యాలు, కౌగలింతలు వంటి దృశ్యాలతో అర్థంలేని కథలు కలిపించి వినోదము పేరుతో ప్రేక్షకులను మభ్యపెట్టి డబ్బు గుంజుకుందామనే దురాశ వదలిపెట్టమని. లేకపోతే యిట్టి ఆటలను విమర్శకులు సాగనివ్వటం దుమ్మాటికీ కల్ల.

ఫిల్ము పరిశ్రమ కేవలం వాసన్ గారు చెప్పినట్లు యిట్టి చవకబారు వినోదము కొరకు సృష్టించబడలేదు. వివిధ లలితకళల ద్వారా మానవాభ్యున్నతికి ఆదర్శవంతమైన నీతి సంఘటనలను అతిసునాయాసంగా ప్రేక్షకులముందు ప్రదర్శింపచేస్తూ మానవ సంఘానికి ఉత్తమ హితబోధ చేయటానికి ఫిల్ముపరిశ్రమ ఒక అత్యంత ఉత్తమ సాధనం. ★

★ సినిమా వార్తలు ★

భరణీవారి "చక్రపాణి" షూటింగ్ త్వరలో పూర్తికానున్నది. మార్చి నెలలో విడుదల చేస్తారట. ఈ ఏడాది చిత్రాలన్నీ త్వరత్వరగా తయారయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. వాటిలో "చక్రపాణి"ఒకటి అని చెప్పవచ్చును. హాస్యరసభరితమైన యీ చిత్రంలో భానుమతి, నాగేశ్వరరావులు తిరిగి కలిసి నటిస్తున్నారు. మిగతా పాత్రధారులు సి. ఎస్. ఆర్., సూర్యకాంతం, అమరనాథ్, డా॥ శివరామకృష్ణయ్య, టి. జి. కమలాదేవి, ఛాయాదేవి, వెంకుమాంబ, రమణారెడ్డి, వంగర వెంకటసుబ్బయ్య, చంద్రశేఖర్ మున్నగువారు. దర్శకుడు రామకృష్ణ; కథ, సంభాషణలు, పాటలు రావూరి సత్యనారాయణ; స్టూడియో భరణి.


* * *

క్రిందటి సంవత్సరం బ్రిటన్‌లో తయారైన "కాంక్వెస్ట్ ఆఫ్ ఎవరెస్ట్" (ఎవరెస్టు ఆరోహణం) త్వరలో మనదేశంలో విడుదల కానున్నది. హిందీ, బెంగాలీ, తమిళ భాషల్లో కామెంటరీలు తయారు చేయబడి రికార్డుకూడా అయినాయట. ★

తల్లి పిల్లవాడిచేతిలో ఒక బెల్లంముక్క పెట్టి, "అబ్బాయి! వెళ్లి మనపంచలో వడ్లు దంచుతున్నారే వాళ్లతో బియ్యం తెల్లగా వేయమని చెప్పిరా. ఏం? ఏమని చెబుతావ్.

పిల్లవాడు: బెల్లం తియ్యగా వేయమని చెబుతా.

. —జి. వి. జి. కృష్ణ, మద్రాసు.



రాజ్ కపూర్స్ "బూట్ పాలిష్"లో ఒకదృశ్యం.

జయంతీవారి "బంగారుభూమి"లో టి. ఆర్. రామచంద్రన్, అంజలీదేవి.





"ప్రిజనర్ ఆఫ్ గోల్కొండ"లో ప్రేమ్‌నాథ్, శోభనాసమర్థ.

గోకుల్ చిత్ర వారి "నిరుపేదలు"లో ఎ. నాగేశ్వరరావు, ఆర్. నాగేశ్వరరావు, కుటుంబరావు.



రూపురేఖలు, వేషభాషలు

లలిత కొత్వాల్

ఎప్పుడప్పుడూ మనం కొందర్ని గురించి అనుకుంటూ ఉంటాం! 'ఆవిడ పార్వతీదేవిలా ఉంది సుమా!' 'ఆ అమ్మాయి ముఖంలో లక్ష్మీదేవికళ ఉట్టిపడుతోంది.' 'ఆయన స్వభావం బహు సరళం' 'ఆమె హుందా చూడండి. మాటతీరులో నాజూకుతనం ఉంది' 'ఆయన అతి గంభీరుడు.'

ఇవన్నీ 'విశిష్టత'కు (*Personality*) లక్షణాలు. నిజానికి 'విశిష్టత' అంటే మరికొన్ని ముఖ్యలక్షణాల్ని బట్టి నిర్ణయించి చెప్పుకోవాలి.

ప్రతిమనిషీ తన బంధుమిత్రాదులవద్ద చాల లక్షణాలు అలవర్చుకుంటాడు. కొన్ని లక్షణాలు స్వతహా పెంపొందించుకుంటాడు. ఈ రెండింటి సమన్వయంవల్ల ఏర్పడే సమగ్ర స్వరూపమే 'విశిష్టత,' లేక పెర్సనాలిటి.

గబగబా రెండు మెతుకులు ముక్కునోటా కుక్కుకుని ఆఫీసుకి పరిగెత్తి అలసిపోయి రాత్రి ఇంటికివచ్చి సహించీ సహించకుండా అన్నంతిని నిద్రలో పడిపోయే వాళ్లు, తెల్లవారకముందే లేచి భర్తకి ఆఫీసువేళకి వంట పూర్తిచెయ్యగలమో లేదో అని గంటకి పది మైళ్ళవేగంతో ఇల్లంతా కలయతిరిగి, పిల్లలకన్నీ సవరించలేక సతమతమాతూ అర్థాకలి అన్నం తింటూ ఇలా రోజంతా ఎముకలు విరుచుకు పనిచేసుకునే స్త్రీలు యంత్రాలలాగా జీవితం గడుపుతున్నవాళ్ళు అనేకులున్నారు. దైనందిన జీవితంలో అగులూ బొగులూ బ్రతుకులు పరుగులు తీయించేవాళ్ళలో ఈ విశిష్టత అనేది ఛిద్రమైపోయి, సుమారుగా అందరు ఒకే ధోరణిలో అగ్గిపెట్టెల దొంతర్లలాగా కనపడుతున్నారు.

ముందు ఒక మనిషిని చూడగానే పైపై లక్షణాల్ని బట్టి ఆ మనిషిని అంచనా వేస్తాం. ఆ పైలక్షణాల్లో గణనకి వచ్చే ముఖ్యమైనవి ఏవంటే: ఒడ్డూ, పొడుగూ, ఆకారం, చూపు, చాయ, నడకపద్ధతి, మాటతీరులో పరుషం, సరళం, సభ్యత, దుస్తులు. ఈ వ్యాసంలో ఆఖరి విషయాన్ని గురించిమాత్రం, అంటే వ్యక్తి విశిష్టతకి దుస్తులెలా ఉపకరిస్తాయో, అదిమాత్రం వివరిస్తాను.

మన దేశంలో అనాదిగా నిత్యజీవితంలో అన్నిటా నిరాడంబరమైనపద్ధతి అత్యుత్తమంగా పరిగణించబడుతోంది. మన సాంఘికజీవనంలోనే కానివ్వండి, వ్యక్తిగతంగా ఆత్మోన్నతికోసంచేసే కృషిలోనే కానివ్వండి నిరాడంబరత ప్రధానంఅనుకున్నారు. అంతమాత్రంచేత భాగ్యభోగాలు, విలాసాలు, ఆడంబరం బొత్తిగా లేవని చెప్పకూడదు. మనిషికీ మనిషికీ వ్యత్యాసం ఎలా ఉంటుందో, అలాగే నిరాడంబరత అంటే ఏమిటో ఆడంబరంఅంటేఏమిటో ఆఅభిప్రాయాల్లో కూడా వ్యత్యాసం ఉంటుంది. అందువల్ల మన దేశీయుల నిత్యజీవనంలో నిరాడంబరత అంటే నా అభిప్రాయం ఏమిటో ముందు వివరించడం అవసరం.

ఉదాహరణకి సామాన్య హిందూ వనిత దుస్తులసంగతే చెప్తాను. వాళ్లు సాదాచీర కట్టుకుంటారు, రవిక తొడుగుతారు. పొద్దుటయ్యేది, సాయంకాలమయేది, రాత్రయేది, పనివేళలోకాని తీరిగ్గా కూర్చునేవేళకాని, షికారుకి వెళ్లేటప్పుడు కాని అదే తరహా దుస్తులు ధరిస్తారు. యూరోపియన్ స్త్రీల మాదిరిగా అవసరానికొకవిధంగా రోజులో పలుమార్లు దుస్తులు మార్చుకునే బాధ ఉండదు. ప్రతిరోజూ పొద్దున్నే స్నానం చేసి మామూలుగా ఉతికి పొడి పాల్గొడుతున్న చీరలు కట్టుకుంటారు. దేహ పరిశుద్ధి అనేది భారతీయులు నేర్చుకునే మొట్ట మొదటిపాఠం – నలుగురిలోమసలడం ఆశ్లేచేతకాకపోయినా ఇప్పుడిప్పుడా మన లపెంలో మెలకువలుకూడా నేర్చుకుంటున్నారు.

భోజనం విషయంలో కూడా నిరాడంబరతే మనకి ముఖ్యం. కంచాలలోకాని, అరిటాకు, కుట్టుడాకుల్లోకాని తినేస్తాం. తరవాత ఆకైతే పారెయ్యవచ్చు. ఇంక తోముకోవలసిన సరుకు ఆట్టే ఉండదు. పాశ్చాత్యదేశాల్లో అయితే ప్లేట్లు, పింగాణీ గిన్నెలు, వగైరా కొండలల్లే పేరుకుపోతాయి.

ఇంక ఇళ్లమాట. పల్లెటూళ్లలో సామాన్య కుటుంబాల ఇళ్లు చిన్నవిగానే ఉంటాయి. నేలమీదేమీ పరచరు. పేడతోఅలికేసి సన్నముగ్గులు పెడతారు. కుర్చీలూ మేజాలూ ఆట్టే ఉండవు పాశ్చాత్యదేశాల్లో అయిదిళ్లు పట్టనంత కుర్చీ సామగ్రి ఉంటుంతే నేలమీద తివాసీలో ఏవో పరుస్తారు. అతి సామాన్య కుటుంబానిక్కూడా వంటింటి నిండా పాత్రసామగ్రి (అవీ పగిలిపోయేవి) ఉంటుంది. ఇలాగే మంచి చెడ్డలు అనేవి కూడా మనదేశంలోని మతాలలో సరళంగా నిష్కర్షగా ఋజువుగా నిర్ణయించుకుంటారు. సంశయాలకు తర్కాలకు ఆట్టే తావుండదు.

ఎప్పటికప్పుడు మన దేశంమీదికి విదేశీయుల దండయాత్రలు జరుగుతూవచ్చాయి. వాటితోపాటే ఎప్పటికప్పుడు కొత్త అలవాట్లు కొత్త పద్ధతులు, కొత్త అలంకారాలు దిగుమతవుతూ వచ్చాయి. పర్షియానుంచి 'సాల్వర్' వచ్చింది. బర్మానుంచి 'లుంగీ' వచ్చింది. ఇటీవల యూరప్ అమెరికాలనుంచి దిగుమతైనవి గౌనులు, పొట్టిలాగులు, ఈతకో సం దుస్తులు, స్వారి చెయ్యడానికి దుస్తులూ మొదలైనవి. వీటన్నిటితో కలిసి మన దేశంలో మిశ్రమ పద్ధతులు కొన్ని తయారైనాయి. ఈ కొత్త రకాల్లో భుజాల్లేని చోళీలు, వెన్నులేని రవికలు పొడుగు చేతుల కమీజులు వగైరా ఉన్నాయి. పాశ్చాత్య దేశాలవల్ల మనకు లభించిన ప్రసాదం (వికారం) ఎత్తుమడమ జోళ్ళు కూడా.

దుస్తులు వ్యక్తి రూపురేఖల్లో ఎలా ప్రతిబింబిస్తాయో గమనించవచ్చు. ఎప్పుడైనా సిపాయిని జాగ్రత్తగా గమనించండి. పకడ్బందీగా మిలిటరీ దుస్తులు ధరించి డ్యూటీలో ఉన్నప్పుడెల్లా ఉంటాడో, ఎల్లా ప్రవర్తిస్తాడో చూడండి; అతడే మామూలు దుస్తుల్లో, అంటే ముఫ్తీలో, డ్యూటీలో లేనప్పుడు ఎల్లా ఉంటాడో ఎల్లా ప్రవర్తిస్తాడో చూడండి. మార్పు స్పష్టంగా తెలిసిపోతుంది. అతడి నడకలో నిలబడ్డంలో, అడుగులు వెయ్యడంలో మాటతీరులో తేడా తెలుస్తుంది.

అలాగే నర్సుని గమనించినా ఆ దుస్తులు ధరించినప్పుడొకమాదిరిగా, చీరకట్టినప్పుడు మరొకమాదిరిగా ఉంటుంది. అలాగే మతాధికారులు, నటీనటులు, నౌకర్లు ఆఫీసర్లు రాజకీయ నాయకులు మొదలైనవారందరిలోనూ ఈ విచిత్రం కనపడుతుంది. వృత్తికి అవసరమైన నీటైన దుస్తులు ధరించినప్పుడొకలా ఉంటారు. మామూలుగా కాలక్షేపం చేస్తున్నప్పుడింకొకలా ఉంటారు.

అవిధంగా ఎవరిమట్టుకు వాళ్లే తమ ప్రవ

ర్తనలో మార్పులు కనిపెట్టుకోవచ్చు. ఇంటి దగ్గిర గూడ కట్టు బనీనుతో ఉన్నప్పుడో, (మామూలుగా ఉతికిన చీర ఉతికిన రవిక తొడుక్కొనిఉన్నప్పుడో) ఇంటిదగ్గిర గమనిస్తే ప్రవర్తనలో కొంచెం స్వేచ్ఛ, బద్ధకం వంటివి కనపడతాయి. అంటే దుస్తుల్ని బట్టి ప్రవర్తనలోకూడా కొద్దిమార్పు వస్తుందన్న మాట.

పదిమందినీ చూస్తే తెలుస్తుంది. మనుష్యుల ప్రవర్తనకీ దుస్తులకీ సంబంధం ఉందని. అది ఫలానా అని చూపించేవరకూ సామాన్యంగా మనం గమనించం.

పాశ్చాత్య వనితల్ని మన దేశపు స్త్రీలనీ పోల్చిచూస్తే నడక, తల, చేతులు కదపడం, మాట తీరు మొదలైన వాటిల్లో పోలికే కనపడదు.

బస్సు వెళ్ళిపోతోందని కంగారులో పరుగెత్తి ఎక్కాలనుకోండి. గౌను తొడుక్కున్న పాశ్చాత్యవనిత అయితే పెద్ద పెద్ద అంగలు వేస్తూ పరుగెత్తలేదు. నిటారుగా ఉన్న మెట్లు ఎక్కాలనుకోండి. గౌను మోకాటి పైకి లాక్కుంటే కాని పై మెట్టుమీద అడుగెయ్యడం కష్టం. సెల్వార్ (పంజాబీలు ధరించే లాగు) కమీజు ధరించినవాళ్ళకలాటి చిక్కు ఉండదు.

సాయంకాలవేళ పాదాలవరకూ వేలాడే వొదులు గౌన్లు తొడుక్కున్నప్పుడు పాశ్చాత్య స్త్రీలని చూస్తే బహు సొగసుగా విలాసంగా ఉల్లాసంగా కనపడతారు. వాళ్ళ సాయంకాలపు దుస్తుల్లో మాత్రమే, చీరతో కొన్ని పోలికలు కనిపిస్తాయి. ఆమడతలూ పాదాలవద్ద వయ్యారంగా ఊగులాడుతుంటే చూడ ముచ్చటేస్తుంది. అటువంటి దుస్తులే కొంతలకి సహజంగా అందాన్నిస్తాయి.

దుస్తుల్ని బట్టి మతం, జాతి, తరగతి తేలిగ్గా తెలుసుకోవచ్చు. దుస్తులతో ఠీవి, దర్పంకూడా వస్తాయి.

ఫేషన్ అంటే పాశ్చాత్యదేశాల్లో విపరీతమైన మోజుంది. ఫేషన్స్‌లో కొత్త కొత్తవి చూపించగలిగేవాళ్ళకి సమాజంలో గొప్ప ఆదరం గౌరవం లభిస్తాయని ఇద్దరు ప్రసిద్ధ మానసికశాస్త్రజ్ఞులు చెప్పారు.

అంతేకాదు. పాశ్చాత్యదేశాల్లో సమాజంలో పెద్ద హోదా కలవాళ్ళు ఏ ఫేషన్ మొదలుపెడితే, ఆ ఫేషన్‌కికూడా హోదా వచ్చేస్తుంది. ఆ ఫేషన్ల దుస్తులు తయారుచేసే షాపులు, అమ్మే షాపులికికూడా ప్రచారం ఎక్కువవుతుంది.

ఒక ఫేషన్ ప్రచారంలోకివచ్చి విరివిగా వ్యాపించేసరికి పాతబడిపోవడం జరుగుతుంది. ఫేషన్లు తరుచు మార్చుకుంటూపోతే వ్యక్తివిశిష్టతకి కొంత భంగం కలగవచ్చు. తరుచు మారిపోయేది విశిష్టత అనిపించుకోదు. ఇది పాశ్చాత్య దేశాల్లో అనుభవమౌతున్న విషయం.

మృగజాలంలో మగ జంతువులు ఆడ జంతువుల కంటె అందంగానూ ఆడంబరంగాను ఉంటాయి. మనుష్యుల్లో కూడా నూరేళ్ళ క్రితంవరకూ ఇలాగే ఉండేది. ముఖ్యంగా పాశ్చాత్యదేశాల్లో. కాలం గడుస్తున్నకొద్దీ, ఆర్థికపరిస్థితులు మారుతున్నకొద్దీ అభిరుచులూ మారుతున్నాయి. శరీరాకారాల్ని బట్టి, బుద్ధివికాసాల్ని బట్టీ ఫేషన్లు మారతాయి. లేదా అర్థంలేని అనుకరణలు సాగుతాయి.


ఇంగ్లండులో ఆరంభమై మిగిలిన పాశ్చాత్య దేశాల్లోకి పాకిన స్త్రీల వోటింగ్ హక్కుల ఉద్యమం వల్ల స్త్రీల అభిరుచుల్లో పెద్ద మార్పు వచ్చింది. స్త్రీల ఆర్థిక పరిస్థితులు, సామాజిక స్థితీ మారడంతో మిగిలిన అభిరుచులతో పాటే దుస్తుల ఫేషన్లలోకూడా కొన్ని ముఖ్యమైన మార్పులు వచ్చాయి. మగవాళ్ళ దుస్తుల్లో ఆడంబరం తక్కువైంది. ఆడవాళ్ళ దుస్తుల్లో ఆడంబరం రంగులూ ఎక్కువైనాయి. పురుషుల ఫేషన్లలో మార్పు అనేది చల్లబడితే స్త్రీల ఫేషన్లలో మార్పు అనేది ఉధృతమయింది.

ఇక్కడో హెచ్చరిక ఇవ్వాలి. ఖరీదూ ఆడంబరం ఎక్కువైతేనేగాని దుస్తుల్లో చక్కగా కనపడలేమని చాలమంది అనుకుంటారు. అది పొరపాటు, నిరాడంబరత, రంగుల్లో నాజూకుతనం, ఆభరణాల్లో ఔచిత్యం గమనించినప్పుడే చక్కదనం కనపడుతుంది. ఆడంబరం అట్టేలేక, సామాన్యమైన చీర సామాన్యమైన రవిక ధరించి కొద్ది ఆభరణాలు పెట్టుకున్నవాళ్ళని చూస్తే తప్పకుండా గౌరవించాలని అందరికీ అనిపిస్తుంది. ★

పోలీసువాని భార్య: ఇంట్లో దొంగలు పడ్డట్టున్నారు చూడండి.

పోలీసు: నేను డ్యూటీలో లేనే!

—వల్లూరి రామారావు, బందరు.



యోగాసనములు-దేహారోగ్యము

4. బద్ధకోణాసనములు

మూడవవ్యాసములో చెప్పబడిన పదహారు ప్రధాన కీలకస్థానములయందు ఏర్పడు సమ త్రికోణములను బంధించి, మాంస పిండములను కోశములను పరిశుద్ధిచేయ గల బద్ధకోణాసనములు ఈ వ్యాసమునందు వివరింపబడును


రానురాను జనులలో రక్తపుపోట్లు (హైబ్లడ్ ప్రెషర్, లోబ్లడ్ ప్రెషర్) విరివిగా వ్యాపిస్తున్నాయి. వాటి నివారణ మహాముద్రవలన సాధ్యమగును. కాని మలబద్ధము, మూత్రకృచ్ఛ్రము (డయాబెటిస్) లను పోగొట్టుటకు బద్ధకోణాసనము బ్రహ్మాస్త్రమువంటిది.


మొట్టమొదట మనశ్చాంచల్యమును పోగుట్టు యోగాంగాసనములు చేయుటవసరము. మనోవ్యాపార దౌష్ట్యము ఆయుస్సును, ఆరోగ్యమును, బలమును, బుద్ధి బలమును, నాశముచేయును. అసలు అన్నిరోగములకునూ మనశ్చాంచల్యమే మూలకారణము. కనుకనే శ్రీ భగవత్పతంజలి మహర్షులు "యోగశ్చిత్తవృత్తినిరోధః" అని (పా. ద. 1 పా 2 సూత్రములో) బోధించినారు. అనగా చిత్తచాంచల్యమును పోగొట్టుటదే యోగము అని బోధించినారు. మనశ్చాంచల్యమునకు మూలకారణములు ఆహారదోషములే కాని మరేవిషయముకావు. గొప్ప గొప్ప వైద్యులుకూడ నేడీసత్యమును అంగీకరించకున్నను కొంతకాలము తరువాతనైనను ఒప్పుకొనగలరు. ఆహార శుద్ధిచేతనే మనస్సునకువీకాగ్రతచేకూరి స్థిరము కాగలదు; బుద్ధివికాసము చెందగలదు. ఆహారశుద్ధి

శ్రీ టి. కృష్ణమాచారి

చేతనే అకాల మరణములు, రోగములు నివారింపబడగలవు. అయితే ఆహారశుద్ధితోపాటు యుక్తములైన ప్రాణాయామములను నిరంతర మభ్యసించుటవసరము. "చలేవాతే చలంచిత్తం నిశ్చలే నిశ్చలం భవేత్ | యో మనస్సు స్థిరీభావః సైవావస్థామనోన్మనీ." 'ఎంతవరకు మనశ్వాసకోశ హృదయాకాశములలోని వాయువు (ప్రాణవాయువు) ఉబ్బసము మొదలైన రోగబాధలవలనైనా అతివేగముతో సంచలించునో, అంతవరకూ మనస్సు ఏకాగ్రత స్థిరభావములను పొందజాలదు. ఆ రోగము నివారించబడిన తరువాత క్రమక్రమముగా మనస్సునకు ఏకాగ్ర స్థిరభావములు ఆపైన శాంతియు లభించగలవు' అని సూత్రభావము. ప్రాణవాయువు పైకి ఉబికి రాకుండ నిలుపగలిగినయెడల ఇంద్రియములన్నియు స్వాధీనములోనికివచ్చును. ఆపైన రోగము లంటజాలవు. "అన్నమయంహి సౌమ్యమనః ఆపోమయః ప్రాణః తేజోమయీ వాక్; ఆహారశుద్ధౌ సత్యశుద్ధిః సత్వశుద్ధౌ ధృవాస్మృతిః" అనగా 'మానవుల మనోవ్యాకులత, స్థైర్యము అనునవి వారు

నిత్యమూ భుజించు అన్నముపైన ఆధారపడియుండును. ఎట్టి ఆహారమును భుజింతురో, అట్టి మనో వైలక్షణ్యము కలుగును. మానవులలోనే పశు పక్షి మృగాదుల మాంసములను భుజించువారినీ, సస్య ధాన్య శాకాదులనుమాత్రము భుజించువారినీ వారి వారి మనో వ్యాపారములను గమనించి అప్పుడు ఆహారమును నిర్ణయించుకొనవచ్చును. అట్లే వారువారు సేవించు పాలు,





బద్ధకోణాసనము

నెయ్యి, నీరు మొదలైనవానిపైన ప్రాణ వాయు సంచలనము ఆధారపడియుండును.' అని తాత్పర్యము. ఇట్లని ఉద్దాలకుడను ఋషి తన పుత్రుడైన శ్వేతకేతువునకు చెప్పి, ఆహారమునకూ, మనస్సునకూ గల కార్యకారణ సంబంధమును ప్రత్యక్ష ప్రదర్శనములతో సహా నిరూపించినాడు. ఛాందోగ్యోపనిషత్తు ఆరవ ప్రపాఠకమునందు ఈ వివరములు చదువవచ్చును.

ప్రకృతవిషయము రక్తపుపోటు. ఇది ఆహారదోషముచేత నే వచ్చును. బలము కలిగించునవీ మితిమీరినవీ ఆహారపదార్థములు తిన్నప్పుడు అవి అరుగకున్ననూ, అరిగినప్పటికీ సరియైన అంగసాధన లేకున్ననూ, అంగసాధన ఉండికూడా ఇంద్రియజయము లేకున్ననూ ఈ రక్తపుపోటు జనించును. ఏవయస్సులో రక్తసంచారము ఎంత వేగములో నుండవలెనో అంతకంటె ఎక్కువ గాని తక్కువగాని ఉండుట రక్తపుపోటు. ఇది రోగలక్షణమని నేటి వైద్యులేగాక అనేకవేలయేండ్లక్రిందట మన ప్రాచీనులు కూడ నిర్ణయించి యున్నారు. ఇది క్రొత్తదని, పాశ్చాత్యులే దీనిని క్రొత్తగా కనిపెట్టినారనీ భావించుట పొరబాటు. మన పూర్వులు నాడీ చలనమునుబట్టి నిర్ణయించు ఈరోగము నిమిత్తము పాశ్చాత్యులు యంత్రము నొకదానిని నిర్మించుకొనిరి. రక్తసంచారవేగము తక్కువగా ఉండుట రోగమగునో కాదో పాశ్చాత్యవైద్యులింకనూ అభిప్రాయ భేదములతోనే యున్నారు. మనపూర్వులు అదికూడా రోగమని నిర్ణయించినారు. పాశ్చాత్యులీరోగమునకుగాను రక్త సంచారవేగమును కొలిచి ఔషధములనో, సూదిపోట్లనో (ఇంజక్షన్లు) ఇచ్చుచున్నారు. కాని అట్టి చికిత్సవలని ఫలాఫలములు నాకింకనూ నిర్ధారణగా తెలియలేదు.

రక్తప్రవాహము తీవ్రమగుటకు, మందమగుటకు అనేక కారణములుండును. అధిక పరిశ్రమ, విపరీత వ్యాయామము, విషమ సన్నిపాతాది జ్వరములు, స్త్రీ వ్యసనము మొదలగువానిచే రక్త సంచారము తీవ్రమగును. మన అకృత్యములవల్ల రక్తము ఉగ్రగతిని పొందినప్పుడు సామాన్యముగా నిమిషమునకు 90 మొదలు 100 వరకూ హృదయ స్పందనము హెచ్చును. ఆరోగ్యవంతులకు ఆయా వయస్సులనుబట్టి నిమిషమునకు 68 - 70 - 72 - 78 కి మించి ఉండదు. ఉండకూడదు. జ్వరాదులు వచ్చినప్పుడు నాడీగతి ఇంతకంటె అధికమగును. అంతమాత్రమున రక్తపుపోటు వచ్చినదని భావించి చికిత్స చేయుట ప్రమాదకరము.

హృదయ స్పందనము, నాడి, వీనినిబట్టి రక్తసంచారమును యోగాభ్యాసులు నిర్ణయించగలిగినట్లు పాశ్చాత్యుల యంత్రములు చేయజాలవు. ఈ విషయమును 1937 లో పాశ్చాత్య వైద్యనిపుణులు కొందరు (ఫ్రాన్సు, అమెరికా, జర్మనీ, ఇంగ్లండ్ దేశాల నిపుణులు) నావద్దకు (మైసూరు) వచ్చి నన్ను పరీక్షించి అంగీకరించినారు. విద్యుత్ యంత్రములతో నా శరీరమును ఎనిమిది దినములు పరీక్షించి రికార్డు చేసుకొని ఈ క్రింది అభిప్రాయము నిచ్చినారు.

We wish to record here our indebtedness to Mr. Krishnamacharya for the very kind help he has given us in our research work. We came here to record with delicate instruments of measure the action of the will upon the respiratory and circulatory functions. Mr. Krishnamacharya submitted himself to the condition of the experiments, and more than satisfied our expectations. In fact not only has he proved beyond possibility of doubt that both the mechanic and the electrical action of the heart could be modified at will, which the West does not consider possible, but he has enabled us to lay the foundations for a deeper analysis of the Yogic states than we foresaw.

Our heartfelt gratitude remains with him and with his helpers.

Sd/- Prof. J. R. Marcault.
Retired Prof. of Psychology,
4 Square Rapp.
Paris (F) France.

Sd/- Docteur Therse Brosse,
29, Bowevard Bazin,
Royat, France.

అనగా

"మా పరిశోధనలకు శ్రీ కృష్ణమాచార్యగారు మా కొనర్చినసహాయమునకు మేమెంతయు ఋణపడి యున్నాము. సునిశితము సూక్ష్మములైనయంత్రములను తెచ్చి, మానవ సంకల్పబలమునకు మానవుల శ్వాసగతి రక్త ప్రవాహములపై నెంత యధికారముండునో పరిశోధించుటకు ఇక్కడకు వచ్చినాము. ఆ పరిశోధనలకు శ్రీ కృష్ణమాచార్యగారు సమ్మతించి మాకత్యంత సంతృప్తి కలిగించినారు. హృదయముయొక్క యాంత్రిక, విద్యుద్వర్తనలను సంకల్ప బలముచేత మార్చవచ్చునని పాశ్చాత్యులు నమ్మలేకున్నట్టి విషయమును వారు మాకెట్టి సంశయము లేకుండ నిరూపించినారు. ముందూహించినప్పటికంటె ఇప్పుడు యోగసిద్ధినిగురించిన పరిశోధనలలో మేము ఇతోధిక కృషి సల్పుటకు వారు పునాది కూడా వేసినవారైనారు. వారికి మా హృదయపూర్వకమైన కృతజ్ఞత ప్రకటించుచున్నాము. — ప్రొఫెసర్. జె. ఆర్. మర్కాల్ట్, రిటైర్డ్ ప్రొఫెసర్ ఆఫ్ సైకాలజీ, (ఫ్రాన్సు) డాక్టర్ మిసస్ థరోస్ బ్రాస్ (ఫ్రాన్సు)"

ఇదిగాక ఇచ్చట మద్రాసులోనే కొందరు తరుణులు, వృద్ధులు నావద్ద యోగశాస్త్రసరణిని అభ్యసించి రక్తరోగములకు ఎట్టి ఔషధసేవతోనూ నిమిత్తము లేకనే చికిత్సబొంది దేవునిదయచేత ఆరోగ్యమును పొందినారు.

రక్తసంచారము హెచ్చుతగ్గులను వైద్యులు నిర్ణయించు పద్ధతి, యోగశాస్త్రము నిర్ణయించినపద్ధతి వేర్వేరుగా నున్నవి.

★ యోగాసనములు - దేహారోగ్యము ★

సంచారము, సంచలనము, గతి అను నీ మూడునూ విభిన్న క్రియలు. బాహ్యప్రపంచమున నీ మూడును వివిధముగ నున్ననూ మన శరీరములో మాత్రము వేర్వేరు స్థానములలో నివి పనిచేయుచుండును.

సంచార మనునది రక్తప్రవాహమునకు వర్తించును. సంచలన మనునది మనస్సునకు వర్తించును. గతి యనునది శ్వాసకోశమందునూ, ధమనులలోనూ పని చేయు ప్రాణాది వాయువులు పదింటికి వర్తించును.

ఈ క్రియలు వాయువుయొక్క సహజ ధర్మము లనునది నిర్వివాదాంశము. వాయు సంబంధము లేని దేదీ కదలదు. ఆ వాయువు వేగమై వీచినప్పుడు దానితో సంబంధించిన వస్తువులు వేగముగా కదలును. వేగము తక్కువైనప్పుడు మెల్లిగా కదలును.

మన శరీరములోని ప్రాణవాయువు కూడా గాలి తప్ప వేరు కాదు. అయితే బయట వ్యాపించిన గాలికి, శరీరములో ప్రవేశించు ప్రాణవాయువు అత్యంత భిన్నమైనది. అంతే కాదు. ఈ ప్రాణవాయువునకు ఆశ్చర్యకరమైన శక్తి క్రియాదులు కలవు. "న వాయుక్రియే పృథగుపదేశాత్" అను బ్రహ్మసూత్రమునం దట్లు చెప్పబడినది.

ప్రాణవాయువు తన నివాసస్థానమైన హృదయమును, శ్వాసకోశమును ఒకసారి వదలిపెట్టినతరువాత (అనగా మనిషి మృతిచెందినప్పుడు) బైట ఎంత వాయుచలన మున్ననూ శరీరము చలించదు; పలుకు, అంగచలనము లుండవు.

హృద్గతమైయుండు ప్రాణవాయువు బైటనుండు వాయువులోని విషములను నశింపజేయు శక్తికలది. ఆ ప్రాణవాయువు రక్తనాళములలో రక్తముతో చేరినప్పుడే యుక్తగతిని పొంది, వయోనుగుణమైన సంచారమును రక్తమున వచ్చును. అప్పుడు నాడీగతి ఆయా వయస్సులలో 60 - 62 - 64 68 - 70 - 72 - 78 ఉండును. అది ఆరోగ్యస్థితి. ప్రాణవాయువున కట్టి శక్తి తగ్గినప్పుడే రక్త సంచారములో హెచ్చుతగ్గులు సంభవించును. అనారోగ్యస్థితిలో నాడీగతి నిమిషమునకు 55 - 60 - 80 - 88 - 90 - 100 వరకూ ఉండును. కొందరికి నాడి నిమిషమునకు 120 పర్యాయములు కొట్టుకొనుటకూడా చూచుచుందుము.

ప్రాణవాయువుయొక్క ఆఘాతము చేత రక్తప్రవాహవేగము అధికమైనప్పుడు కలుగు బాధలు వర్ణనాతీతము. శ్వాసకోశములలో ఉబ్బి ప్రాణవాయువు రక్తనాళములలో కల ఇరుప్రక్కలకూ ఒరసికొని ఒత్తిడియిచ్చును. రక్తనాళము లకుపించును. బలవంతమున నాళములలోనుండి రక్తము స్రోయును. ఇందుకు కారణము అజీర్ణము వలన అపానవాయువు ఉద్రిక్తమగుట తప్ప మరొకటి కాదు.

ఈ వ్యాధి ఎవరికైననూ రావచ్చును. కాని సుఖలోలురైనవారికే సంక్రమించుట సామాన్యము. శరీరమును కొంచెమైనా పరిశ్రమ చేయనీయక ఎల్లప్పుడూ సుఖమునే పొందగోరువారిలో ఇది విరివి. "యావజ్జీవం సుఖంజీవేత్ ఋణం కృత్వా ఘృతం పిబేత్। భస్మీభూతస్య దేహస్య పునరాగమనం కుతః?" అనగా 'చేతులూ కాళ్ళు కదలుచున్న వరకు సుఖముగా జీవించవలెను. అప్పైనా చేసి నెయ్యి తాగవలెను. చచ్చిన తరువాత అగ్నిచేత భస్మమగు ఈ దేహము తిరిగిరావడ మెక్కడ?' అను చార్వాకమత మవలంబించి భ్రమ, కాంక్షలతో అకాలములో అమితాహారాదులు సేవించువారికి, సకాలములో అంగసాధనలు చేయక శరీరమును సుకుమారముగా పెంచుకొనువారిలో చాలమంది ఈ వ్యాధిచేత పీడితులగుదురు. ఇట్టివారు జీర్ణశక్తిని క్షీణింపచేసుకొని, మలబద్ధము నలవరచుకొని ఎనిమాలతో కాలక్షేపము చేయుచూ, పొత్తికడుపును, ప్రేగులను, వరములను దుర్బలపరచుకొని అపాన వాయువును అక్రమగతికి లోనుచేసి అజీర్ణవ్యాధితో (*Gastritis*) బాధపడుచుందురు.

జీర్ణముకాక క్రుళ్ళి దుర్వాసన పట్టిన మలమూత్రములమీదుగా అపాన వాయువు వ్యాపించి రొమ్ము కెగబాకి రక్తమును కల్మష మొనరించి, మస్తిష్కమునకు వ్యాపించి తల గిరగిర తిరుగునట్లుచేసి, శరీరమును అనేక బాధలకు లోనుచేయును. హృదయచలనము, నాడీచలనములు గతి తప్పును. ఇది హై బ్లడ్ ప్రెషర్ లోనూ, లో బ్లడ్ ప్రెషర్ లోనూకూడా కనపడును. దీనివల్ల మలబద్ధము వచ్చును. మధుమేహముతో చేరిన మూత్రవ్యాధి సంభవించును. జ్ఞాపకశక్తి క్షీణించును నిద్ర లోపించును.

యోగశాస్త్రమునందు ఈ రోగమును నివారించుటకు మహాముద్రతో బద్ధకోణాసన భేదప్రభేదములను, శీర్షాసనమునూ, శీతలీ నాడీశోధన ఉజ్జాయీ ప్రాణాయామములను చికిత్సగా వివరించబడినది. శీర్షాసన ప్రాణాయామములను వేరొక ప్రకరణములో వివరించగలను.

ఇప్పుడు బద్ధకోణాసనాభ్యాసక్రమమును చిత్రపటమునందు చక్కగ గమనించి, వాని రహస్యములను యోగనిష్ణాతులైన వారివద్ద సరిగా తెలుసుకొని అభ్యసించుట మేలు.

మొదట పశ్చిమతానాసనమునందువలెనే కూర్చుని రెండు కాళ్ళనూ చక్కగా చాచి, తరువాత రెండు మోకాళ్లు మడిచి రెండు మడమలనూ రహస్యేంద్రియము క్రిందనుండు నాడి (సీవని) రెండు ప్రక్కలకు అదిమిపట్టి తొడలను, మోకాళ్ళను భూమికి అనునట్లుంచి, రెండు పాదములనూ క్రమముగా రెండు చేతులతో గట్టిగా పట్టుకొని, వెన్నెముకను తిన్నగా నిలిపి, రొమ్మును ముందుకు వంచి, గడ్డమును రొమ్మునకు చేర్చి అదిమియుంచి, కండ్లు మూసుకొని, నడుమును వంగనీయక, ఉజ్జాయీ క్రమమును అనుసరించుచూ, దీర్ఘమూ సూక్ష్మము అయిన శబ్దముతో శ్వాసోచ్ఛ్వాసములు చేయుచు, ఇష్టదైవ ధ్యానముతో 10 నిమిషములకు తక్కువకాకుండ కూర్చుండవలెను. ప్రథమాభ్యాసులు ఒక నిమిషముతో మొదలుపెట్టి దినక్రమమున కాలమును హెచ్చించవలెను.

అయితే ఒకరోజు చేసి ఆరోగ్యము వృద్ధి పొందలేదనినచో లాభము లేదు. "సతు దీర్ఘకాలనైరంతర్యసత్కారాదర సేవితో దృఢభూమిః" అని పాతంజల సూత్రము.


వెనుక చెప్పిన పదహారు ఆధారస్తంభముల క్రిందనుండు త్రికోణాకారములో నుండు పదహారు నాడీసంవిధానములచుట్టూ పెరుగు దుర్మాంసములను కరిగించి, ఆ కోణములు తమతమ కొలతలకు లోబడియుండునట్లు అదుపులోనుంచగలుగుట వలననే ఇది బద్ధకోణాసనమని పేరుపొందినది.

[సశేషము]


కుర్రవాడు: (బయలుదేరుతున్న బంధువుతో) తొందరపడకండి, మా నాన్న, టైము ఒక గంట ముందుగా పెట్టారు.

—వలూరి రామారావు, బందరు.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras


పంచతంత్రం
సంధి-విగ్రహం
కర్త...విశ్వాత్ముల నరసింహమూర్తి
దేవశర్మ వెళ్ళగానే-చూరునుంచి సర్పమొకటి-ఊయలవైపు పాకుచుండె!
అది చూచిన ముంగిసయు-పాము మెడను కొరికి వేసి-పసివానిని కాపాడెను.
దానములను స్వీకరించి విప్రుడెంతో సంతసించి వడివడిగా వచ్చుచుండె.
చెంగున దూకుచు వాకిటనే ఎదురయ్యెను: సంతోషము పట్టలేక పాదములకు పెనవేసుకొనెను.
రక్తముతో తడిసియున్న ముంగిస మూతిని జూచి అది వచ్చిన త్రోవ జూచి విప్రుడు భయవిహ్వలుడయ్యెను.
"దుర్మార్గపు ముంగిసను నమ్మి నేను పసివానిని ఒంటరిగా విడిచిపోతి; ద్రోహియైన ఈ ముంగిస పసివానిని తినివేసెను!"
అని విప్రుడు చింతించి-కోపముతో కర్ర తీసి- ముంగిసనే చావమోదె.-తీవ్రమైన దెబ్బ తగిలి-ముంగిస ప్రాణము విడిచెను.
పుత్రునికై విలపిస్తూ విప్రుడు లోనికి పోయెను.
"అరె! పిల్లవాడు క్షేమముగా ఆటలాడుచున్నాడే!! మరి ముంగిస నోటిమీద రక్త మెట్లు వచ్చినది????..."
విప్రుడంత తత్తరపడి-ఇల్లంతా కలయచూచె:-ముక్కలుగా తెగిపడినా-కృష్ణసర్ప మగపడెను.-జరిగిన విషయమంత-అతనికప్పుడు బోధపడెను.
'నా బిడ్డను కాపాడిన-ముంగిసనే చంపుకొంటి' అని విప్రుడు చింతించెను.
(మేఘవర్ణుడు:-చిత్రవర్ణునితో) "కావున ఏకార్యమయిన వేగిరపడి చేయరాదు!"
48

సిద్ధముగానున్నది.



మూలం.

రాబర్ట్ లూయీ స్టీవెన్సన్

★

అనువాదం:

దాసు వామనరావు

★

డాక్టర్ జెకిల్ ఎండ్ మిస్టర్ హైడ్ (Dr Jekyl And Mr Hyde)

“మనిషిలో మనిషి” గ్రంథరూపంలో వెలువడినది

ప్రతులు కావలసినవారు తెప్పించుకొనుడు.

★

ప్రతి వెల రూ. 1-4-0

ఆంధ్ర గ్రంథమాల

తంబుచెట్టి వీధి, : : మద్రాసు 1.